ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 6, ఫిబ్రవరి 2024

డబ్బు..డబ్బు..

అధికార వైసీపీలో డబ్బు రాజకీయాలకు ప్రాధాన్యం పెరిగిపోయింది. వచ్చే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపికలో ఆపార్టీ అధిష్ఠానం ఈ తంతునే అనుసరిస్తోంది. ప్రధాన పార్టీలన్నీ అదే కోవలో ఉన్నాయనేది వాస్తవం. కానీ వైసీపీ వ్యవహార శైలి ఆ పరిస్థితిని తారస్థాయికి తీసుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. జగన్ ఆర్థిక వనరుల లేమి అనే పేరుతో పార్టీ కోసం పదేళ్లపై నుంచి కష్టపడుతున్న వారిని పక్కనపెట్టి వేరే వారిని రంగంలోకి తేవడంలోని ఆంతర్యం అదేనని తేటతెల్లమవుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా ప్రస్తుతానికి పదింటికి పార్టీ ఇన్‌చార్జిల పేరుతో అభ్యర్థులను ఖరారు చేశారు. ఆ సందర్భంగా వైసీపీ అనుసరించిన తీరును పరిశీలిస్తే ఆర్థిక స్థోమతే ప్రధాన ఆయుధంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. బలహీన వర్గాల వారికి ప్రాధాన్యతనిస్తున్నామనే మాట కూడా నిజం కాదన్నట్లు ఆ వర్గాలకు చెందిన వారైనా ఆశించిన స్థాయిలో ఆర్థిక వనరులు ఉంటేనే అవకాశం ఇస్తున్నారు.



లెక్క చూపితేనే సీటు

అదే ప్రధాన ప్రామాణికం

- వైసీపీలో జరుగుతున్న తంతు అదే
- ఇప్పటి వరకూ కష్టపడి అడిగినంత డబ్బు లేదన్న వారికి చెక్
- రిజర్వ్ అయినా.. బీసీ అయినా అదే లెక్క

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో ఇప్పటికి పది నియోజకవర్గాల వరకు అభ్యర్థుల ఎంపికను వైసీపీ పూర్తిచేసింది. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిని కూడా దాదాపు ఖరారు చేసింది. జిల్లాలో కొంత మంది ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలను సరైన ఆర్థిక వనరులు లేవన్న నెపంతో తొలగించింది. ఆయా అసెంబ్లీల వారీ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల్లో ఎంత ఖర్చుపెట్టాలో ముందుగానే ఆపార్టీ నిర్ధారించుకున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలు, అభ్యర్థుల ఎంపికలో కీలకపాత్ర పోషిస్తున్న ఐప్యాక్ బృందం ఆ మేరకు ఒక నివేదికను కూడా రూపొందించింది. ఆ ప్రకారమే ఆయా నియోజకవర్గాల వారీ అభ్యర్థులను ముందుగా మీరింత సొంత నిధులను వెచ్చించగలరా? లేదా? అని అడుగుతుండటం గమనార్హం.

బీసీ అయినా సరే..

దక్షిణప్రాంతంలో ఉండి వేరే లోక్‌సభలో కలిసిన ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో సీనియర్ ఎమ్మెల్యేకు ఇదే సమస్య ఎదురైనట్లు తెలిసింది. ఆర్థికంగా తాను ఏమాత్రం తూగలేనని ఆయన చెప్పడంతో బీసీ సామాజికవర్గం పేరుతో కొత్త అభ్యర్థిని రంగంలోకి దించే ప్రయత్నం చేశారు. అక్కడ వారు తొలుత సీఎం సూచించిన నేత నుంచి ఆర్థిక వనరులు సమకూరకపోవడంతో అదే సామాజికవర్గం నుంచి ఆర్థికంగా ఢోకాలేని మరొకరిని తెరపైకి తెచ్చారు. ఆయన వెనకడుగు వేయడం, లోక్‌సభ అభ్యర్థి విషయంలో అధిష్ఠానం అంచనా తారుమారవడంతో అక్కడి అభ్యర్థి ఎంపికకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇక లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలోనూ అదేతంతు సాగుతోంది. ఒంగోలు లోక్‌సభ నుంచి ప్రస్తుత ఎంపీ మాగుంట విషయంలో వ్యతిరేకంగా ఉన్న జగన్ తొలుత జిల్లాకు చెందిన నాయకుల పేర్లను పరిశీలించారు. అయితే ఆర్థికాంశాల విషయంలో సంతృప్తి రానందున వారి పేర్లను పక్కనపెట్టి దూరంలో ఉన్న జిల్లాకు చెందిన నాయకుడిని రంగంలోకి తెచ్చారు. ఈ విషయాలు క్రమేపీ వెల్లడవడంతో వైసీపీ అనుసరిస్తున్న డబ్బే ప్రాతిపదిక వ్యవహారం ప్రజల్లో ప్రధాన చర్చనీయాంశమైంది. డబ్బులుంటే ఎక్కడ ఎవరిని రంగంలోకి దించినా సరిపోతుందా? అని ప్రజానీకం ఆశ్చర్యచకితులవుతున్నారు.

అలాగైతేనే ఇన్‌చార్జి

వైసీపీకి పట్టున్న పశ్చిమప్రాంతంలో రూ.40 కోట్ల నుంచి రూ.60కోట్ల వరకు వెచ్చిస్తేనే ఫలితం ఉంటుందన్న భావనకు అధిష్ఠానం వచ్చినట్లు తెలిసింది. మార్కాపురం డివిజన్‌లోని ఒక నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేను తొలుత మీ నియోజకవర్గంలో రూ.40 కోట్లు ఖర్చుపెట్టాలి. కనీసం మీరు రూ.30కోట్లు చూసుకుంటే రూ.10కోట్ల సహకారం అందిస్తామంటూ ఐప్యాక్ ప్రతినిధులు చర్చలు జరిపినట్లు తెలిసింది. 'ఇప్పటికే మూడు ఎన్నికల్లో ఉన్నదంతా పెట్టా.. అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్మా. రూ.10 కోట్లకన్నా మించి పెట్టలేను' అని ఆయన తేల్చిచెప్పినట్లు తెలిసింది. అందుకు అధిష్ఠానం ససేమిరా అనడంతో ఆయన వేరే మెలిక పెట్టారు. తర్వాత ఆర్థికవనరులు ఉన్న అభ్యర్థులు దొరక్క పోవడంతో ఆయనకు ఇష్టమైన స్థానాన్ని కేటాయి స్తూ ఫిఫ్టీ ఫిఫ్టీ దామాషాలో అభ్యర్థి, పార్టీ వ్యయాన్ని భరించే రీతిలో టికెట్ కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. తాను ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో తిరిగి టికెట్ ఇస్తే రూ.30 కోట్లు వ్యయానికి ఇబ్బంది లేద ని చెప్పిన మరో ఎమ్మెల్యేకు నియోజకవర్గం మార్చి ఆయనకు ఇష్టం లేకపోయినా ఆ పది మేము ఇస్తాం అక్కడే ఉండండని చెప్పినట్లు సమాచారం.

రిజర్వు నియోజకవర్గంలో రూ.20కోట్లు చూపించాకే ఇన్‌చార్జి

మరో రిజర్వ్ నియోజకవర్గంలో ఇదే పంథాను అనుసరించగా పక్కనే గుంటూరు జిల్లాకు చెందిన నాయకురాలు ఆర్థికంగా భరించేందుకు ముందుకు రావడంతో ఆమెకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జిల్లాకు చెందిన వారికే అవకాశం ఇవ్వాలని ఒత్తిడి పెరగడంతో కనీసం రూ.20 కోట్లు భరించగలిగితే ఓకే అని చెప్పారు. ఆయన రూ.20 కోట్లు చూపించిన తర్వాతే ఇన్‌చార్జిగా ప్రకటించినట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక నాయకుల ఒత్తిడితో కీలక పదవిలో ఉన్న ఎమ్మెల్యేను తప్పించిన ఆ నియోజకవర్గంలో మీరు అడిగిన వారికి అవకాశం ఇస్తాం. రూ. 20 కోట్లు చూపించమని ఆదేశించినట్లు తెలిసింది. అవి చూపించేందుకు ఆయన రూ.10 కోట్ల విలువైన భూములను రూ.5 కోట్లకే అమ్ముకున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. తూర్పు ప్రాంతంలోని బాపట్ల జిల్లాలో ఉన్న ఒక నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జికి ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. గత ఎన్నికల్లోనే పెద్దమొత్తం సొంత డబ్బులు పెట్టుకున్న ఆయన రూ.30కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకూ ఖర్చు చేయగలమని చెప్పినట్లు తెలిసింది. అయితే రూ.70 కోట్లు పెట్టుకునే వారున్నారు, మీరెంత అని వారిని ఎత్తేసి వేరే జిల్లా వారిని రంగంలోకి తెచ్చారు. పక్కనున్న మరో నియోజకవర్గంలో ఇదే తంతు సాగుతోంది. మరో రెండు రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో కూడా ఆర్థిక వనరులున్న వారినే రంగంలోకి దింపడంలో కూడా అదే ప్రథమ లక్ష్యంగా భావిస్తున్నారు.



దర్శిలో ప్రభుత్వభూమిని ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

అలా వదిలేశారు

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- అడ్డుకోవడంలో అధికారులు విఫలం
- చాలాకాలం క్రితమే మార్కింగ్ వేసి పట్టించుకోని వైనం

దర్శి, ఫిబ్రవరి 5 : దర్శి పట్టణంలో ఎంతో విలువైన స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి సొంత స్థలాల్లో కలుపుకొంటున్నారు. ఏళ్ల తరబడి ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే లేడు. ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు, వారి ఒత్తిడి మేరకు కొలతలు వేసి హడావుడి చేయడం తప్ప ఆక్రమణలు తొలగించిన దాఖలాలు లేవు. ఎంతోకాలం క్రితం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చి ఆ తర్వాత వదిలేశారు. దర్శి-కురిచేడు రోడ్డులో దర్శి రెవెన్యూలోని 247, 248, 286 సర్వే నెంబర్లల్లో పది ఎకరాలకుపైగా బండి దారి భూమి ఉంది. అది కొన్ని సంవత్సరాలుగా దశలవారీగా ఆక్రమణలకు గురవుతోంది. ఒక కళాశాల యాజమాన్యం ఎకరం భూమిని ఆక్రమించి కళాశాలలో కలుపుకొని ప్రహరీ గోడను నిర్మించింది. మరి కొంత భూమిని చుట్టూ ఉన్న రైతులు ఆక్రమించుకొని వారి పొలాల్లో కలుపుకున్నారు. ఇటీవల కాలంలో స్థలాలకు ధరలు విపరీతంగా పెరగడంతో బండిదారి భూమిని మరికొందరు ఆక్రమించారు. ఆ ప్రాంతంలో రైతులు దారి ఆక్రమణకు గురవుతుందని, తాము పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని అనేకసార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొలతలు వేసి హద్దులను ఏర్పాటు చేశారు. ఆక్రమణలకు గురైన ప్రాంతాలను గుర్తించి తొలగింపు కోసం మార్కింగ్ కూడా ఇచ్చారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ అధికారులు అక్కడి ఆక్రమణల విషయాన్ని పట్టించుకోవడం లేదు. సుమారు 120 అడుగల వెడల్పు ఉన్న బండి దారి ప్రస్తుతం 40 అడుగులకు కుంచించుకుపోయింది. కొన్నిచోట్ల పూర్తిగా ఆక్రమణకు గురైంది. అదే ప్రాంతంలో మరో దారి పోరంబోకు స్థలాన్ని కొందరు వ్యక్తులు వెంచర్‌లో కలుపుకొని రోడ్లు వేశారు. అదేవిధంగా పొదిలి రోడ్డులో వాగు పోరంబోకు భూమిని కొంతమంది ఆక్రమించి అక్కడ నిర్మాణాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు స్థానిక అధికారులు హడావుడి చేయడం తప్ప ఒక్కచోటా ఆక్రమణలు తొలగించలేదు.రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంపట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బండి దారి ఆక్రమణ తొలగింపు కోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు మార్జిన్ స్థలాన్ని కొలిచి వేసిన మార్కింగ్

రేషన్ పంపిణీపై జేసీ దృష్టి

- ఒంగోలులో వాహనాల వద్ద పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : రేషన్ పంపిణీపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమాలను అరికట్టేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. బాధ్యతలు చేపట్టిన రోజే పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి రేషన్ వాహనం వద్ద బియ్యం పంపిణీని పరిశీలించిన ఆయన, సోమవారం మధ్యాహ్నం ఎవరికి తెలియకుండా ఒంగోలు నగరంలో పర్యటించారు. ప్రకాశం కాలనీలో రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న కార్డుదారులతో నేరుగా మాట్లాడారు. పంపిణీ ఎలా ఉంది? సక్రమంగా సరుకులు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఏ సమయంలోనైనా జేసీ తనిఖీ చేస్తారనే భయాన్ని ఎండీయూ ఆపరేటర్లలో కల్పించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ మాఫియా రెచ్చిపోతూ రాత్రికిరాత్రే లారీల్లో బియ్యాన్ని తరలిస్తోంది. ఈ నేపథ్యంలో మొబైల్ వాహనాల వద్దనే బియ్యాన్ని తనిఖీ చేసే విధానానికి జేసీ శ్రీకారం చుట్టడంతో అక్రమార్కుల్లో అలజడి మొదలైంది.



వాహనం వద్ద రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

వెలిగండ్లలో వైసీపీకి షాక్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

- ఆ పార్టీని వీడిన 173 కుటుంబాలు
- ఎంపీటీసీ సభ్యునితో సహా పలువురు టీడీపీలో చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, ఫిబ్రవరి 5 : మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. నేతల వైఖరి కారణంగా పార్టీలో కొనసాగలేమని భావించి ఊళ్లకు ఊళ్లు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నాయి. గత 15 రోజుల్లోనే దాదాపు 800మందికిపైగా వైసీపీకి బలంగా ఉన్న కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. సోమవారం మండలంలోని జిళ్లేలపాడు పంచాయతీకి చెందిన సీనియర్ నాయకుడు, వైసీపీ మండల మాజీ కన్వీనర్, వెలిగండ్ల ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వరరెడ్డి పార్టీని వీడారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతోపాటు ఆయన సతీమణి గోకులం పంచాయతీ సర్పంచ్ చిలకల సుబ్బరత్తమ్మ, జిళ్లేలపాడులోని 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. డాక్టర్ ఉగ్ర వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో వైసీపీ నాయకులు ప్రజాపాలన పక్కనపెట్టి, అభివృద్ధి చేయకుండా దోచుకున్నారని. పేదలు, దళితుల భూములను కూడా ఆక్రమించుకున్నారన్నాని విమర్శించారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఎమ్మెల్యేలను మార్చుతున్న జగన్‌ను మార్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ అన్నారు. తాను అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, మౌలాలీ, సలోమన్ రాజు, కొండు భాస్కర్‌రెడ్డి కర్నాటి భాస్కర్ రెడ్డి, మీనిగ కాశయ్య, కారంపూడి వెంటేశ్వర్లు, మెటాటి సుబ్బరెడ్డి, చిలకల కృష్ణారెడ్డి, కేసరి రమణారెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశిరెడ్డి ఆధ్వర్యంలో 23 కుటుంబాలు..

వెలిగండ్ల మండలంలోని పి.రాళ్లపల్లి గ్రామానికి చెందిన 23 కుటుంబాలు ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి డాక్టర్ ఉగ్ర పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, ఇంద్రభూపాల్‌రెడ్డి, గోనా ప్రతాప్, పి.రాళ్లపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో కట్టడి

- 80 మంది సర్పంచ్‌లకు నోటీసులు



మహిళా సర్పంచ్‌కు నోటీసు ఇస్తున్న కానిస్టేబుల్

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 5 : సర్పంచ్‌లపై ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తోంది. పంచాయతీ చాంబర్ ఆధ్వర్యంలో సోమవారం చలో అసెంబ్లీకి పిలుపు నిచ్చారు. దీంతో జిల్లాలోని సర్పంచ్‌లు ఎవరూ ఆ కార్యక్రమానికి హాజరుకాకుండా ముందస్తు చర్యలను అధికారులు తీసుకున్నారు. ఈ మేరకు సుమారు 80 మంది సర్పంచ్‌లకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లవద్దని హుకుం జారీ చేశారు. దీంతో జిల్లా నుంచి స్వల్ప సంఖ్యలోనే సర్పంచ్‌లు వెళ్లినట్లు సమాచారం.



చందవరం-1 ట్యాంకులో అరకొరగా చేరిన సాగర్ జలాలు



మిర్చి కోతలకు కూలీల డిమాండ్

- కర్నూలు, కడప, బాపట్ల జిల్లాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- రోజు కూలి రూ.400
- తోటల్లో ఎండిపోతున్న కాయలు

లోపలి పేజీల్లో..

పొంచి ఉన్న నీటి ముప్పు

- సాగర్ జలాలు విడుదలైనా ప్రయోజనం శూన్యం
- మొరాయించిన మోటార్లు
- వేసవి చెరువులకు అరకొరగానే చేరిన నీరు

దొనకొండ, ఫిబ్రవరి 5 : రానున్న వేసవిలో గ్రామాల్లో ప్రజలకు దాహార్తి కేకలు తప్పని పరిస్థితి కనిపిస్తోంది. పల్లె ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మండలంలోని చందవరం గ్రామ సమీపంలో ఏర్పాటైన చందవరం-1, చందవరం-2 సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో అరకొరగానే నీరు నిల్వ ఉంది. తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం కాలువలకు విడుదల చేసిన సాగర్ జలాలు గతనెల 13వ తేదీన చందవరానికి చేరాయి. వీటిని అధికారులు యుద్ధప్రాతిపదికన స్టోరేజీ ట్యాంకులకు పంపింగ్ చేయాల్సి ఉంది. అయితే ఆ సమయంలో కొద్దిరోజులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఏర్పడింది. మరికొద్ది రోజులు మోటార్లు మొరాయించాయి. అధికారులు పరిస్థితిని చక్కదిద్దే సమయానికి కాలువలకు సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో చందవరం-1 స్టోరేజీ ట్యాంకుకు కొద్దిపాటి నీటిని మాత్రమే సిబ్బంది పంపింగ్ చేసినట్లు సమాచారం. ఈ ట్యాంకు పరిధిలో మండలంలోని 29 గ్రామాల్లోని ప్రజలకు నీటి సరఫరా జరుగుతుంది. అయితే స్టోరేజీ ట్యాంకులో ప్రస్తుతం అరకొరగా నీరు ఉండటంతో వేసవిలో గ్రామాల్లో ప్రజలు దాహార్తితో అల్లాడిపోయే పరిస్థితి ఎదురుకానుంది.

అన్నీ సమస్యలే

కెనాల్‌కు అతి సమీపంలో ఉన్న చందవరం-2 స్టోరేజీ ట్యాంకుకు పంపింగ్ చేసే 100 హెచ్‌పీ మోటారు మొరాయించింది. తిరిగి మోటారు ఏర్పాటు చేసే సమయానికి కాలువలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ట్యాంకుకు అరకొరగా సాగర్ జలాలు చేరాయి. ఇక్కడి నుంచి కొనకనమిట్ల, హెచ్‌ఎంపాడు, కనిగిరి తదితర మండలాల్లోని దాదాపు 132 గ్రామాల ప్రజలకు నీటి సరఫరా జరుగుతోంది. అయితే ప్రస్తుతం స్టోరేజీలో ఉన్న నీరు సక్రమంగా గ్రామాలకు సరఫరా చేస్తే రెండు నెలలు కూడా రావు. తర్వాత సమస్య ఎదురయ్యే ప్రమాదం ఉంది. కాంట్రాక్టర్లు అధికారపార్టీ ప్రజాప్రతినిధులు కావడంతో మోటార్ల మరమ్మతులు, పైపులైన్ల బాగు విషయాన్ని సంబంధిత అధికారులు గట్టిగా చెప్పలేకపోయారు. దీంతోనే స్టోరేజీ ట్యాంకులకు సాగర్ జలాలు సకాలంలో పంపింగ్ చేయలేకపోయారని, ఫలితంగా వేసవిలో ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

మార్చి ఆఖరు దాకా సమస్య లేకుండా చూస్తాం

సాగర్ జలాలు కేవలం ఏడు రోజులు మాత్రమే సరఫరా కావడం, కొన్ని సాంకేతిక సమస్యలతో చందవరం-1 స్టోరేజీకి నీరు అనుకున్న స్థాయిలో పంపింగ్ జరగలేదు. ప్రస్తుతం స్టోరేజీ ట్యాంకులో ఉన్న 40శాతం నీటిని గ్రామాల్లో ప్రజలకు సమస్య లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ మార్చి ఆఖరు వరకు సరఫరా అయ్యేలా చర్యలు చేపడతాం.

\- ఎం.మధు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ



సాగర్ కాలువలో నిలిచిపోయిన నీటి సరఫరా



జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరిక

● కండువాలు కప్పి ఆహ్వానించిన జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 5 : వైసీపీపాలనపై విసుగు చెందిన పలువురు ఆ పార్టీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం స్థానిక 46వ డివిజన్‌కు చెందిన వందకుపైగా కుటుంబాలు వైసీపీని వీడితున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక గుంటూరు రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ దారుణాలు చూడలేక, ఆ పార్టీలో ఉండలేక అధిక శాతం మంది టీడీపీలోకి చేరుతున్నారని ఆయన అన్నారు. టీడీపీలో చేరడం శుభ పరిణామం అన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు, ఉంటుందన్నారు. తాను అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. పార్టీలో చేరిన వైసీపీ యువత మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. జనార్దన్‌ను మరో సారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



అన్నవరప్పాడులో జనసేన కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆ పార్టీ నాయకులు

భరోసా పత్రాలతో చేతులు దులుపుకొన్న ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 :నగరంలో పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో కేవలం భరోసా పత్రాలు ఇచ్చి వైసీపీ ప్రభుత్వం చేతులు దులుపుకుందని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. జనచైతన్యయాత్రలో భాగంగా సోమవారం 15వ డివిజన్ పరిధిలోని అన్నవరప్పాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకోవడంతో పాటు జనసేన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను విస్మరించిందన్నారు. ఒంగోలులో పేదలు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. గత నాలుగున్నర స ంవత్సరాల నుంచి ఇంటి స్థలాలతో పేరుతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆ డివిజన్ అధ్యక్షుడు మర్రిపూడి ఉదయ్, ఉంగరాల సాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు ముత్యాల కల్యాణ్, పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష, మాదాపు సాయినాయుడు, ఉంగరాల వాసు, ఆనూష, మర్రిపూడి మాధవి, అంజలి, నరేష్, అవినాష్‌నాయుడు, కిరణ్, బాలాజీ ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తున్న రిటైర్డ్ పెన్షనర్లు

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీఆర్‌పీఏ గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన పుల్లారావు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతి నెలా 1వతేదీనే పెన్షన్లు ఇవ్వాలన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలను మంజూరు చేయడంతో పాటు ఈపీఎఫ్ పెన్షన్లకు రూ. 10వేలు కనీస పెన్షన్‌అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి. శేషయ్య, రాంబాబులు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వతేదీ వరకు రిలే దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు టీవీఆర్ సుబ్బారావు, కే దేవానందం, జి. నరసయ్య తదితరులు ఉన్నారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి డి. ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఎస్. రవిలు రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు.



సాగర్ కాలువపై సైడ్ గోడలు దెబ్బతిన్న వంతెన

ప్రమాదకరంగా వంతెన

ఒంగోలు(రూరల్)ఫిబ్రవరి5: ఒంగోలు నగరం నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లే రోడ్డులో సాగర్ కాలువ పై గల వంతెన గోడలుపూర్తిగా దెబ్బతిన్నాయి. సైడు గోడలు లేక పోవటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒంగోలు నగరం నుంచి రోజూ వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం తీసుకొని గుత్తికొండవారిపాలెం దగ్గర గల డంపింగ్ యార్డుకు వాహనాలలో తరలిస్తున్నారు. ఇలా నిత్యం 70 వాహనాలు రోజూ వంతెనపై ప్రయాణిస్తుంటాయి. ఒంగోలు నుంచి ఇదే వంతెనపై నుంచి కరవది, ఉలిచి, చేజర్ల, బీవీపాలెం, దేవరంపాడు, గుండాయపాలెం , పాతపాడు తదితర గ్రామాలకు వాహనాలపై ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న వంతెన గురించి అధికారులు పట్టించుకొని వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 5 : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పీఎన్‌సీఏ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి సూచించారు. స్థానిక పీఎన్‌సీఏ జూనియర్ కళాశాలలో సోమవారం సీనియర్ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతారాణి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా వాటి సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలి

స్పందనలో కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వచ్చే అర్జీలను పారదర్శకంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో డయల్ యువర్ కలెక్టర్ అనంతరం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు ఆయా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పని సరిగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, ఝాన్సీలక్ష్మి, జిల్లాపరిషత్ సీఈవో జాలిరెడ్డితో పాటు శాఖల అధికారులు ఉన్నారు.



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఈనెల 12న విజయవాడలో రిలే దీక్షలు చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జివి కొండారెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జీవీ రాగయ్యలు తెలిపారు. ఆమేరకు కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజలకు సేవలు అందించాలి

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు కష్ట పడి పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం 18 మంది నిరుద్యోగులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఆర్టీసీ, ఇతర శాఖల్లో పనిచేసిన మృతిచెందిన వారి వారసులకు ఈ ఉద్యోగ నియామకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి ఉషారాణి, కలెక్టరేట్ ఏవో చిరంజీవి తదితరులు ఉన్నారు.

జయహో బీసీ సభను జయప్రదం చేయండి

పొన్నలూరు (కొండపి), ఫిబ్రవరి 5 : టీడీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న పొన్నలూరులో నిర్వహించే జయహో బీసీ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కుర్రా మాల్యాద్రి పిలుపునిచ్చారు. సోమవారం పొన్నలూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో బీసీలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని తెలిపారు. మళ్లీ పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన నేపథ్యంలో బీసీలందరూ టీడీపీకి అండగా నిలవాలని కోరారు. జయహో బీసీ సభలో ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొంటారని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ ప్రసాద్, కర్రా కోటిరెడ్డి, మండవ మురళి, రాపూరి కోటేశ్వరమ్మ, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రేపటి నుంచి మన గ్రామానికి మన సత్య కార్యక్రమం...

మన గ్రామానికి మన సత్య పేరుతో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాలు 7,8,9 తేదీల్లో మండలంలో జరుగుతాయని పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు తెలిపారు. అన్ని గ్రామాల్లోని నాయకులను, కార్యకర్తలను సత్య కలుసుకుని మాట్లాడతారని ఆయన వివరించారు.

టీడీపీ విజయానికి కలసికట్టుగా కృషి చేయాలి

మద్దిపాడు,ఫిబ్రవరి 5: రాబోయే ఎన్నికలలో అందరం కలిసికట్టుగా టీడీపీ విజయానికి కృషి చేయాలని మద్దిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ జయంతి బాబు అన్నారు. మండలంలోని రాచవారిపాలెం గ్రామంలో నిర్వహించిన మన ఊరు మన తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా గ్రామంలోని ప్రధాన సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు అడ్డాల ఫణి, దేవబత్తిన ప్రసాదరావు, రావి ఉమామహేశ్వర రావు, మండవ గోపీ చంద్, చింతల శ్రీనివాస రావు, రావి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు జయంతిబాబు

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ ఒకేషనల్ పరీక్షలు

మద్దిపాడు కడియాల యానాదయ్య కళాశాలలో నిర్వహిస్తున్న ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ తెలిపారు. సోమవారం పరీక్షా కేంద్రాలను బాపట్ల డీవీవో ఆంజనేయులు తనిఖీ చేశారు. శ్రీవిద్య ఒకేషనల్ కళాశాలలో పరీక్షలను సీసీ కెమెరా నిఘా పర్యవేక్షణలో నిర్వహించారు.

అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరగాలి

విద్యార్థులకు ప్రభుత్వం అందించే టెక్నాలజీ ప్రకారం ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధించాలని విద్యాశాఖ డైరెక్టర్ విజయభాస్కర్ ఆదేశించారు. సోమవారం గుండ్లాపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎంవీఆర్ ఆంజనేయులు, మెడబలిమి శ్రీనివాసరావు, మండవ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : మధ్యాహ్న భోజనం పథక ం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా కార్యదర్శి పి. కల్పన డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు రూ. 10వేల వేతనం ఇస్తానని, వారికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ. 10వేలతో పాటు జగనన్న గోరుముద్దకు ఒక్కొక్క పిల్లవాడికి మెనూ చార్జీలకు రూ.20 ఇవ్వాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే అమలు చేయడంతో పాటు పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా, కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యంతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం డీఈవో సుబ్బారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గురునాథం, హనుమంతరావు, సుబ్బరత్తమ్మ, అంజమ్మ, మాణిక్యమ్మ, వెంకటేశ్వరమ్మ, లక్ష్మీ క్రాంతి, హైమావతి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

టంగుటూరు, ఫిబ్రవరి 5 : మండలంలోని వల్లూరమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకూ ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ తెలిపారు. వివరాలను ఆయన సోమవారం వెల్లడించారు. ఆప్రకారం తొలి రోజైన మంగళవారం శ్రీవల్లూరమ్మ ఆలయంలో గోపూజ, కుంకుమార్చనలు, భజన సంకీర్తనలు జరుగుతాయి. 7వ తేదీన మడనూరులోని శ్రీపర్వత వర్ధిని సమేత జ్వాలాముఖి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, కోలాటం నిర్వహిస్తారు. 8వ తేదీన తూర్పునాయుడుపాలెంలోని శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అష్టోత్తర పూజలు, కూచిపూడి నృత్యప్రదర్శన ఉంటుంది. 9వ తేదీన వల్లూరులోని సోమేశ్వరస్వామి ఆలయంలో గోపూజ, కుంకుమార్చనలు, పల్లకి సేవ జరుగుతాయి.

10వ తేదీన కారుమంచిలోని కాశీవిశ్వేరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అష్టోత్తరం, ప్రవచనం ఉంటాయి. 11న వల్లూరమ్మ దేవస్థానంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 12న టంగుటూరులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, కోలాటం జరుగుతాయని ఈవో రమేష్ వెల్లడించారు.

దళిత యువతి మృతికి కారణమైన యువకుడిని అరెస్టు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : దళిత యువతి తులసీని బెదిరించి కులాంతర వివాహం చేసుకొని ఆమె మృతికి కారణమైన సాయిని అట్రాసిటీ కేసు కింద అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరాకాలనీలోని తులసీ మేనత్త కోటేశ్వరమ్మతో మరణానికి గల కారణాలను సోమవారం అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ ఇందిరా కాలనీకి చెందిన తులసీని ప్రేమిస్తున్నానని సాయి వెంటపడి బెదిరించి వివాహం చేసుకొని ఇప్పుడు దారుణంగా చంపడం దారుణంగా ఉందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. వైసీపీ మహిళా నాయకులు సువర్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 9వతేదీన జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు మధ్యాహ్న భోజన అనంతరం ఆల్బెండజోల్-400 ఎంజీ మాత్రలను మింగించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా నులిపురుగుదల దినోత్సవం సందర్భంగా ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి, ఎన్‌డీడీ నోడల్ అధికారి డాక్టర్ భగీరథ, డీఈవో వీఎస్‌సుబ్బారావు, డీఎల్‌టీవో డాక్టర్ సురేష్, ఐసీడీఎస్ పీడీ తదితరులు ఉన్నారు.

12న ఒంగోలులో అప్రంటీస్‌షిప్ మేళా

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 5 : స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈనెల 12న ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు సహాయ అప్రంటీస్ అడ్వయిజర్, ప్రిన్సిపాల్ ఎంవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ అప్రంటిస్ షిప్ మేళాలలో ప్రముఖకంపెనీలు పాల్గొంటాయన్నారు.ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆయా కంపెనీల యాజమాన్యాలు అప్రంటీస్‌కు ఎంపిక చేస్తారన్నారు.ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు శిక్షణ, భృతి చెల్లిస్తారన్నారు. జిల్లాలో ఐటీఐ పాసైన అభ్యర్థులు తమ వివరాలను అప్రంటిస్ ఇండియా డాట్ ఓఆర్జీ పోర్టర్‌లో నమోదు చేసుకొని తమ బయోడేటా, ఒరిజనల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలతో ఈమేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9703165456 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొండపి తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

కొండపి, ఫిబ్రవరి 5: కొండపి తహసీల్దార్‌గా బి.కిరణ్‌కుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కిరణ్‌కుమార్ ఎన్నికల్లో బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా వినుకొండ నుంచి ఇక్కడకు వచ్చారు.

జరుగుమల్లి తహసీల్దార్‌గా చక్రవర్తి..

జరుగుమల్లి (కొండపి) : మండల తహసీల్దార్‌గా కె.ఎస్.చక్రవర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది చక్రవర్తిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

సింగరాయకొండ తహసీల్దార్‌గా రామయ్య..

సింగరాయకొండ : సింగరాయకొండ తహసీల్దార్‌గా ఎస్.రామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, మండలంలోని వీఆర్వోలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఉష పల్నాడు జిల్లా సత్తెనపల్లెకు బదిలీ అయ్యారు. రామయ్య తిరుపతి జిల్లా పెళ్లకూరు నుంచి ఇక్కడికి వచ్చారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సతీష్

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి 5: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా శ్రీపతి సతీస్‌ను తిరిగి నియమిస్తూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిలారెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఎస్ తులసిరెడ్డి సతీష్ నియమకాన్ని మీడియాకు విడుదల చేసారు. ఎన్ఎస్‌యూఐ నాయకుడుగా , యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన సతీష్ గతంలో కూడా రాష్ట్ర అధికారప్రతినిధిగా పనిచేస్తున్నారు. తిరిగి సతీష్‌ను ఎంపిక చేయడాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందించారు

నిడమలూరులో తాగునీటికి కటకట

ఎం.నిడమలూరు(టంగుటూరు) ఫిబ్రవరి 5 : మండలంలోని ఎం.నిడమలూరులో తాగునీటికి కటకట ఏర్పడింది. నాలుగు రోజుల క్రితం రక్షిత మంచి నీటి పథకం బోరు మరమ్మతులకు గురవడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. కొందరు బోర్ల సౌకర్యం ఉండే ఇళ్లకు వెళ్లి బతిమాలుకొని నీరు తెచ్చుకొని సర్దుబాటు చేసుకుంటున్నారు. మిగిలిన వారు వాడుక నీటి కోసం చేతి పంపులపై ఆధారపడుతున్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చీమకుర్తి, ఫిబ్రవరి5 : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా,మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మండలపరిధిలోని పల్లామల్లి గ్రామ శివారున బండ్లమూడికి వచ్చే రహదారిపై ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బండ్లమూడి గ్రామానికి చెందిన ఆవులమంద శ్రీనివాసరావు,చీమకుర్తికి చెందిన కోటి అనే ఇద్దరు మిత్రులు కేబుల్ ఆపరేటర్లుగా పనిచేస్తుంటారు.వీరిద్దరూ పనిపై బైక్‌మీద పల్లామల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. బైక్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలైన ఆవులమంద శ్రీనివాసరావు మృతి చెందగా గాయాలైన కోటిని ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.సీఐ దుర్గాప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.కేసు విచారణ జరుపుతున్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

సంతనూతలపాడు, ఫిబ్రవరి 5: సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయాన్ని జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరిబాబు సోమవారం ప్రారంభించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కందుకూరి బాబు మాట్లాడుతూ నిరంకుశ పరిపాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండలజనసేన అధ్యక్షుడు ఎమ్.ఫణీంద్ర, చీమకుర్తి, మద్దిపాడు మండల జనసేన అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : చుట్టూ ఉండే వివిధ రకాల పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ రాజమోహన్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రకేసరి యూనివర్శిటీలో యంత్రాల ద్వారా జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజగోపాల్ మాట్లాడుతూ ఆంధ్రకేసరి క్యాంపస్‌లో పిచ్చి మొక్కలను తొలగించి ఆహ్లాదకరంగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిర్వహణ కర్త, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. హర్షప్రీతందేవ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ స్వచ్ఛభారత్‌లో భాగస్వామ్యులు కావాలన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించే కార్యక్రమంలో ప్రజలతో కలిసి భాగస్వామ్యులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి. సోమశేఖర్, అడ్మినిస్ట్రేటిన్ డైరెక్టర్ డాక్టర్‌పి. వెంకట్రావు, డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఆంధ్రకేసరి యూనివర్శిటీలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న మిషన్

ఈపంట నమోదు తనిఖీ



ఈపంట నమోదును తనిఖీచేస్తున్న ఏడిఏ రమేష్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 5: మండలంలోని గంగవరం, పేర్నమిట్ట, మంగమూరు రెవెన్యూ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదును ఒంగోలు ఏడీఏ బి.రమేష్ బాబు తనిఖీచేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు చీడపీడలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు తగుసూచనలు ఇవ్వాలని వీఏఏలకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పావని, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

ఒంగోలు(రూరల్),ఫిబ్రవరి5: కేంద్రప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి తీసుకు పోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శివారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో సోమవారం మహిళా మోర్చ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ వచ్చే ఎన్నికలలో బీజేపీ గెలుపే ధ్యేయంగా మహిళలు పని చేయాలని పిలుపునిచ్చారు. మహిళా నాయకులు కె. మాధవి, లక్ష్మి, తీగల సత్యవతి, జువ్విగుంట కోటేశ్వరి, మద్దినేని లక్ష్మీదేవి, శివకుమారి, విజయరావు , శ్రీలక్ష్మి ,అజంతా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

నాగులుప్పలపాడు ఎస్ఐగా బ్రహ్మనాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు

నాగులుప్పలపాడు (ఒంగోలురూరల్)ఫిబ్రవరి5: నాగులుప్పలపాడు నూతన ఎస్ఐగా బ్రహ్మనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహపూర్వక పోలీసింగ్ విధానంతో పోలీస్‌లు బాధ్యతలు నిర్వహిస్తామని తెలిపారు.శాంతి భద్రతలను పూర్తిగా కంట్రోల్‌లో ఉంచుతానని తెలిపారు.

ఎంపీడీవోగా మహలక్ష్మి

మండల ఎంపీడీవోగా వై.మహాలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గుంటూరు జిల్లా నకరికల్లు నుంచి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

వైద్యశాఖ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 6 : వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని మాదిగసంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు .సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోనిపక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు యండమూరి పుస్తకాల పంపిణీ

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 5: ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంకుకు 100 సూత్రాలు పుస్తకాలను ఒంగోలు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ న్యాయమూర్తి వి.నాగేశ్వరరావు, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రముఖ మెజీషియన్ బి.వి.రామన్ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రదర్శించిన మేజిక్ షో విద్యార్థులను చైతన్యపరిచింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పసుపులేటి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.చిన్న వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

పేస్‌లో కృత్రిమ మేధస్సుపై సదస్సు



అవగాహన సదస్సులో వివరిస్తున్న రాఘవేంద్ర

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 5 :స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధస్సు ఉపయోగించి పరిశోధనా పత్రరచనపై అధ్యాపకులకు, విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వరంగల్ నీట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గుజ్జుల రాఘవేంద్ర కృత్రిమ మేధస్సు ఉపయోగించి ప్రతిభావంతమైన పరిశోధనా రచనపై వివరించారు. అక్టికల్ రైటింగ్ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్ పరిశోధన, అభివృద్ధి డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సంతనూతలపాడు తహసీల్దార్‌గా మీరావలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 5: సంతనూతలపాడు తహసీల్దార్‌గా షేక్. మీరావలి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పి.మధుసూదనరావు గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది మీరావలిని ఘనంగా సత్కరించారు.

ఎంపీడీవోగా శ్రీహరి... నూతన ఎంపీడీవోగా ఎం.శ్రీహరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా కోవూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడకు బదిలీ చేశారు.

విద్యుత్ తీగల చోరీ

మద్దిపాడు,ఫిబ్రవరి 5: చిన్న మల్లవరం జగనన్న కాలనీలో విద్యుత్ తీగల చోరీ జరిగినట్లు విద్యుత్ ఏఈ రవిప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్దిపాడు ఎస్ఐ బుద్ధాల శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుళికల మందుతిని యువకుడు ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, ఫిబ్రవరి 5 : మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఎస్టీ కాలనీలో సోమవారం గుళికల మందుతిని పొట్లూరి చంటి అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్యాభర్తల మధ్య వచ్చిన కలహాల నేపథ్యంలో ఇంట్లోనే గుళికల మందు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన బంధువులు అద్దంకి 108 వాహనానికి సమాచారం అందించటంతో వారు వచ్చి ప్రథమ చికిత్స చేసి వెంటనే ఒంగోలు వైద్య శాలకు తరలించారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేత దాడి

మార్టూరు, ఫిబ్రవరి 5 : బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న టీడీపీ కార్యకర్త విప్పర్ల బాలకృష్ణపై వైసీపీ నేత దాడి చేశారు. ఈ సంఘటన సోమవారం ఉదయం డేగరమూడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శ కాలనీ వద్ద చోటుచేసుకుంది. కొన్ని రోజులుగా ఈ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆదర్శ కాలనీలో టీడీపీ కార్యకర్త విప్పర్ల బాలకృష్ణ ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమం గురించి ప్రజానీకానికి వివరిస్తున్నారు. ఈ సమయంలో మహిళా సర్పంచ్ భర్త, వైసీపీ నేత వీరయ్య ఆదర్శ కాలనీకి వచ్చి, ఇక్కడేం పనంటూ కర్రతో భౌతిక దాడి చేసినట్లు బాలకృష్ణ తెలిపారు. అనంతరం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్ బాలకృష్ణకు ఫోన్‌చేసి సీఐ రమ్మన్నారని తెలిపారు. దీంతో భయపడిన బాలకృష్ణ ఆ తర్వాత ఆచూకీ లేదు. ఇదిలా ఉండగా.. పార్టీ గురించి ప్రచారం చేసుకోవడం నేరమా అంటూ గ్రామ టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మార్టూరు స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రాజశేఖరరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వీరయ్య ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. గ్రామానికి చెందిన బాలకృష్ణ మరో వ్యక్తితో కలిసి ఇంటింటా తిరుగుతూ వారి సెల్ ఫోన్‌లను తీసుకొని వారే పార్టీకి చెందిన యాప్‌లను లోడ్ చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమై అతను ఫిర్యాదు చేసినట్లు రాజశేఖర రెడ్డి తెలిపారు. దీనిపై విచారణ చేయడానికి బాలకృష్ణను పిలిపించామన్నారు. కేసు నమోదు చేయలేదని చెప్పారు.

కష్టతరంగా గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ

కక్షగట్టినట్లు అధికారుల తనిఖీపై యజమానుల ఆందోళన

మార్టూరు, ఫిబ్రవరి 5 : గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ కష్టతరంగా మారిందని యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ తీరుపై చర్చించేందుకు సోమవారం మార్టూరులోని గ్రానైట్ అసోసియేషన్ కార్యాలయంలో పరిశ్రమల యజమానులు సమావేశమయ్యారు. గత నెల 30న టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్ ఫ్యాక్టరీలో నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్ తమ సిబ్బందితో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా జరిగిన వివాదంలో బాలాజీనాయక్ ఫిర్యాదు మేరకు ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసులో మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్‌తో పాటు గ్రానైట్ యజమాని షేక్ రజాక్ కూడా ఉన్నారు. వీరికి పరిశ్రమల యజమానులు సంఘీభావం ప్రకటించారు. భవిష్యత్తులో మార్టూరు ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలను నిర్వహించడం కష్టతరంగా మారుతుందని సమావేశంలో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. విజిలెన్స్ ఏడీ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు, తమ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి కేసును నమోదు చేయకపోవడంతో కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా పరిశ్రమల నిర్వహణలో ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాలని మెజారిటీ గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆలోచన చేసినట్లు తెలిసింది. ఈ సమావేశానికి మార్టూరు ప్రాంతంలోని 70 మందికి పైగా గ్రానైట్ పరిశ్రమల యజమానులు హాజరయ్యారు.


కరాటేలో కనిగిరి విద్యార్థులకు పతకాలు



సినీ నటుడు సుమన్ చేతులమీదుగా పతకాలు అందుకుంటున్న కనిగిరి కరాటే క్రీడాకారులు

కనిగిరి, ఫిబ్రవరి 5 : విశాఖపట్నం రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో ఈనెల 3, 4 తేదీల్లో ఏడవ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కనిగిరికి చెందిన కరాటే స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరచి బంగారు, రజత పతకాలు సాధించినట్లు అకాడమీ మాస్టర్ యాసిన్ ఆదివారం తెలిపారు. పోటీల్లో క్రీడాకారులు బాలబాలికల ఫైట్, కటాస్ విభాగంలో అండర్ - 11 కటాస్ విభాగంలో షేక్ అఫ్రుద్దీన్, ఫైట్ విభాగంలో ఆర్.హర్షవర్ధన్‌రెడ్డి బంగారు పతకాలు సాధించారు. అండర్-12 కటాస్, ఫైట్ విభాగంలో బీవీఎన్ హేమంత్ సాయి రెండు రజత పతకాలు, అండర్-13 కటాస్ విభాగంలో వెంకటరాజేశ్వరి బంగారు, కటాస్ విభాగంలో ఏ శశిరారెడ్డి రజత పతకంతో పాటు ఫైట్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. అండర్-14 విభాగంలో టీ విష్ణు బంగారు పతకం, కటాస్ విభాగంలో ఆర్ జ్ఞాన దీక్ష రజత పతకం, కాంస్య పతకం సాధించగా, కే మానస ఫైట్, కటాస్ విభాగంలో రజత, కాంస్య పతకాలు సాధించింది. అండర్ - 15 విభాగంలో పీ రాజ్యలక్ష్మి కటాస్ విభాగంలో కాంస్య పతకం, యోగేశ్వర ఆనంద్ రజత పతకాలు సాధించారు. ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా క్రీడాకారులకు పతకాలు అందుకున్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు షేక్ అబ్దుల్ వహీద్, షేక్ సుల్తాన్‌బాషాలను అభినందించి బెస్ట్ టీం ట్రోఫీని అందించినట్లు అకాడమీ మాస్టర్ తెలిపారు.

100 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



బాటిళ్లను చూపిస్తున్న ఎస్ఐ సైదుబాబు

పామూరు, ఫిబ్రవరి 5 : మద్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సైదు బాబు తెలిపారు. కారులో అక్రమంగా మద్యంను తలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడి చేయగా 100 బాటిళ్లతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కౌలు రైతుల ఆవేదన



వెంగముక్కలపాలెంలో శనగ పంటను దున్నుతున్న ట్రాక్టర్

ఇళ్ల పట్టాల కోసం పంట పొలాలు దున్నకం

శనగ వేసిన దళిత కౌలుదారులకు అన్యాయం

ఎకరా సాగుకు పెట్టుబడి రూ.18,500, నష్టపరిహారం

రూ.10వేలపై ఆగ్రహం

చేతికొచ్చిన పంట చేజారిపోతుందని బాధితుల ఆవేదన

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 3 : నగర పరిధిలో జగనన్న ఇళ్లపట్టాల కోసం సేకరిస్తున్న భూమిలో సాగు చేస్తున్న దళిత కౌలు రైతులకు తీరని అన్యాయం జరిగింది. పంట మధ్య కాలంలో భూమిని లాక్కోవడంపై వారు కన్నీళ్లపర్యంతమవుతున్నారు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఈ నెల 15వ తేదీలోపు ముఖ్యమంత్రి చేతులమీదుగా పట్టాలను పంపిణీ చేయాలని భావిస్తుండగా, నిబంధనలు సైతం తుంగలో తొక్కి చేతికొస్తున్న పంట పొలాలను దున్నేస్తున్నారు. సొంతంగా పొలాలు కలిగిన యజమానులకు నష్టపరిహారం అందగా, కౌలు తీసుకుని శనగ సాగు చేసిన సుమారు యాభైమంది రైతులు లబోదిబోమంటున్నారు. అసలు కౌలుకు తీసుకున్న రైతుల్లో తొంభై శాతం మంది దళిత రైతులే ఉండటం గమనార్హం. వీరికి ప్రభుత్వం నేరుగా పైసా ఇవ్వకపోగా, పొలాలు కలిగిన యజమానులే కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించడం గమనార్హం. వారు నష్టపరిహారం కింద ఎకరాకు రూ.10వేలు మాత్రమే ఇస్తామని చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో దళిత కౌలు రైతులు వాపోతున్నారు. ఈనెలాఖరు వరకు ఆగితే అన్నీ ఖర్చులు పోను ఎకరాకు సుమారు రూ. 50వేలు వస్తుందని, ఇప్పుడు పంటలు తొలగించి కేవలం రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరుతున్నారు.

2022లో ప్రతిపాదన.. ఏడాదిన్నర తర్వాత పరుగులు

ఒంగోలులో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం కోసం 2022 నవంబరులో అధికారులు, నేతలు స్థల పరిశీలన చేశారు. అందులో భాగంగా ఎన్.అగ్రహారం. మల్లేశ్వరకాలనీ, వెంగముక్కలపాలెం పరిధిలో పొలాలను పరిశీలించారు. రైతులతో చర్చించి ఒప్పించారు. ఏడాదిన్నరగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆశలు సన్నగిల్లిన రైతులు తమ పొలాలను కౌలుకు ఇచ్చారు. దీంతో కౌలురైతులు ఆ పొలాల్లో అధిక శాతం శనగ పంటను వేశారు. ఇరవై రోజుల్లో పంట చేతికొస్తే కాస్తోకూస్తో లాభాలు దక్కుతాయన్న ఆశలో ఉన్న వారికి కన్నీరే మిగిలింది. కొందరు దళిత రైతులు పదేసి ఎకరాల చొప్పున సాగు చేశారు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.18,500 ఖర్చు చేశారు. పంటలను తొలగించి ఎకరాకు రూ.10వేలు చొప్పున చెల్లిస్తే తమకు తీరని నష్టం వస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల ఆ పొలాలను పరిశీలించిన కలెక్టర్‌ను నష్టపరిహారం గురించి అడగ్గా, ప్రభుత్వపరంగా తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, భూమి యజమానుల నుంచి నష్టపరిహారం తీసుకోవాలని చెప్పడంతో కంగుతిన్నారు.

టెండర్లు తెరవకుండానే పంటలు తొలగింపు

జగనన్న ఇళ్ల స్థలాల చదును తదితర పనుల కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో వారం క్రితం టెండర్లు పిలిచారు. ఒక్క టెండరు కూడా దాఖలకాలేదు. దీంతో ఈనెల 5వ తేదీ వరకు గడువు పెంచుతూ మరోసారి టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారు కాకుండానే వైసీపీ నాయకులు పంట పలాలను దున్నేసే పనులు రెండు రోజులుగా వేగవంతం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, ఫిబ్రవరి 5 : వైసీపీ సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి అన్నారు. సోమవారం వెలిగండ్లలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధానిగా ప్రకటించి టీడీపీ అభివృద్ధి చేసిందని, జగన్‌రెడ్డి వచ్చి రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. అభివృద్ధి పనులు చేయక, రాజధాని లేకుండా చేసిన జగన్ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి ప్రాంత సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. మహిళలతోపాటు యువత, రైతుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సూపర్‌సిక్స్ పథ కాలను చంద్రబాబు అమలు చేయనున్నారని ఉగ్ర తెలిపారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు జగన్‌రెడ్డి పాల నలో జరిగిన నష్టాన్ని వివరించాలని శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మౌలాలీ, జిల్లా ఎస్సీసెల్ అధికారప్రతియిధి సలోమన్ రాజు, కొండు భాస్కర్‌రెడ్డి కర్నాటి భాస్కర్ రెడ్డి, మీనిగ కాశయ్య కారంపూడి వెంటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మెటాటి సుబ్బరెడ్డి, కృష్ణారెడ్డి, కేసరి రమణా రెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

ముందస్తుగా ఉగ్ర జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలను ముదస్తుగా నిర్వహించారు. సోమవారం వెలిగండ్ల టీడీపీ కార్యాలయంలో నా యకులు, కార్యకర్తల సమక్షంలో పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఉగ్ర కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఆయన్ని నాయకులు, కార్యకర్తలు పూలమాలతో సత్కరించారు.

పర్చూరుపై వైసీపీ మంతనాలు

ఆమంచిని పిలిచి మాట్లాడిన అధిష్ఠానం

ముందు ముఖ్య నాయకులు, ఆపై సీఎంతో భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానంలో ఊగిసలాట ధోరణి కనిపిస్తోంది. ప్రస్తుతం అక్కడ ఇన్‌చార్జిగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఉండగా ఇటీవల మరికొందరిని అధిష్ఠానం పిలిచి మీరు పోటీచేసేందుకు సిద్ధమా అంటూ అడిగింది. సోమవారం ఆమంచిని కూడా పిలిచి రాష్ట్ర నాయకులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. చీరాల టికెట్‌ను పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్‌కు ఓకే చెప్పిన జగన్ పర్చూరు నుంచి ఆమంచినే రంగంలోకి దింపాలన్న ఆలోచనలో ఉన్న విషయం తెలిసిందే. పర్చూరు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే అనేక ఆరోపణలు రావటమే గాక స్వంత పార్టీ నాయకుల నుంచే ఆమంచి విమర్శలు ఎదుర్కొన్నారు. దీనికి తోడు నియోజకవర్గంలో ప్రధానమైన కమ్మ సామాజికవర్గం నేతలను దూషించటం, వ్యాపారులను వేధించటం లాంటి చర్యలకు పాల్పడ్డారు. పక్షం రోజులుగా ఆయన పర్చూరు నుంచి కాకుండా చీరాల నుంచే పోటీ చేసే ఆలోచనలో ఉన్నారన్న సంకేతాలు ఇచ్చారు. ఒకటిరెండు సార్లు చీరాలలో తన అనుచరులతో సమావేశమై అలాంటి సంకేతాలిచ్చారు. ఈ క్రమంలో సీఎం జగన్ మాజీ ఎమ్మెల్యే, దివంగత గొట్టిపాటి నరసయ్య కుమారుడు భరత్‌ను పిలిపించుకుని పోటీకి సిద్ధమా, అయితే ఇంత ఆర్థికవ్యయాన్ని భరించగలరా అని అడగటం తెలిసిందే. ఆర్థికాంశాలలో కొంత ఆయన వెనక్కుతగ్గినట్లు తెలిసింది. ఆదివారం మరికొందరు కమ్మ సామాజిక వర్గేతర వారికి ఫోన్‌చేసి పర్చూరు నుంచి రంగంలోకి వచ్చేందుకు సిద్ధమా అని అడిగినట్లు తెలిసింది. కమ్మ సామాజికవర్గం నుంచి మాజీ ఇన్‌చార్జి రామనాథంబాబు, చిలకలూరిపేటకు చెందిన సురేష్ అనే వ్యాపారవేత్త రేసులో ఉన్నప్పటికీ వారిని పక్కనపెట్టి వేరే సామాజికవర్గం వారికి ఫోన్లు చేసి పర్చూరులో అవకాశం ఇస్తే పోటీ చేస్తారా అని అధిష్ఠానం మాట్లాడటం గమనార్హం. ఒంగోలులో కాపు సామాజికవర్గ వ్యాపారవేత్త రవిశంకర్‌ను కూడా అధిష్ఠానం నుంచి ఫోన్ చేసి పర్చూరులో పోటీ చేసేందుకు సిద్ధమా అని అడిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆమంచిని అధిష్ఠానంలోని నాయకులు తాడేపల్లికి పిలిపించుకున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డితో పాటు సీఎం ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి కూడా ఆమంచితో మాట్లాడారు. ఆ తర్వాత సీఎం జగన్‌తో కూడా ఆయనకు భేటీ ఏర్పాటుచేశారు. పర్చూరు నుంచి పోటీ చేయాల్సిందేనని వారు సూటిగా చెప్పినట్లు తెలిసింది. వివిధ అంశాలపై చర్చల అనంతరం ఆమంచి జగన్‌ను కలవగా ఆయన కూడా అదే విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. అయితే ఆమంచి అవునన్నారా, కాదన్నారా ఇతరత్రా ఏమైనా డిమాండ్లు పెట్టారా అనేది తెలియాల్సి ఉంది.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

బల్లికురవ, ఫిబ్రవరి 5 : మండలంలోని కొప్పెరపాడు గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ నేతలు సోమవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొప్పెరపాడు బీసీ కాలనీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు గుంజి సరోజని, ఆమె కుమారుడు జీవరత్నం, యార్రా కోటేశ్వరరావు (ముసల య్య), బొంతా మరియబాబు, బొంతు రామయ్య, బొంతు చిన్న, బొంతా యత్రయ్య రవికుమార్‌కు సంఘీభావాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలన్నారు.

నిరుద్యోగులను మోసగించిన జగన్‌ను గద్దె దించుతాం..!

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, యూటీఎఫ్ నాయకుడు మీగడ



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామన్న

కనిగిరి, ఫిబ్రవరి 5: నిరుద్యోగులను మోసగించిన సీఎం జగన్‌రెడ్డిని గద్దె దించుతామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న అన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలో ర్యాలీ, పామూరు బస్టాండు సెంటరులో మానవహారం చేపట్టి అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పాల్గొన్న డీవైఎఫ్ఐ నాయకులు రామన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అంటూ నిరుద్యోగులను మోసం చేస్తూ వచ్చిందన్నారు. జగన్ 2019 ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ ద్వారా ఏటా వేలాది పోస్టులు ఇస్తామని మాటతప్పారని చెప్పారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిరుద్యోగులను తిరిగి మోసగించేందుకు మెగా డీఎస్సీ అంటూ దగాకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. చేతగాని ప్రకటనలకు నిరుద్యోగులు మోసపోయే స్థితిలో లేరన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక డ్రా పౌట్స్ అవుతున్నారన్నారు. గడిచిన రెండేళ్లలో సుమారు 6లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయని చెప్పారు. వాటిని బయటకు వెల్లడించకుండా ప్రభుత్వం ఉపాధ్యాయులు పట్ల నిరంకుశ ధోరణి అవలంబిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు 10లక్షల మంది నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తక్షణమే జగన్ మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు, ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. యూటీఎఫ్ నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 1.80 లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా కేవలం 1.69 లక్షల మంది మాత్రమే ఉన్నారన్నారు. దాదాపు 18వేలకు పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల నియామకాలు చేపట్టకుండా కాలయాపన చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు ఓడించి తీరాలన్నారు. ఈనెల చివరి నాటికి మరో 5వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్రంలో విరమణ పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వమే లెక్కలు చెప్పిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం 117 జీవో పేరుతో మరో 10వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసి అన్యాయం చేసిందని మండిపడ్డారు. పాఠశాలల్లో తెలుగు మీడియం తీసివేసి 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిన ఘనత దేశంలో దిక్కుమాలిన సీఎం జగన్ ఒక్కడే అని దుయ్యబట్టారు. 2వేల పాఠశాలలు మూసేసి రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 9వేలు ఉన్నాయని చెప్పి, ఇప్పుడు తాజాగా ఖాళీలు లేవని చెప్పడం వైసీపీ అసమర్థ పాలన స్పష్టం చేస్తోందన్నారు. అనంతరం పలు డిమాండ్లలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో జాన్‌ఇర్విన్‌కు అందచేశారు. కనిగిరి డీవైఎఫ్ఐ కార్యదర్శి నరేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు, అధ్యక్షులు కేవి పిచ్చయ్య, నారాయణ, సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు, శ్రీను, మహ్మమ్మద్, డీఎస్సీ అభ్యర్థులు కల్యాణ్, రవి, జాస్మిని, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డీసీఎం ఢీ.. ఒకరి దుర్మరణం

యాచారం, ఫిబ్రవరి 5 : ఆర్టీసీ అద్దె బస్సు డీసీఎం ఢీకొన్న ఘటనలో బస్సులో ప్రయాణికుడు దుర్మరణం పాలైన ఘటన సోమవారం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గేటు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... దేవరకొండ డిపోకు చెందిన టీఎస్ 07యుకె 4885 నెంబర్ గల ఆర్టీసీ అద్దె బస్సు ఇబ్రహీంపట్నం వైపు నుంచి దేవరకొండ వెళుతుంది. ఎదురుగా వస్తున్న డీసీఎం డ్రైవర్ నిర్లక్షంగా నడుపుతూ బస్ దగ్గరకు రాగానే ఆకస్మాత్తుగా పక్కకు తప్పించేందుకు యత్నించాడు. ఈ క్రమంలో బస్సు బయటకు తల పెట్టి చూస్తున్న యేసు(35) తలకు డీసీఎం వెనక బాగాన ఉన్న ఇనుప రాడ్ బలంగా తగలడంతో బస్సులోనే ప్రాణాలు వదిలాడు. ప్రయాణికుడి మరణానికి కారకుడైన డీసీఎంను పోలీసులు మంచాల మండలంలోని ఆగాపల్లి వద్ద పట్టుకున్నారు. కాగా మృతుడు ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని గంగారం గ్రామవాసి, మృతుడు నగరంలోని మణికొండలోని సైబర్‌టవర్ వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు, ఇతనికి భార్య కుమారి, భూమి, ముసల్లమ్మ కుమార్తెలతో పాటు అస్మత్‌కుమార్ అనే కుమారుడున్నారు. ప్రమాదానికి కారకుడైన డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ చెప్పారు.

మిరప కోతలకు కూలీల డిమాండ్

- కర్నూలు, కడప, బాపట్ల జిల్లా ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- రోజు కూలి రూ.400
- తోటలో ఎండిపోతున్న కాయలు



గుడారాలు ఏర్పాటు చేసుకున్న వలస కూలీలు




ఉమామహేశ్వర అగ్రహారం రైతు పొలంలో మిరప కాయలు కోస్తున్న కర్నూలు జిల్లా వాసులు



కర్నూలు నుంచి వాహనంలో వస్తున్న కూలీలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 5 : ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మిరపను సాగు చేశారు. కరీఫ్, రబీలో కలిపి 5,450 ఎకరాల్లో మిర్చి తోటలు సాగు చేశారు. ప్రస్తుతం కరీఫ్‌లో వేసిన తోటలన్నీ ముమ్మరంగా కోతకు వచ్చాయి. రబీలో సాగు చేసిన మిరప తోటలు సైతం పొలంలోనే ఉండిపోయాయి. ఒకే సారి నెల రోజుల వ్యవధిలో కోతలు రావడంతో ఒక్కసారిగా కూలీలకు భారీ డిమాండ్ ఏర్పడింది. చేతికి వచ్చిన మిరప కాయలు కాస్త చెట్టుపాలవుతాయన్నట్టుగా మిర్చి సాగు రైతులు సుదూర ప్రాంతాలకు సైతం వెళ్లి కూలీలను తెచ్చుకుంటున్నారు. ఒక్కో రైతు సాగు చేసిన ఎకరం పొలంలో కాయలు కోయాలంటే సరాసరి వారం రోజులకు పైగా పడుతుంది. ఈ పరిస్థితుల్లో ఒక్కో రైతు రెండు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు మిర్చి తోటలు సాగు చేశారు. మొదటి కోత కోసే స మయానికే నెల రోజులు దాటుతుందని, ఈ లోగా వర్షాలు పడినా, లేక తోటలు బెట్టకు వచ్చినా మరలా రెండవ కోతపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో మిర్చి సాగు చేసిన రైతులే కర్నూలు, కడప ప్రాంతాలకు వెళ్లి కూలీలను మా ట్లాడుకొని వచ్చి ఉండేందుకు గుడారాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్ర స్తుతం మండలంలో ఉన్న కూలీలే కాక దర్శి, తాళ్లూరు, బాపట్ల జిల్లా అద్దంకి, పంగులూరు, బల్లికురవ ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొని వస్తున్నారు. వీరు కాక కర్నూలు, కడప నుంచి పెద్ద ఎత్తున కూలీలు సుమారు 2,500 నుంచి ఐదు వేల మంది కూలీలను మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, సుంకరవారిపాలెం, నాయుడుపాలెం, తమ్మలూరు, పోలవరం, శంకరాపురం, తూర్పుకంభంపాడు, నూజెండ్లపల్లితో పాటు పలు గ్రామాలకు వలస కూలీలను తెప్పించారు. ఒక్క ఉమా మహేశ్వర అగ్రహారంలోనే రెండు వేల మంది కూలీలు కడప, కర్నూలు నుంచి పెద్ద సంఖ్యలో వచ్చారు. వీరికి ప్రతి రోజు నాలుగు వందల నుంచి రూ.420 వరకు కూలిని చెల్లిస్తున్నామని రైతులు చెప్తున్నారు. మరో నెల రోజుల పాటు కూలీలకు డిమాండ్ ఉంటుంది. ముమ్మరంగా మిర్చి కోతలు రావడంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. మరి కొంత మంది రైతులు మిరప తోటలు కోతలకు వచ్చినా కూలీలు దొరక్క అవస్థలు పడుతున్నారు. తోటలకు వెళ్లి చూస్తే కాయలు పండిపోయి చెట్ల మీద ఎండు మొఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కర్నూలు నుంచి కూలీలను తెప్పించా



నేను ఈ ఏడాది ఖరీఫ్‌లో ఐదు ఎకరాలు మిర్చి సాగు చేశాను. ప్రస్తుతం మొదటి కోత గ్రామంలో కూలీల చేత కోయించాను. రెండవ కోత కోయించటానికి 15 రోజుల వరకు ఎదురు చూశాను. కూలీల కొరత ఏర్పడింది. తోటలకు వెళ్లి చూస్తే కాయలు పండు పోయి ఎండు మొఖం పట్టాయి. దీంతో ఆందోళన చెంది కర్నూలు వెళ్లి కూలీలను ఒక్కొక్కరికి రూ 420 చొప్పున రేటు మాట్లాడుకొని 50 మందిని తీసుకు వచ్చి గత రెండు రోజుల నుంచి కాయలు కోయిస్తున్నాను. కూలీలకు డిమాండ్ ఏర్పడింది.

- గూడాల సుబ్బారెడ్డి, మిర్చి రైతు, ఉమా మహేశ్వర అగ్రహారం

టీడీపీతోనే బీసీలకు న్యాయం

- జయహో బీసీ సభలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ
- త్రిపురాంతకంలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న బాలాజీ, నారాయణరెడ్డి

కొనకనమిట్ల, ఫిబ్రవరి 5 : రాష్ట్రంలో టీడీపీ హయాంలో మాత్రమే బీసీలకు న్యాయం జరిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. మండలంలోని వాగుమడుగు గ్రామంలో సోమవారం 'జయహో బీసీ' సభ నిర్వహించారు. ఈసందర్భంగా బాలాజీ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాల ఓట్లతో అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు వారినే తొక్కేయాలని చూస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే బీసీల గుర్తింపుతో పాటు సముచిత న్యాయం జరిగిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ హయాంలో ఉన్న అన్ని సంక్షేమ పథకాలను రద్దు చేసి బీసీలకు నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. టీడీపీ మిని మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలతో పాటు బీసీలకు రక్షణచట్టం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం శుభపరిణామన్నారు. నాడు ఎన్‌టీ రామారావు బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారన్నారు. అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని చెప్పుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్పోరేషన్‌కు ఎంత నిధులు విడుదల చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కావున బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి టీడీపీకి వెన్నుదన్నుగా నిలవాలన్నారు. జగన్‌రెడ్డి పాలనలో బీసీలను అక్రమ కేసులతో భయానికి గురిచేసి లొంగ దీసుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. మార్కాపురం టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ బీసీలకు టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్‌టీఆర్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు ఆదరణ పథకంలో బీసీలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతే కాకుండా వైసీపీ దుర్మార్గాలను టీడీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత 27 సంక్షేమ పథకాలను తొలగించి ప్రజలను మోసంచేశారని ఎద్దేవ చేశారు. తొలుత మండల కేంద్రం కొనకనమిట్ల నుండి వాగుమడుగు గ్రామం వరకు టీడీపీ శ్రేణులు బైక్‌ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మోరబోయిన బాబురావు, పలువురు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎరిక్షన్‌బాబును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

త్రిపురాంతకం : బీసీలకు టీడీపీతోనే సాధికారత సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. త్రిపురాంతకంలోని ఆర్యవైశ్య అన్నసత్రంలో సోమవారం 'జయహో బీసీ' సదస్సును టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి ఉత్సాహంగా నిర్వహించాయి. ఈ సందర్భం గా స్థానిక ఐవోసీ పెట్రోల్ బంకు నుంచి ప్రధాన రహదారి నుంచి వై.పాలెం కూడలి మీదగా అన్నసత్రాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. ఎన్‌టీ రామారావు పార్టీని స్థాపించిన నాటి నుంచి బీసీలు టీడీపీతోనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు పెరిగాయన్నారు. బీసీల సంక్షేమ పథకాలను నిలిపివేశారన్నారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మళ్లీ చంద్రబాబునాయుడిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. జగన్మోహన్‌రెడ్డి బీసీలను మోసం చేశారన్నారు. ఆయనకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే పూర్తయినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షురాలు నల్లబోతుల రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు వలరాజు, నాయకులు శ్రీనివాసరెడ్డి, చలమయ్య, నాసరరెడ్డి, ఆంజనేయులు, కొండలు, గోవిందు, రాయుడు, సత్యనారాయణగౌడ్, రమణమ్మ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల మల్లికార్జున, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ ప్రసాద్

కొమరోలు, ఫిబ్రవరి 5 : గిద్దలూరు సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో రోడ్డుప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటానని రూరల్ సీఐ దాసరి ప్రసాద్ అన్నారు. కొమరోలు పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. కొత్తగా వచ్చిన ఎస్సై కోటేశ్వరరావుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటానన్నారు. కొమరోలు పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి కూడలిలోనూ, మద్యం దుకాణం పరిధిలో ఉదయం, సాయంత్రం ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. అక్రమ మద్యం, మట్కా, జూదం వంటి వాటిని అరికట్టేందుకు నిఘాను ఏర్పాటుచేస్తున్నామన్నారు. గతంలో ఆయన ఇక్కడ ఎస్సైగా పనిచేశారు. దీంతో పరిచయం ఉన్న స్థానికులు ఆయనన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో జెడ్పీటీసీ సభ్యులు సారె వెంకటనాయుడు, నాయకులు నాదేళ్ల వెంగయ్య చౌదరి, సర్పంచ్ జనార్ధన్, ఎంపీటీసీ సభ్యులు షేక్ మౌలాలి, సుభాని తదితరులున్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

పుల్లలచెరువు, ఫిబ్రవరి 5 : పుల్లలచెరువు మండల నూతన తహసీల్దార్‌గా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి ఆయన పుల్లలచెరువుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వీఆర్వోలు, సిబ్బంది కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎస్ఐగా ఫిరోజ్ ఫాతిమా బాధ్యతలు

పుల్లలచెరువు, ఫిబ్రవరి 5: పుల్లలచెరువు మండల ఎస్ఐగా ఎండి.ఫిరోజ్ ఫాతిమా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్ నుంచి ఆమె పుల్లలచెరువుకు వచ్చారు. సిబ్బంది కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు.

నూతన తహసీల్దార్‌గా మహమ్మద్ జీయాన్



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పొదిలి, ఫిబ్రవరి 5 : పొదిలి నూతన తహశీల్దార్‌గా మహమ్మద్ జీయాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఏమైన ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. ప్రజల ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను ఎప్పటికప్పుడు క్లియర్ చేసే విధంగా సిబ్బంది పనిచేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బంది తహశీల్దార్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సోలార్ బ్యాటరీల అపహరణ

- పాలుట్ల గిరిజన గూడెంలో ఘటన

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 5 : మండలంలోని పాలుట్ల గిరిజనగూడెంలో అమర్చిన 550 సోలార్ బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. సోమవారం గూడెం వీటీడీఏ అధ్యక్షులు నిమ్మల ఈదన్న స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాటరీలు తీసుకువెళ్లిన వ్యక్తికి పాలుట్లకు చెందిన నలుగురు యువకులు సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2015లో సంవత్సరంలో గూడెంలో విద్యుదీకరణకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేశారన్నారు. 2019 నుంచి ఇవి మరమ్మతులకు గురయ్యాయి. వీటిని మరమ్మతులు చేయకుండా ఉన్న బ్యాటరీలు తీసుకెళ్లడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గిరిజనగూడెం గిరిజనులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత విద్యుత్ కన్‌స్ట్రక్షన్ ఏడీఈ ఫిర్యాదు చేయాలని ఎస్.ఐ సుదర్శన్ తెలిపారు. ఏడీఈ ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీ - ఒకరి మృతి

పుల్లలచెరువు, ఫిబ్రవరి 5 : ఆర్టీసీ అద్దె బస్సు డీసీఎం ఢీ కొన్న ఘటనలో ఆర్టీసీ బస్సు ప్రయాణీకుడు దుర్మరణం పాలైన ఘటన సోమవారం తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గేటు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఇబ్రహీంపట్నం వైపు నుంచి దేవరకొండ వెళుతోంది. బస్సుకు ఎదురుగా వస్తున్న డీసీఎం డ్రైవర్ నిర్లక్షంగా నడుపుతూ ఆకస్మాత్తుగా డీసీఎంను పక్కకు తప్పించేందుకు యత్నించాడు. ఈ క్రమంలో బస్సు బయటకు తల పెట్టి చూస్తున్న యేసు(35)కు డీసీఎం వెనక బాగాన ఉన్న ఇనుప రాడ్ బలంగా ఢీ కొంది. దీంతో యేసు తలపగిలి బస్సులోనే ప్రాణాల విడిచాడు.. ప్రయాణీకుడి మరణానికి కారకుడైన డీసీఎంను పోలీసులు మంచాల మండలంలోని ఆగాపల్లి వద్ద పట్టుకున్నారు. కాగా మృతుడు ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని గంగారంగా గుర్తించారు. యేసు నగరంలోని మణికొండలోని సైబర్‌టవర్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు, ఇతనికి భార్య కుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదానికి కారకుడైన డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ చెప్పారు.

విధుల్లో చేరిన నూతన ఎస్సై సాంబశివయ్య

త్రిపురాంతకం, ఫిబ్రవరి 5: స్థానిక పోలీసు స్టేషనులో నూతన ఎస్సైగా వి.సాంబశివయ్య సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న బి.సుదర్శన్‌ను ఎర్రగొండపాలేనికి బదిలీ అయ్యారు. పొన్నలూరులో పనిచేస్తున్న సాంబశివయ్యను ఇక్కడకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షిస్తానన్నారు. అక్రమ మద్యం, సారాను అరికడతానని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటానన్నారు.

తహసీల్దార్ రామకృష్ణ బాధ్యతలు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 5: మండల నూతన తహసీల్దారుగా బి.రామకృష్ణ శివప్రసాద్ సోమవారం విధులో చేరారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న వి.కిరణ్‌ను బాపట్ల జిల్లాకు బదిలీ చేయగా, నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న రామకృష్ణ శివప్రసాద్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. రెవెన్యూ సిబ్బంది పారదర్శకంగా పాలన చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా

- రాత్రికి రాత్రే షెడ్ నిర్మాణం
- దర్జాగా ఆక్రమించిన వలంటీర్



ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్

కంభం, ఫిబ్రవరి 5 : కంభం మండలం యర్రబాలెం బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని వలంటీర్ దర్జాగా ఆక్రమించేశాడు. రాత్రికిరాత్రి షెడ్ నిర్మించాడు. దీనిపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే యర్రబాలెం బస్టాండ్ వద్ద ప్రభుత్వ స్థలం ఉంది. దీనిపై కన్నేసిన చిన్ననల్లగాల్వ వాలంటీర్, మరో వ్యక్తితో కలిసి ఆ స్థలాన్ని ఆదివారం మధ్యాహ్నం చదును చేశాడు. షెడ్ వేసేందుకు ప్రయత్నించగా గమనించిన గ్రామస్థులు అడ్డుకున్నారు. ప్రజలు ప్రతిఘటించడంతో అప్పటికి వెళ్లిపోయాడు. అనంతరం రాత్రి జనసంచారం లేక పోవడంతో షెడ్‌ను నిర్మించాడు. ఇంచుమించు నాలుగుసెంట్ల స్థలం ఆక్రమణకు గురైంది. కంభం- తురిమెళ్ల రహదారి వెంబడే ఈ స్థలం ఉంది. ఇక్కడ మరింత ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మించే ప్రతిపాదనలు సైతం ఉన్నాయి. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికావడంతో గ్రామస్థుడు గోన చెన్నకేశవులు, గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఆక్రమ నిర్మాణం విషయం తమ దృష్టికి వచ్చిందని, యర్రబాలెం వీఆర్‌వో ఇచ్చే నివేదిక ఆధారంగా తగుచర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

సామాజిక తనిఖీలో 'ఉపాధి' అక్రమాలు వెల్లడి

- మురారిపల్లెలో బినామి ఫీల్డ్ అసిస్టెంట్ విధులు
- వలంటీర్లకు పలు గ్రామాల్లో అక్రమ మస్టర్లు



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న మిల్లంపల్లి గ్రామస్థులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 5 : ఎర్రగొండపాలెం మండలంలో 2022 - 23 ఆర్థిక సంవత్సరాలలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి పనుల్లో కూలీలకు కంటే వలంటీర్లకు వారంలో ఆరురోజులుమస్టర్లు వేసి ఫీల్డు అసిస్టెంట్లు తమ అభిమానాన్ని చాటుకున్నట్లు సోమవారం ఎర్రగొండపాలెంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగులోనికి వచ్చింది. మండలంలోని మురారిపల్లె గ్రామంలో ఫీల్డు అసిస్టెంటు తురిమెళ్ల బూడిదయ్య మూడు నెలల క్రితం ఇతర జిల్లాలకు వలస కూలీగా వెళ్లాడు. ఆయన స్థానంలో తురిమెళ్ల పాపయ్య బినామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్నారు. కూలీలకు మస్టర్లు వేయడంతో పాటు చెల్లింపులు కూడా చేస్తున్నాడు. ఇటీవల సామాజిక తనిఖీ బృందం మురారిపల్లె గ్రామానికి వెళ్లింది. పాపయ్య బినామీ ఫీల్డు అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఫీల్డ్ అసిస్టెంట్ బూడిదయ్య, బినామీ ఫీల్డు అసిస్టెంట్ పాపయ్యపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచి బిజ్జం రమణారెడ్డి, ఒక వర్గం వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 10 నీటికుంటల పనులకు ఈసీ కొలతలు వేయకుండానే బిల్లులు చెల్లించాడని, డీఆర్‌పీలు తెలిపారు. నాలుగు వారాలకు కూలీల కు మస్టర్లు వేయకుండా కూలీ నగదు చెల్లించారు. గంగాపాలెం, గంజివారిపల్లె, కొలుకుల, మిల్లంపల్లి, గురిజేపల్లి గ్రామాల్లో వలంటీర్లకు వారంలో 3 రోజులుకు బదులుగా 6 రోజులు మస్టర్లు వేశారు. గంజివారిపల్లెలో ఆశావర్కర్‌కు వారంరోజులు మస్టర్లు వేసి కూలీ చెల్లించారు. అమానిగుడిపాడు గ్రామంలో 3000 క్యూబిక్ మీటర్లు కందకం పనులు చేసినట్లు చూపారని, అందులో 872 క్యూబిక్ మీటర్లు కొలత తగ్గిందని డీఆర్‌పీలు తెలిపారు. కొలుకుల గ్రామంలో కండిత కందకం పనులు 24 పూర్తి చేయగా, 7 పనుల్లో కొలతలు తగ్గాయన్నారు. ఉపాధి పనుల్లో నీటికుంటల్లో చేపట్టిన పనుల్లో ప్రతి చోట కొలతలు తగ్గినట్లు సామాజిక తనిఖీలో బహిర్గతం అయ్యింది. మండలంలో మొత్తం మీద రూ.17.60 కోట్లు పనులు జరిగినట్లు రికార్డులు నమోదు చేసి చెల్లింపులు చేశారు. ప్రతి హెబిటేషన్‌లో చేసిన పనులకు ఎం-బుక్‌లో నమోదు చేసిన కొలతలకు, సామాజిక తనిఖీ డీఆర్‌పీలు నమోదు చేసిన కొలతలకు వ్యత్యాసం ఉండడంతో పనులల్లో ఎక్కువగా అవినీతి జరిగిందని ప్రజలు భావిస్తున్నారు. ఈ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో పీడీ డ్వామా కే.సేనారెడ్డి, జిల్లా విజిలెన్సు అధికారి ఝాన్సీరాణి, సహాయవిజిలెన్సు అధికారి వెంకటస్వామి, ఏపీడీ నిర్మలా దేవి, ఎంపీపీ డి.కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యులు విజయభాస్కర్, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, ఎస్‌ఆర్‌పీ సుబ్బారావు, ఏపీవో శైలజ, ఉపాధిహామీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పల్లెల్లో గొంతెండుతోంది..!

- మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయండి
- ఎంపీడీవోకు టీడీపీ నాయకుల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 5 : మండలంలోని 18 గ్రామ పంచాయితీలలో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామాల్లో ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొద్ది రాజులుగా ప్రభుత్వం ట్యాంకర్లును సైతం నిలిపేసింది. ప్రభుత్వం ట్యాకర్ల యజమానులతో మాట్లాడి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఆ మేరకు ఎంపీడీవో నాగేశ్వరప్రసాదుకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు మాట్లాడుతూ.. ట్యాంకర్ల నిలిపివేతతో ప్రజలు తాగునీటికోసం వారంరోజులుగా అవస్థలు పడుతున్నారన్నారు. బిల్లుల సమస్యను పరిష్కరించి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు కామేపల్లి వెంకటేశ్వర్లు, రైతు అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, కాశికుంట సర్పంచి మంత్రునాయక్, మాజీ సర్పంచి సత్యనారాయణగౌడ్, నాయకులు తోట మహేష్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు పాలడుగు వెంకటకోటయ్య, పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలి, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, మాజీ సర్పంచి చెవుల అంజయ్య నాయకులు కిశోర్, కొత్త భాస్కర్, ఉన్నం నరసింహారావు, నాగరాజు చలమయ్య,కేశనపల్లి మల్లికార్జున, మల్లిపెద్ది రామకిష్ట, వెంకట్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఏపీఆర్‌పీఏ గౌరవాధ్యక్షుడు పుల్లారావు డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీఆర్‌పీఏ గౌరవాధ్యక్షుడు ఏపీ పుల్లారావు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన పుల్లారావు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వతేదీనే పెన్షన్లు ఇవ్వాలన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలను మంజూరు చేయడంతో పాటు ఈపీఎఫ్ పెన్షన్లకు రూ. 10వేలు కనీస పెన్షన్‌అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషయ్య, రాంబాబులు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వతేదీ వరకు రిలే దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు టీవీఆర్ సుబ్బారావు, కే దేవానందం, జి. నరసయ్య తదితరులు ఉన్నారు.యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి డి. అంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఎస్. రవిలు రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు.

పొదిలిలో చెలరేగిపోతున్న డ్రగ్ మాఫియా

- అధిక ధరలకు జనరిక్ మందుల విక్రయం
- పుట్టగొడుగుల్లా వెలసిన మెడికల్‌షాపులు
- పత్తాలేని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

పొదిలి, ఫిబ్రవరి 5 : పట్టణంలో డ్రగ్ మాఫియా అడ్డూ అదుపులేకుండా చెలరేగుతోంది. ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని మందుల దుకాణ యజమానులు యథేచ్ఛగా సొమ్ము చేసుకుంటున్నారు. మందుల దుకాణాలను వేళ్లపై లెక్కపెట్టే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం 40కిపైగా దుకాణాలు పట్టణంలో వెలిశాయి. జనరిక్ మందులు వచ్చిన తరువాత వ్యాపారాలు లాభసాటిగా ఉండడంతో ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా దుకాణాలు వెలిశాయి. ఇక ప్రజల అవగాహన రాహిత్యంతో జనరిక్ మందులను సైతం బ్రాండెడ్ కంపెనీలతో సమా నంగా విక్రయించి దుకాణాల యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలు ఆసుపత్రులలో సొంతంగా మందుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆయా దుకాణాల్లో విచ్చలవిడిగా ముందులు విక్రయిస్తున్న ప్పటికీ, నియంత్రించాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు దుకాణాలవైపు కన్నెత్తి చూడటంలేదు. దుకాణాల్లో బ్రాండెడ్ కంపెనీలు జనరిక్ మందుల పేర్లను సూచికబోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. నిబంధనలేమి అమలుజేయక పోయినా, తనిఖీ లేకపోవడం గమనార్హం. దీంతో మందులవ్యాపారం మూడు ట్యాబ్‌లెట్లు, ఆరు సిరప్‌లు అన్న చందంగా సాగుతోంది. నిత్యం పట్టణంలో రూ.5 లక్షలకుపైగా వ్యాపారం నిత్యం సాగుతున్నట్లు అంచనా. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేనిదే మందులు విక్రయించడానికి వీలు లేదు. ప్రతి దుకాణ యజమాని విధిగా ఫార్మసిస్టలను ఏర్పాటు చేసుకోవాలి. ధరల పట్టికలను ఏర్పాటు చేయాలి, జనరిక్ మందులను, బ్రాండెడ్ మందులను పట్టికలో తేడా చూపించే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలి. ఇవేమి పట్టించుకోకుండా బ్రాండెడ్ మందుల పేరుతో జనరిక్ మందులను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా దుకాణ యజమానుల దోపిడి నుండి సామాన్య ప్రజలకు ఊరట కలిగించే విధంగా దుకాణ యజమానులు నిబంధనలు పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

అవీ..ఇవీ..

కరాటేలో విద్యార్థులకు బంగారు పతకాలు



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 5: మార్కాపురంలోని ఎం.ఎస్.స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు 10 బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎంఎస్.స్పోర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, తోట ప్రసాద్‌లు సోమవారం విద్యార్థులను అభినందించి మాట్లాడారు. బాపట్ల పట్టణంలో వైఎస్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు 10 బంగారు, 6 వెండి, 3 రజత పతకాలు సాధించారన్నారు. టి.సాయి జగదీష్, ఎం.తేజవర్ధన్, దేవ హర్ష, తేజేష్, ధనూష్‌రెడ్డి, ఎస్.జస్వంత్, కె.వినీతారెడ్డి, కె.మహితారెడ్డి, వి.ప్రవీణ్‌కుమార్, ఎస్.సర్వానీష్‌లు బంగారు పతకాలు సాధించారన్నారు.

లక్ష్యం దిశగా అడుగులు పడాలి



మాట్లాడుతున్న పవన్ కుమార్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 5 : విద్యార్థులు లక్ష్యం దిశగా అడుగులు వేస్తే విజయ పరంపరకు రహదారి కనబడుతుందని కమలా విద్యా సంస్థల అధినేత పెనుగొండ పవన్‌కుమార్ అన్నారు. స్థానిక కమలా జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమశక్తి తాము తెలుసుకొని చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకుంటే విజయానికి బాట ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుల్లయ్య, రంజన్, సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో సాయిబాబా

త్రిపురాంతకం, ఫిబ్రవరి 5: స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రామశ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాయిబాబా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అంకరించారు. అనంతరం కాగడహారతి, గణపతి పూజ, అభిషేకం, అర్చన, పాదపూజ, విష్ణు సహస్రనామ పారాయణం, సాయిచాలీసా పారాయణం, మధ్యాహ్న హారతి, ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం సాయంత్రం అంగరంగ వైభవంగా గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో యువతకు ఉపాధి



ఉద్యోగాలకు ఎంపికైన యువతీ, యువకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 5 : పట్టణంలోని సాయిచైతన్య డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి నిర్వహించారు. శ్రీసిటిలోని హెచ్‌ఆర్ సొల్యూషన్స్ కంపెనీ తరపున మేనేజర్ రాజు జాబ్‌మేళకు హాజరై మొబైల్, ఏసీ తయారీ యూనిట్లలో అవసరమైన ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 30 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి వారికి నియామక పత్రాలు అందజేశారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దాతలు

గిద్దలూరు, ఫిబ్రవరి 5 : పట్టణంలోని అమ్మ ఆశ్రమానికి, మానసిక వికలాంగు ల పాఠశాలకు దాతల సహకారంతో ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణ నిత్యవసర వస్తువులను అందజేశారు. కార్య క్రమంలో దాతలు ముక్కె రశివారెడ్డి, దుగ్గా రాజశేఖర్‌రెడ్డి, గిరిధర్, అంకయ్య, తదితరులతోపాటు అమ్మఆశ్రమం ప్రతినిధి తిరుపతమ్మ, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 5: ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించే 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఏ.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక శివసదన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు గండి వీరారెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్లుగా దేశభద్రత, సంస్కృతిని పరిరక్షించడంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎంతో కృషి చేశారన్నారు. పేద ప్రజలకు, రైతులకు అమలు చేసిన పథకాలను గ్రామీణస్థాయి నుంచి ప్రజలకు తెలియజెప్పేందుకు 'పల్లెకుపోదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, లక్ష్మీరెడ్డి, రాజు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఆసరాచెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న తాటిపత్రి చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 5 : వైఎస్‌ఆర్ ఆసరా నాల్గో విడత ఉత్సవాలను స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 142 పొదుపు గ్రూపులకు సోమవారం రూ.28.46 కోట్ల నమోనా చెక్కును ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర్ ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, సర్పంచి ఆర్ అరుణాబాయ్, అధికారులు, మండలంలోని పొదుపు గ్రూపుల మహిళలు పాల్గొన్నారు.

మిరప కోతలకు కూలీల డిమాండ్

- కర్నూలు, కడప, బాపట్ల జిల్లా ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- రోజు కూలి రూ.400
- తోటలో ఎండిపోతున్న కాయలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 5 : ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మిరపను సాగు చేశారు. కరీఫ్, రబీలో కలిపి 5,450 ఎకరాల్లో మిర్చి తోటలు సాగు చేశారు. ప్రస్తుతం కరీఫ్‌లో వేసిన తోటలన్నీ ముమ్మరంగా కోతకు వచ్చాయి. రబీలో సాగు చేసిన మిరప తోటలు సైతం పొలంలోనే ఉండిపోయాయి. ఒకే సారి నెల రోజుల వ్యవధిలో కోతలు రావడంతో ఒక్కసారిగా కూలీలకు భారీ డిమాండ్ ఏర్పడింది. చేతికి వచ్చిన మిరప కాయలు


గుడారాలను ఏర్పాటు చేసుకున్న వలస కూలీలు


ఉమామహేశ్వర అగ్రహారంలో మిరప కాయలు కోస్తున్న కర్నూలు జిల్లా వాసులు


కర్నూలు నుంచి వాహనంలో వస్తున్న కూలీలు

కాస్త చెట్టుపాలవుతాయన్నట్టుగా మిర్చి సాగు రైతులు సుదూర ప్రాంతాలకు సైతం వెళ్లి కూలీలను తెచ్చుకుంటున్నారు. ఒక్కో రైతు సాగు చేసిన ఎకరం పొలంలో కాయలు కోయాలంటే సరాసరి వారం రోజులకు పైగా పడుతుంది. ఈ పరిస్థితుల్లో ఒక్కో రైతు రెండు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు మిర్చి తోటలు సాగు చేశారు. మొదటి కోత కోసే స మయానికే నెల రోజులు దాటుతుందని, ఈ లోగా వర్షాలు పడినా, లేక తోటలు బెట్టకు వచ్చినా మరలా రెండవ కోతపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో మిర్చి సాగు చేసిన రైతులే కర్నూలు, కడప ప్రాంతాలకు వెళ్లి కూలీలను మా ట్లాడుకొని వచ్చి ఉండేందుకు గుడారాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్ర స్తుతం మండలంలో ఉన్న కూలీలే కాక దర్శి, తాళ్లూరు, బాపట్ల జిల్లా అద్దంకి, పంగులూరు, బల్లికురవ ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొని వస్తున్నారు. వీరు కాక కర్నూలు, కడప నుంచి పెద్ద ఎత్తున కూలీలు సుమారు 2,500 నుంచి ఐదు వేల మంది కూలీలను మండలంలోని ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, సుంకరవారిపాలెం, నాయుడుపాలెం, తమ్మలూరు, పోలవరం, శంకరాపురం, తూర్పుకంభంపాడు, నూజెండ్లపల్లితో పాటు పలు గ్రామాలకు వలస కూలీలను తెప్పించారు. ఒక్క ఉమా మహేశ్వర అగ్రహారంలోనే రెండు వేల మంది కూలీలు కడప, కర్నూలు నుంచి పెద్ద సంఖ్యలో వచ్చారు. వీరికి ప్రతి రోజు నాలుగు వందల నుంచి రూ.420 వరకు కూలిని చెల్లిస్తున్నామని రైతులు చెప్తున్నారు. మరో నెల రోజుల పాటు కూలీలకు డిమాండ్ ఉంటుంది. ముమ్మరంగా మిర్చి కోతలు రావడంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. మరి కొంత మంది రైతులు మిరప తోటలు కోతలకు వచ్చినా కూలీలు దొరక్క అవస్థలు పడుతున్నారు. తోటలకు వెళ్లి చూస్తే కాయలు పండిపోయి చెట్ల మీద ఎండు మొఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కర్నూలు నుంచి కూలీలను తెప్పించా



నేను ఈ ఏడాది ఖరీఫ్‌లో ఐదు ఎకరాలు మిర్చి సాగు చేశాను. ప్రస్తుతం మొదటి కోత గ్రామంలో కూలీల చేత కోయించాను. రెండవ కోత కోయించటానికి 15 రోజుల వరకు ఎదురు చూశాను. కూలీల కొరత ఏర్పడింది. తోటలకు వెళ్లి చూస్తే కాయలు పండుపోయి ఎండు మొఖం పట్టాయి. దీంతో ఆందోళన చెంది కర్నూలు వెళ్లి కూలీలను ఒక్కొక్కరికి రూ 420 చొప్పున రేటు మాట్లాడుకొని 50 మందిని తీసుకు వచ్చి గత రెండు రోజుల నుంచి కాయలు కోయిస్తున్నాను. కూలీలకు డిమాండ్ ఏర్పడింది.

- గూడాల సుబ్బారెడ్డి, మిర్చి రైతు, ఉమా మహేశ్వర అగ్రహారం

కమిషనర్, ఎస్ఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్, ఎస్

కనిగిరి, ఫిబ్రవరి 5 : కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా దానియేలు, ఎస్ఐ త్యాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ త్యాగరాజు మాట్లాడుతూ కనిగిరిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా కనిగిరిలో అసాంఘిక శక్తులకు తావులేకుండా చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్ సమస్యపై అధ్యయనం చేసి పరిష్కారం చేస్తామన్నారు. కమిషనర్ దానియేలు మాట్లాడుతూ మున్సిపాల్టీ అభివృద్ధితో పాటు శానిటేషన్ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కనిగిరి మున్సిపాల్టీకి ఆదాయ వనరులు సమకూర్చడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అదేవిధంగా ఇంటిపన్నులు బకాయి ఉన్న ప్రజలు చెల్లించి సహకరించాలని కోరారు.

నూతన సీఐ షమీముల్లా బాధ్యతల స్వీకరణ



దర్శి : సీఐగా షమీముల్లా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎన్నికలు త్వరలో జరగనున్నందున సమశ్యాత్మక గ్రామాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టటం జరుగుతుందన్నారు.

తహసీల్దార్‌గా మధుబాబు



ముండ్లమూరు, ఫిబ్రవరి 5 : ముండ్లమూరు తహసీల్దార్‌గా జెట్టి మధుబా బు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా నూజెండ్ల మండల తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీలపై ముండ్లమూరు వచ్చారు. ఇప్పటి వరకు ముండ్లమూరు తహసీల్దార్‌గా పని చేసిన ఎండీ నయూం అహమ్మద్‌ను పల్నాడు జిల్లా నూజెండ్ల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ మధుబాబు మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించడంతో పాటు వివిధ రకాల సర్టిఫికెట్ల మంజూరుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనంతరం తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా డిప్యూటీ తహసీల్దార్లు జీ పుల్లారెడ్డి, ఏ స్రవంతి, మండల సర్వేయర్ విష్ణు, వీఆర్‌వోలు కలసి అభినందించారు.

తహసీల్దార్‌గా షాకీర్ పాషా



పామూరు : పామూరు తహసీల్దార్‌గా షాకీర్ పాషా బాధ్యతలు స్వీక రిం చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఆవుల సురేష్ కనిగిరికి బదిలీపై వెళ్లగా, మంగళగిరి సీసీఎల్ఏ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న షాకీర్‌పాషాను ఇక్కడకు నియమించారు. జగనన్న ఇంటి స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు పాషా తెలిపారు.

తహసీల్దార్‌గా పద్మావతి

పీసీపల్లి : తహసీల్దార్‌గా పద్మావతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా కోట తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు.

తహసీల్దార్‌గా సుధాకర్

కురిచేడు : తహసీల్దార్‌గా ఏవీ సుధాకర్ సోమవారం విధుల్లో చేరారు. ఆయన పల్నాడు జిల్లా ఈపూరు తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై కురిచేడుకు వచ్చారు. మండలంలోని వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఎన్నికలకు సంబంధించి ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలని ఆయన సూచించారు.

తహసీల్దార్‌గా షేక్ మహమ్మద్ హుస్సేన్



తాళ్లూరు : తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ సోమవారం బాధ్యత లు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా మాచర్ల నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కేవీ ప్రసాద్‌ను కనిగిరి ఆర్‌డీవో కార్యాలయంలో డీఏవోగా బదిలీ చేశారు.

విధుల్లో చేరిన ఎస్ఐ సుమన్

ఎస్ఐగా ఆర్.సుమన్ సోమవారం విధుల్లో చేరారు. ఆయన ఒంగోలు నుంచి కురిచేడుకు బదిలీపై వచ్చారు. గతంలో త్రిపురాంతకం, మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేశారు.

ఉపాధి ఏపీవోగా నాగరాజు

ముండ్లమూరు : ఉపాధి హామీ పథకం ఏపీవోగా కే నాగరాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన తర్లుపాడు ఏపీవోగా పని చేస్తూ బదిలీపై ముండ్లమూరుకు నియమితులయ్యారు. అనంతరం నాగరాజు ఎంపీడీవో శంకరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు తాళ్లూరు ఏపీవో మురళీ ఇన్‌చార్జ్ ఏపీవోగా కొన్ని నెలల పాటు పని చేశారు.


మాట్లాడుతున్న ఎన్నికల అధికారి లోకేశ్వరరావు

సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలి

దర్శి, ఫిబ్రవరి 5 : దర్శి నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులు, రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలు చేసిన పిర్యాదులను పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ దేవప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఏవీ రవి శంకర్, ఎస్సై శివనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

1వ వార్డులో బూచేపల్లి ప్రచారం


వార్డులో పర్యటిస్తున్న బూచేపల్లి

దర్శి, ఫిబ్రవరి 5 : వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు అందించి విజయం చేకూర్చాలని జడ్పీ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. పట్టణంలోని 1వ వార్డులో సోమవారం జడ్పీ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి నందిని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, దర్శి సొసైటీ ఛైర్మన్ వీ చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి పాల్గొన్నారు.

పూజితకు నివాళి

ముండ్లమూరు, ఫిబ్రవరి 5 : అధికారుల వేధింపుల కారణంగా గుంటూరు జిల్లా వేమూరు మండలంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బెల్లంకొండ పూజిత బలవన్మరణం చెందారని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు అన్నారు. వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రోజు రోజుకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల పై పని భారం పెంచటమే కాక పత్తి ఒత్తిడి పేరుతో వేదింపులకు గురి చేస్తున్నారని, తక్షమే మానుకోవాలంటే స్థానిక వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఆంజనేయులు, ఆనంద్, బాల వెంకటయ్య, త్యాగరాజు, తిప్పేస్వామి, డీ రాము, అంజిలి, విజయ నిర్మల, శోభారాణి, శైలజ, కృష్ణారెడ్డి, రాధామణి ఉన్నారు.

పాఠశాల స్థల ఆక్రమణలు తొలగిస్తాం

తాళ్లూరు, ఫిబ్రవరి 5 :మండలంలోని వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల (ఏపీ) ఆవరణలోని ఆక్రమణలను తొలగించాలని మూడు నెలల క్రితం కలెక్టర్ దినేష్ కుమార్ ఇచ్చిన ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులలో కదలిక వచ్చింది. గత మూడునెలలుగా మిన్నకున్న అధికారులు సోమవారం ఆ గ్రామాని వెళ్లి ఆక్రమణదారుతో మాట్లాడి తామే స్వచ్ఛందంగా తొలగిస్తామని అంగీకారపత్రాన్ని తీసుకున్నారు. ఆక్రమణదారులు తొలగించకుంటే మూడు రోజుల తరువాత తామే తొలగిస్తామని తహసీల్దార్ ఆక్రమణదారులను హెచ్చరించారు. మూడు నెలల క్రితం కలెక్టర్ ఆదేశానుసారం తహసీల్దార్, ఎంఈవోలు పాఠశాలను సందర్శించారు. రెండు నెలల క్రితం వీఆర్‌వో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. ఆక్రమణదారులు ఆక్రమణ చేసిన భూమి పాఠశాలకు చెందిన ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు గుర్తించి, ఆక్రమణలు తొలగించాలని విన్నవించారు. ఆక్రమణదారులు పట్టించుకోక పోవడంతో సోమవారం తహసీల్దార్ కేవీ ప్రసాద్ సిబ్బందితో పాఠశాలను సందర్శించి ఆక్రమణదారులతో మాట్లాడారు. తొలగించక పోవడంతో ఆక్రమణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో తామే స్వచ్ఛందంగా తొలగిస్తామని అంగీకరిస్తూ తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా అంగీకారపత్రం రాసి ఇచ్చారు. తొలగించకుంటే అధికార యంత్రాగమే ఆక్రమణలు తొలగిస్తారని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ అమల, వీఆర్‌వో రమణారెడ్డి, మహిళా గ్రామ సంరక్షరాలు త్రివేణి పాల్గొన్నారు.

కొత్తూరులో చోరీ

25 తులాల ఆభరణాలు, రూ.50వేల నగదు మాయం

కనిగిరి, ఫిబ్రవరి 5: అర్ధరాత్రి ఇంట్లో చొరబడి బంగారం, నగదు దోచుకెళ్లిన సంఘటన పట్టణ సమీపంలోని కొత్తూరులో సోమవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరులో నివాసం ఉంటున్న రామన భాస్కరరెడ్డి, తన భార్య అచ్చమ్మతో కలసి వారి స్వగ్రామమైన వెలిగండ్ల మండలంలోని కొర్లాలపల్లి గ్రామానికి ఆదివారం వెళ్లారు. తన కుమారుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ వారంలో ఒకరోజు కనిగిరి వస్తూంటాడు. ఈ క్రమంలో తమ తల్లిదండ్రులు ఇంట్లో లేరని తెలసి తమ అత్తవారిల్లు కూడా కొత్తూరులోనే కావడంతో అక్కడికి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం హర్షవర్ధన్‌రెడ్డి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపు తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో 25 తులాల బంగారం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ దాసరి శ్రీనివాసరావు, ఎస్ఐ త్యాగరాజు వెళ్లి పరిశీలించారు.

100 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

పామూరు, ఫిబ్రవరి 5 : మద్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సైదుబాబు తెలిపారు. కారులో అక్రమంగా మద్యంను తరలిస్తుండగా దాడి చేయగా 100 బాటిళ్లతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, ఫిబ్రవరి 5 : వైసీపీ సాగనంపేందు కు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు. సోమవారం వెలిగండ్లలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అమరావతి రాజధానిగా ప్రకటించి టీడీపీ అభివృద్ధి చేసిందని, జగన్‌రెడ్డి వచ్చి రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. అభివృద్ధి పను లు చేయక, రాజధాని లేకుండా చేసిన జగన్ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలి పించాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి ప్రాంత సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తాన న్నారు. మహిళలతోపాటు యువత, రైతుల అ భివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సూపర్‌సిక్స్ పథ కాలను చంద్రబాబు అమలు చేయనున్నారని ఉగ్ర తెలిపారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు జగన్‌రెడ్డి పాలనలో జరిగిన నష్టాన్ని వివరించాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్రూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మౌలాలీ, జిల్లా ఎస్సీసెల్ అధికారప్రతియిధి సలోమన్ రాజు, కొండు భాస్కర్‌రెడ్డి కర్నాటి భాస్కర్ రెడ్డి, మీనిగ కాశయ్య, కారంపూడి వెంటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మెటాటి సుబ్బరెడ్డి, కృష్ణారెడ్డి, కేసరి రమణా రెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గోన్నారు

ముందస్తుగా ఉగ్ర జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలను ముదస్తుగా నిర్వహించారు. సోమవారం వెలిగండ్ల టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఉగ్ర కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన్ని నాయకులు, కార్యకర్తలు పూలమాలతో సత్కరించారు.


మాట్లాడుతున్న శివకోటేశ్వరరావు

నేడు టీడీపీ జయహో బీసీ సదస్సు

దొనకొండ, ఫిబ్రవరి 5 : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దొనకొండలోని జయహో బీసీ సదస్సు ఒబ్బాపురంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామని టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, మోడి వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావులు తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సదస్సుకు జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, టీడీపీ చీరాల ఇ న్‌చార్జి ఎంఎం కొండయ్య, దర్శి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నాదెండ్ల బ్ర హ్మంచౌదరి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బీసీ సోదరులు సకాలంలో తప్పక హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం ఒబ్బాపురంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ, భోజన ఏ ర్పాట్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుగ్గెంపూడి చెంచయ్య, కుందుర్తి లక్ష్మణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు నోటీసులు

పీసీపల్లి, ఫిబ్రవరి 5 : వైసీపీ ప్రభుత్వం పంచాయతీలోని నిధులను దారిమళ్లించడాన్ని నిరసిస్తూ చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సర్పంచ్‌లు వెళ్లొద్దని పోలీసులు సోమవారం నోటీసులు అందజేశారు. నోటీసులు జారీచేసిన పోలీసులు సర్పంచ్‌లను బైండోవర్ చేశారు. ఉల్లంఘించి ముట్టడి కార్యక్రమంలో పాల్గొంటే చర్యలు తప్పవని ఆ నోటీసులో పేర్కొన్నారు.


పతకాలను అందజేసిన హీరో సుమన్


కరాటేలో కనిగిరి విద్యార్థుల ప్రతిభ

హీరో సుమన్ ద్వారా పతకాలను అందుకున్న విజేతలు

కనిగిరి, ఫిబ్రవరి 5 : విశాఖపట్నం రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో ఈనెల 3, 4 తేదీల్లో ఏడవ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కనిగిరికి చెందిన కరాటే డో స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరచి బంగారు, రజిత పతకాలు సాధించినట్లు అకాడమీ మాస్టర్ యాసిన్ ఆదివారం తెలిపారు. పోటీల్లో క్రీడాకారులు బాల బాలికల ఫైట్, కటాస్ విభాగంలో అండర్ - 11 కటాస్ విభాగంలో షేక్ అఫ్రుద్దీన్, ఫైట్ విభాగంలో ఆర్.హర్షవర్ధన్‌రెడ్డి బంగారు పతకాలు సాధించారు. అండర్ - 12 కటాస్, ఫైట్ విభాగంలో బీవీఎస్ హేమంత్ సాయి రెండు రజత పతకాలు, అండర్ - 13 కటాస్ విభాంగంలో పీ వెంకటరాజేశ్వరి బంగారు పతకం, కటాస్ విభాగంలో ఏ శశిరారెడ్డి రజత పతకంతో పాటు ఫైట్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. అండర్ - 14 విభాగంలో టీ విష్ణు బంగారు పతకం, కటాస్ విభాగంలో ఆర్ జ్ఞానదీక్ష రజత పతకం, కాంస్య పతకం సాధించగా, కే మానస ఫైట్, కటాస్ విభాగంలో రజత, కాంస్య పతకాలు సాధించింది. అండర్ - 15 విభాగంలో పీ రాజ్యలక్ష్మీ కటాస్ విభాగంలో కాంస్య పతకం, యోగేశ్వర ఆనంద్ రజత పతకాలు సాధించారు. ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా క్రీడాకారులకు పతకాలు అందుకున్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు షేక్ అబ్దుల్ వహీద్, షేక్ సుల్తాన్‌బాషాలను అభినందించి బెస్ట్ టీం ట్రోఫీని అందించినట్లు అకాడమీ మాస్టర్ తెలిపారు.

నిరుద్యోగులను మోసగించిన జగన్‌ను గద్దె దించుతాం..!

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, యూటీఎఫ్ నాయకుడు మీగడ


ధర్నా నుద్దేశించి మాట్లాడుతున్న రామన్న

కనిగిరి, ఫిబ్రవరి 5: నిరుద్యోగులను మోసగించిన సీఎం జగన్‌రెడ్డిని గద్దె దించుతామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న అన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలో ర్యాలీ, పామూరు బస్టాండు సెంటరులో మానవహారం చేపట్టి అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పాల్గొన్న డీవైఎఫ్ఐ నాయకులు రామన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అంటూ నిరుద్యోగులను మోసం చేస్తూ వచ్చిందన్నారు. జగన్ 2019 ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ ద్వారా ఏటా వేలాది పోస్టులు ఇస్తామని మాటతప్పారన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిరుద్యోగులను తిరిగి మోసగించేందుకు మెగా డీఎస్సీ అంటూ దగాకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. చేతగాని ప్రకటనలకు నిరుద్యోగులు మోసపోయే స్థితిలో లేరన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక డ్రాపౌట్స్ అవుతున్నారన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ పిల్లల భవిష్యత్ కోసం కొంత మంది తల్లితండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారన్నారు. గడిచిన రెండేళ్లలో సుమారు 6లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయన్నారు. కానీ వాటిని బయటికి వెల్లడించకుండా ప్రభుత్వం ఉపాధ్యాయులు పట్ల నిరంకుశ ధోరణి అవలంబిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు 10లక్షల మంది నిరుద్యోగలు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తక్షణమే జగన్ మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు, ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. యూటీఎఫ్ నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 1.80 లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సి ఉం డగా కేవలం 1.69 లక్షల మంది మాత్రమే ఉన్నారన్నారు. దాదాపు 18వేలకు పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల నియామకాలు చేపట్టకుండా కాలయాపన చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగులు ఓడించి తీరాలన్నారు. ఈనెల చివరి నాటికి మరో 5వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్రంలో విరమణ పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వమే లెక్కలు చెప్పిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం 117 జీవో పేరుతో మరో 10వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసి అన్యాయం చేసిందని మండిపడ్డారు. పాఠశాలల్లో తెలుగు మీడియం తీసివేసి 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిన ఘనత దేశంలో దిక్కుమాలిన సీఎం జగన్ ఒక్కడే అని దుయ్యబట్టారు. 2వేల పాఠశాలలు మూసేసి రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 9వేలు ఉన్నాయని చెప్పి, ఇప్పుడు తాజాగా ఖాళీలు లేవని చెప్పడం వైసీపీ అసమర్ధ పాలన స్పష్టం చేస్తోందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో జాన్‌ఇర్విన్‌కు అందచేశారు. కనిగిరి డీవైఎఫ్ఐ కార్యదర్శి నరేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు, అధ్యక్షులు కేవి పిచ్చయ్య, నారాయణ, సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు, శ్రీను, మహ్మమ్మద్, డీఎస్సీ అభ్యర్థులు కల్యాణ్, రవి, జాస్మిని, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 6 ఫిబ్రవరి 2024



బాపట్ల: జమ్ములపాలెం రోడ్డులో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

పునాదులకే.. సంబరాలా?

- మెడికల్ కళాశాల శంకుస్థాపనకు రెండేళ్లు దాటాయి..
- 2023 చివరికల్లా పూర్తి చేస్తామన్న పాలకుల మాటలు ప్రగల్భాలే
- పునాదుల దశలోనే వైద్య కళాశాల పనులు
- 2025 - 26కల్లా అందుబాటులోకి అంటూ కొత్త పల్లవి
- కేటాయించిన స్థలం మీద పలు ఆరోపణలు

శంకుస్థాపనలప్పుడు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడం.. తర్వాత వాటిని అటకెక్కించడం ప్రస్తుత ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్యలా తయారైంది. 2021 మే చివరన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో, బాపట్ల పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు టీచింగ్ హాస్పటల్‌కు సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోపు మెడికల్ కళాశాల, ఆసుపత్రి పూర్తి చేస్తామని ఆనాడు ఎంతో గొప్పలు చెప్పినా అవి ఆచరణలో కనిపించడం లేదు. నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్ల వరకు అటువైపు పాలకులు కన్నెత్తి చూడలేదు. ఆరు నెలల క్రితం నుంచే వాటి పనులు ప్రారంభిం చారు. ప్రస్తుతానికి ఫిల్లర్ల దశలో మెడికల్ కళాశాల పనులు ఉన్నాయి. ఇప్పుడు 2025 - 26 కల్లా మెడికల్ కళాశాల సేవలను అందుబాటులోకి తెస్తామనే మాటలు చెబుతూ ఎన్నికల సమీపిస్తున్న వేళ మరో గారడీకి తెరలేపారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

30 శాతమే పనులు పూర్తి..

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మెడికల్ కళాశాల మొత్తం రెండున్నర లక్షల చదరపు అడుగులలో నాలుగు బ్లాక్‌లలో నిర్మాణాలు చేయాల్సి వుండగా శ్లాబులు పూర్తయ్యాయి. మూడు బ్లాక్‌లలో పని నత్తనడకన కొనసాగుతున్నాయి. మెడికల్ ఆసుపత్రి నిర్మాణం కూడా ఆరు బ్లాక్‌లుగా విభజించగా ఐదు బ్లాక్‌లు కొంతమేర పనులు పూర్తయ్యాయి. మొత్తం మీద మెడికల్ కళాశాల, ఆసుపత్రి భవన నిర్మాణాలు రెండు సంవత్సరాల 8 నెలలకు 30 శాతమే పూర్తయ్యాయి. మొత్తం భవనాలకు శ్లాబులు వేయగా లోపల పార్టీషియన్‌లు, ఇంకా కొంతపని చేయాల్సి వుంది. ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ 30 శాతం పనులు చేసేందుకే మూడేళ్లు గడిస్తే మిగిలిన 70శాతం పనులు చేసేం దుకు ఇంకెన్నేళ్లు పడుతుందో. మెడికల్ కాలేజి ముందుభాగం వరకు త్వరితగతిన మొక్కుబడిగా పనులు పూర్తిచేసి రంగులు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాలను సీఎం జగన్‌చే ప్రారంభించేం దుకు నేతలు సన్నద్ధమవుతున్నారు.



పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల

బాపట్ల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కిందట బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మెడికల్ కాలేజీల నిర్మాణాలకు సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వం అందుబాటులోకి తెస్తానన్న మెడికల్ కళాశాల అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలకు అత్యవసర వైద్యం కష్టాలు తప్పడం లేదు. బాపట్లలోని ఏరియా ఆసుపత్రిలో అత్యవసర వైద్యానికి కావాల్సిన సదుపాయాలు, నిపుణులైన డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలొదులుతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. గతేడాది టెన్త్ మూల్యాంకనం కోసం బాపట్ల వచ్చిన ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా తొలుత అతనిని ఏరియా ఆస్పత్రికే తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు రిఫర్ చేయగా మార్గ మధ్యంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. సకాలంలో వైద్యం అంది ఉంటే ఆ ఉపాధ్యాయుడు బతికేవారని అభిప్రాయం అప్పుడు వ్యక్తమైంది. ప్రాణాపాయ సమయాల్లో బాపట్లలో వైద్యం అందకపోవడంపట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపన చేసిన వెంటనే..

మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేసిన వెంటనే పనులు మొదలుపెట్టి ఉంటే ఈ పాటికే ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చేవని, కానీ ప్రభుత్వం రెండేళ్ల పాటు నిర్మాణం ఊసే ఎత్తలేదని ప్రజలు మండిపడుతున్నారు. పెరిగిన వైద్య అవసరాలకు తగ్గట్లు బాపట్లలో సదుపాయాలు లేవని, ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్యశాలగా మార్చే అంశం మీద కూడా పాలకులు దృష్టిపెట్టకుండా మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తోందంటూ మోసపూరిత ప్రకటనలకే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడచిన ఆరు నెలల నుంచి మెడికల్ కళాశాల పనుల్లో కదలిక ప్రారంభమైంది. అంతకు ముందు వరకు అతీగతీ లేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల నుంచి వచ్చే విమర్శలు తప్పించుకోవడానికే పనులు మొదలుపెట్టారని చిత్తశుద్ధి ఉంటే ప్రారంభించిన సంవత్సరంలోనే నిర్మాణం చేపట్టేవారనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేయడం గమనార్హం.



పునాదుల్లోనే జమ్ములపాలెం రోడ్డులో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

కేటాయించిన స్థలంపై ఆరోపణలు

మెడికల్ కళాశాల నిర్మాణం కోసం బాపట్ల పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 50 ఎకరాల స్థలం కేటాయించారు. ఓ దాత విరాళంగా ఆ భూమిని ఇచ్చారని చెబుతున్నారు. అదంతా అసైన్డ్ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో నిక్షిప్తమై ఉంది. ఆ భూమే అసైన్డ్ అయినప్పుడు చేతులు మార్చుకున్న వ్యక్తి వాటిని వితరణగా ఇవ్వడమేంటో అన్నదానికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఈ భూమి కేటాయింపులో రియల్ ప్రయోజనాలే ఎక్కువగా పని చేశాయనే విమర్శలు ఉన్నాయి.

ప్రతిబంధకంగా ఎన్‌ఎంసీ ఆంక్షలు

ప్రభుత్వం సకాలంలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టకపోవడం వల్ల కొత్త చిక్కు కూడా వచ్చిపడింది. ప్రతి పదిలక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండాలన్న జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) నిబంధనలు భవిష్యత్తులో ప్రారంభించబోయే వైద్య కళాశాలలకు గొడ్డలి పెట్టు కానుంది. మరో మూడేళ్లలో వీటి నిర్మాణం పూర్తయినా ఎన్‌ఎంసీ కొత్తగా తీసుకొచ్చిన ఆంక్షల వల్ల తరగతులు ప్రారంభం కావడం కూడా కష్టమేనని అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్త చేస్తున్నారు. ఇన్ని బాలారిష్టాలను దాటి బాపట్లలో మెడికల్ కళాశాల సేవలు అందుబాటులోకి రావాలంటే ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలో అని ప్రజానీకం వాపోతోంది.

ఊగిసలాట!

- పర్చూరుపై వైసీపీ మంతనాలు
- ఆమంచిని పిలిచి మాట్లాడిన అధిష్టానం
- తొలుత ముఖ్య నాయకులు, ఆపై సీఎంతో భేటీ

చీరాల, ఫిబ్రవరి 5: చీరాల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సోమవారం సీఎంవో పెద్దలను కలిశారు. వారి మధ్య జరిగిన చర్చపై స్పష్టత లేకపోయినప్పటికీ ఆమంచి అనుచరులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పర్చూరు నియోజవర్గ అభ్యర్థిగా కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలనేది సీఎం జగన్ మొదటి నుంచి చెప్తున్న మాట. అందులో భాగంగానే ఆమంచిని పర్చూరు ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే, అప్పట్లో తనకు కొన్ని హామీలు ఇచ్చారని, వాటిని నెరవేర్చాలని ఆమంచి పట్టుబడుతున్నట్లు ఆయన సన్నిహితులు చెప్తున్నారు. ఇదేఅంశాన్ని సీఎంవో పెద్దలతో పాటు, సీఎం జగన్‌కు కూడా తెగేసి చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఆక్రమంలో ఆమంచి తాను చీరాల నుంచి పోటీ చేస్తాననే మాటను అంతరంగికులకు చెప్పటంతో విషయాన్ని తానే తెగేదాక తెచ్చుకున్నట్లు భావించిన అధిష్టానం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టింది. ఆ క్రమంలో గొట్టిపాటి భరత్‌తో పాటు పలుపేర్లు తెరపైకి వచ్చాయి. అప్పట్లో మాజీ మంత్రి బాలినేని పర్చూరు ఇన్‌చార్జ్ విషయంలో ఆమంచిని వ్యతిరేకించారు. మరో కాపు సామాజికవర్గ అభ్యర్థిని సూచించాలని ఆ బాధ్యతను బాలినేనికే జగన్ అప్పగించారు. అది కార్యరూపం దాల్చలేదు.

ఆధిపత్య పోరులో భాగమేనా?

ఇదిలాఉంటే చీరాల నియోజక వర్గంలో ఆమంచి అనుచరులు ఒక్కొక్కరుగా వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ తో జతక డుతున్నారు. రెండురోజుల క్రితం ఆమంచికి అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొం దిన వారిలో గరికపాటి సుధీర్, పైడి రాజేష్, కౌన్సిలర్ సత్యానందం లు వెంకటేష్, ఎమ్మెల్యే బలరాంలను కలసి తమ మద్దతు తెలి పారు. అంతకు ముందు ఆమంచి శిబిరంలోని కొందరు కౌన్సిల ర్లు, నాయకులు వెంకటేష్‌తో కలసి ప్రయాణం చేస్తున్నారు. ఈక్రమంలో మిగిలిన కౌన్సిలర్లు, పలువురు నాయకులు సోమవారం ఆమంచిని కలసి తాము మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మీతో కలసి ప్రయాణం చేస్తామని, చెప్పినట్లు తెలిసింది. అతరువాత ఆమంచి సీఎంవోకు వెళ్లారు. ఈ సమావేశం లో కూడా సీఎంవో పెద్దలకు తాను మొదటి నుంచి ఏ స్టాండ్ మీద ఉన్నానో, అదే స్టాండ్ మీద ఉంటానని చెప్పనున్నట్లు ఆమంచి వారికి చెప్పినట్లు తెలిసింది. అయితే, ప్రత్యక్షంగా, పరోక్షంగా పర్చూరు నియోజకవర్గంలో ఆ మంచికి స్వపక్షంలోనే వైరివర్గీయులు దండిగా ఉన్నారు. చీరాల నియోజకవర్గంలో ఉన్న అను చరులు ఒక్కొక్కరుగా జారిపోతున్నారు.

ఈ నేపథ్యంలో ఆమంచి రెండు నియోజకవర్గాల్లో ద్విపాత్రాభి నయం కొనసాగిస్తారో.. తెరదించు తారో వేచి చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకు లు అంటున్నారు. అయితే, పైకి కనిపించేది ఆమంచి, ఇతరత్రా పేర్లు ఉన్నా.. వాస్తవానికి ఇదంతా బాలినేని, వైవీ సుబ్బారెడ్డిల మధ్య ఆధిపత్య పోరులో భాగమేనని రాజకీయ వర్గాలతో పాటు వైసీపీ వర్గీయులు కూడా కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

బస్సు యాత్ర సందర్భంలో..

ఈనేపథ్యంలో వైవీ సుబ్బారెడ్డి ఆశీస్సులతో ఆమంచి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు ప్రచారం జరిగింది. చీరాలలో వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా కరణం వెంకటేష్ పేరును ఆ యాత్రలో పాల్గొన్న పలువురు నేతలు చీరాల వైసీపీ అభ్యర్థిగా ప్రకటించటంతో ఆమంచి ఉలికిపాటుకు లోనయ్యారు. వెంటనే సీఎంవో పెద్దలను కలిశారు. తన వాదనను వినిపించారు. అయితే, వారినుంచి సానుకూల స్పందన రానట్లు సమాచారం. ఈక్రమంలో వైసీపీ పెద్దలు, సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించటంతో పాత, కొత్త పేర్లు కొన్ని తెరపైకి వచ్చాయి. దీంతో ఆమంచి మరలా సీఎంవో పెద్దలను కలసి తన మనోగతాన్ని వివరించారు.



అవునన్నారా, కాదన్నారా..?

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎంపికపై అధిష్టానంలో ఊగిసలాట ధోరణి కనిపిస్తోంది. ప్రస్తుతం అక్కడ ఇన్‌చార్జిగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఉండగా ఇటీవల మరికొందరిని అధిష్టానం పిలిచి మీరు పోటీ చేసేం దుకు సిద్ధమా? అంటూ అడిగారు. సోమవారం ఆమంచిని కూడా అధిష్టానం పిలిచి రాష్ట్ర నాయకులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. చీరాల టికెట్‌ను పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్‌కు ఓకే చెప్పిన జగన్ పర్చూరు నుంచి ఆమంచినే రంగంలోకి దిం పాలన్న ఆలోచనలో ఉన్న విషయం తెలిసిందే. పర్చూరు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే అనేక ఆరోపణలు రావటమే గాక సొంత పార్టీ నాయకుల నుంచే ఆమంచి విమర్శలను ఎదుర్కొన్నారు. దీనికితోడు నియోజకవర్గంలో ప్రధానమైన కమ్మ సామాజికవర్గం నేతలను దూషించటం, వ్యాపారులను వేధించటం లాంటి చర్యలకు పాల్పడ్డారు. గత పక్షంరోజులుగా ఆయన పర్చూరు నుంచి కాకుండా చీరాల నుంచే పోటీ చేసే ఆలోచనలో ఉన్నారన్న సంకేతాలు ఇచ్చారు. ఒకటి రెండుసార్లు చీరాలలో తన అనుచరులతో సమావేశమై అలాంటి సంకేతాలిచ్చారు. తదనంతరం సీఎం జగన్ మాజీ ఎమ్మెల్యే, దివంగత గొట్టిపాటి నరసయ్య కుమారుడు భరత్‌ను పిలిపించుకుని పోటీకి సిద్ధమా అయితే ఇంత ఆర్థికవ్యయాన్ని భరించగలరా అని అడగటం తెలిసిందే. ఆర్థికాంశాలలో కొంత ఆయన వెనక్కు తగ్గినట్లు తెలిసింది. ఆదివారం మరికొందరికి ఫోన్ చేసి పర్చూరు నుంచి రంగంలోకి వచ్చేందుకు సిద్ధమా అని మాట్లాడినట్లు తెలిసింది. కమ్మ సామాజికవర్గం నుంచి మాజీ ఇన్‌చార్జి రామనాథంబాబు, చిలకలూరిపేటకు చెందిన సురేష్ అనే వ్యాపారవేత్త రేసులో ఉన్నప్పటికీ వారిని పక్కనపెట్టి వేరే సామాజికవర్గం వారికి ఫోన్లు చేసి పర్చూరులో అవకాశం ఇస్తే పోటీ చేస్తారా? అని అధిష్టానం నాయకులు మాట్లాడటం విశేషం. ఒంగోలులో కాపు సామాజికవర్గ వ్యాపారవేత్త రవిశంకర్‌కు కూడా అధిష్టానం ఫోన్ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆమంచిని అధిష్టానంలోని నాయకులు తాడేపల్లికి పిలిపించుకున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డితో పాటు సీఎం ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డి కూడా ఆమంచితో మాట్లాడారు. ఆ తర్వాత సీఎం జగన్‌తో కూడా ఆయనకు భేటీ ఏర్పాటు చేశారు. పర్చూరు నుంచి పోటీ చేయాల్సిందేనని వారు సూటిగా చెప్పినట్లు తెలిసింది. వివిధ అంశాలపై చర్చల అనంతరం ఆమంచి జగన్‌ను కలవగా ఆయన కూడా అదే విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. అయితే ఆమంచి అవునన్నారా, కాదన్నారా ఇతరత్రా ఏమైనా డిమాండ్లు పెట్టారా అనేది తెలియాల్సి ఉంది.

రుణ భారం
ఉసురు తీసింది

- భర్త, పిల్లలకు టీలో ఎలుకల మందు కలిపి ఇచ్చిన తల్లి
- తాను కూడా ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారుల మృతి
- మాచర్ల మండలం నారాయణరెడ్డిపురంలో ఘటన



మాచర్ల, ఫిబ్రవరి 5: అప్పులు ఓ కుటుంబంలో చిచ్చుపెట్టాయి.. పొలం అమ్మి అప్పులు తీర్చుకుందామని భర్త చెప్పగా భార్య అందుకు అంగీకరించలేదు.. ఈ క్రమంలో దంపతులు తరచూ గొడవలు పడుతున్నారు.. కాగా ఆదివారం మధ్యాహ్న సమయంలో భర్త, పిల్లలకు టీలో ఎలుకల మందు కలిపి తాగించడమేగాక తాను కూడా తాగింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు.

వివరాల్లోకి వెళితే.. మండలంలోని నారాయణరెడ్డి పురానికి చెందిన రమావత్ రవినాయక్, తెలంగాణ రాష్ట్రం దామరచర్ల రాష్ట్రం నరసాపురానికి చెందిన వసంత భార్యాభర్తలు. వీరికి రమావత్ భానుప్రకాష్(12), కార్తీక్ ప్రకాష్, రెండున్నరేళ్ల కవలలు ఈశ్వర్, ఉమేశ్వర్‌లు సంతానం. వీరంతా నారాయణ రెడ్డిపురంలో ఉంటున్నారు. రవినాయక్ హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ వారానికోవారు నారాయణరెడ్డిపురం వస్తూ వెళ్తుంటాడు. అయితే అప్పులు పెరిగిపోవడంతో తమకున్న ఐదెకరాల పొలంలో రెండు ఎకరాలు అమ్మి అప్పులు తీర్చుదామని భార్యతో రవినాయక్ అన్నారు. ఇందుకు ఆమె అంగీకరించలేదు. దీంతో భార్యాభర్తలు కొద్ది రోజులుగా తర చూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో వసంత ఆది వారం మధ్యాహ్నం సమయంలో భర్తతోపాటు కుమారులు భానుప్రకాష్, ఈశ్వర్, ఉమేశ్వర్‌లకు టీలో ఎలుకల మందు కలిపి ఇచ్చింది. సాయంత్రానికి ముగ్గురు పిల్లలు వాంతులు చేసుకోవడంతో మాచర్ల పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పిల్లలతో కలిసి భార్యాభర్తలు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. ఈలోగా భార్యాభర్తలకు కూడా వాంతులు అవుతుండడంతో రవికుమార్ తన భార్య వసంతను నిలదీశాడు. దీంతో వసంత జరిగిన విషయమంతా చెప్పింది. దీంతో ఆ ఐదుగురిని నరసరావుకుపేటకు వైద్యులు రిఫర్ చేశారు. మార్గ మధ్యంలో ఈశ్వర్ మరణించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో భానుప్రకాష్‌ను నరసరావుపేట నుంచి నల్గొండకు రిఫర్ చేశారు. మార్గమధ్యంలో భానుప్రకాష్ కూడా మరణించాడు. కాగా భార్యాభర్తలు, ఉమేశ్వర్ నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఏడేళ్ల కార్తీక్ ప్రకాష్ అమ్మమ్మ ఊరైన నరసాపురంలో ఉంటున్నాడు. దీనిపై విజయపురిసౌత్ ఎస్‌ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు.

విశ్వకర్మయోజన పథకం ద్వారా
చేతి వృత్తిదారుల అభ్యున్నతికి కృషి

బాపట్ల,ఫిబ్రవరి 5 : విశ్వకర్మయోజన ద్వారా పేదలైన వారికి ఆర్థికచేయూతనందించాలని కలెక్టర్ పీ.రంజిత్‌బాషా తెలిపారు. విశ్వకర్మయోజనపై మునిసిపల్ కమిషనర్‌లతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేతివృత్తిదారుల అభ్యున్నతికి, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం విశ్వకర్మయోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె పట్టణాలు నుంచి 422 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎంపికచేసిన 8 రంగాల్లో వచ్చిన దరఖాస్తులను ప రిశీలించి తదుపరి అర్హుల వివరాలను ప్రభుత్వానికి పంపాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీకార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కే.అర్జున్‌నాయక్, పరిశ్రమలశాఖ జీఎం రామకృష్ణ, కమిషనర్‌లు పాల్గొన్నారు.



విశ్వకర్మయోజనపై మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా


నిరుద్యోగులకు.. నిరాశే

- డిజిటల్ సంకల్పం.. అటకెక్కింది
- ఒక్క వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ పూర్తి కాలేదు...

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లె సీమల్లో సాంకేతిక విప్లవం తీసుకురావాలని ప్రభుత్వం రెండేళ్ల కిందట నిర్ణయించింది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్న యవతకు వేగంగా పనిచేసే అపరిమిత ఇంటర్‌నెట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని గొప్పగా ప్రకటించింది. ఇందుకు అవసరమైన భవనాల నిర్మాణం చేపట్టింది. వీటి నిర్మాణం అడుగు ముందుకు పడలేదు. నిధుల కొరతతో పనులు నిలిచిపో యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క భవన నిర్మాణం పూర్తి కాలేదని సదరు శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ 26.28 కోట్లతో 165 చోట్ల వైఎస్ఆర్ డిజిటల్ గ్రంథాలయ భవనాలు నిర్మించాలని నిర్ణయించారు.



పంచాయతీ రాజ్ శాఖకు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఒక్కోక్క గ్రంథాలయం రూ 16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయాలని అంచనాలను రూపొందించారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రతి కేంద్రానికి మూడు కంప్యూటర్లు, ప్రింటర్, స్కానింగ్, నిరంతరం ఇంటర్‌నెట్ సేవలు, ఇన్వర్టర్లు, అభ్యర్థులకు కావాల్సిన స్టడీ మెటిరియల్, దిన, వార పత్రికలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ సంకల్పం అటకెక్కింది. కనీసం ఒక్క భవనం కూడా పూర్తికాలేదు. ఒక్క లక్ష రూపాయలు కూడా ఖర్చు చేయలేదు. నిర్మాణ పనుల్లో ఎలాంటి కదలిక లేదు. ఉమ్మడి గుం టూరు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

పల్లె చెంతకు సాంకేతిక సేవలొస్తాయని ఆశించిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు నిరాశే మిగిలింది. డిజిటల్ గ్రంధాలయ భవనాల నిర్మాణం విషయంలో తొలుత హడావుడి చేసిన అధికార యంత్రాంగం నిధుల కొరతతో మిన్నకున్నది. ఉపాధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడంతోనే భవనాల నిర్మాణం నిలిచిపోయిందని చెప్పవచ్చు. ఇప్పట్లో ఈ పనులు చేపట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. మూడు దశల్లో 2023 జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించినా సాధ్యం కాలేదు.

రేషన్ పంపిణీపై జేసీ దృష్టి

ఒంగోలు నగరంలో వాహనాల వద్ద బియ్యం పంపిణీ పరిశీలన



ప్రకాశం కాలనీలో వాహనంలో రేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : ఒంగోలులో రేషన్ పంపిణీపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ప్రత్యేక దృష్టిసారించారు. జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. బాధ్యతలు చేపట్టిన రోజే పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి రేషన్ వాహనం వద్ద బియ్యం పంపిణీని పరిశీలించిన ఆయన తాజాగా సోమవారం మధ్యాహ్నం ఎవరికి తెలియకుండా నగరంలో పర్యటించారు. ప్రకాశం కాలనీలో రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడంతో ఎండీయూ ఆపరేటర్ ఖంగుతిన్నారు. ఆ వాహనంలో స్టాక్ వివరాలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న కార్డుదారులతో నేరుగా మాట్లాడారు. పంపిణీ ఎలా ఉంది, సక్రమంగా మీకు సరుకులు అందుతున్నాయా లేదా అని అడిగారు. జిల్లావ్యాప్తంగా ఏ సమయంలోనైనా జేసీ తనిఖీ చేస్తారనే భయం ఎండీయూ ఆపరేటర్లలో కల్పించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతూ రాత్రికిరాత్రే లారీల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొబైల్ వాహనాల వద్దనే రేషన్ బియ్యాన్ని తనిఖీ చేసే విధానానికి శ్రీకారం చుట్టడంతో రేషన్ మాఫియా ఆలోచనలో పడింది.

ముందస్తు చర్యలతో కట్టడి

80 మంది సర్పంచ్‌లకు నోటీసులు

ఒంగోలు(క్రైం) ఫిబ్రవరి 05 : సర్పంచ్‌లపై ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తోంది. పంచాయతీ చాంబర్ ఆధ్వర్యంలో సోమవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. దీంతో జిల్లాలోని సర్పంచ్‌లు ఎవరు ఆ కార్యక్రమానికి హాజరుకాకుండా ముందస్తు చర్యలను అధికారులు తీసుకున్నారు. ఈ మేరకు సుమారు 80 మంది సర్పంచ్‌లకు పోలీసులు నోటీసులు జారీచేశారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లవద్దని హుకుం జారీ చేశారు. ఈ మేరకు జిల్లా నుంచి స్వల్ప సంఖ్యలోనే సర్పంచ్‌లు వెళ్లినట్లు సమాచారం.

కౌలు రైతుల ఆవేదన

ఇళ్ల పట్టాల కోసం పంట పొలాలు దున్నకం
శనగ వేసిన దళిత కౌలుదారులకు అన్యాయం
ఎకరా సాగుకు పెట్టుబడి రూ.18,500, నష్టపరిహారం రూ.10వేలపై ఆగ్రహం
చేతికొచ్చిన పంట చేజారిపోతుందని బాధితుల ఆవేదన



వెంగముక్కలపాలెంలో శనగ పంటను దున్నుతున్న ట్రాక్టర్

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 3 : నగర పరిధిలో జగనన్న ఇళ్లపట్టాల కోసం సేకరిస్తున్న భూమిలో సాగు చేస్తున్న దళిత కౌలు రైతులకు తీరని అన్యాయం జరిగింది. పంట మధ్య కాలంలో భూమిని లాక్కోవడంపై వారు కన్నీళ్లపర్యంతమవుతున్నారు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఈ నెల 15వ తేదీలోపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలను పంపిణీ చేయాలని భావిస్తుండగా, నిబంధనలు సైతం తుంగలో తొక్కి చేతికొస్తున్న పంట పొలాలను దున్నేస్తున్నారు. సొంతంగా పొలాలు కలిగిన యజమానులకు నష్టపరిహారం అందగా, కౌలు తీసుకుని శనగ సాగు చేసిన సుమారు యాభైమంది రైతులు లబోదిబోమంటున్నారు. అసలు కౌలుకు తీసుకున్న రైతుల్లో తొంభై శాతంమంది దళిత రైతులే ఉండటం గమనార్హం. వీరికి ప్రభుత్వం నేరుగా పైసా ఇవ్వకపోగా, పొలాలు కలిగిన యజమానులే కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించడం గమనార్హం. వారు నష్టపరిహారం కింద ఎకరాకు రూ.10వేలు మాత్రమే ఇస్తామని చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో దళిత కౌలు రైతులు వాపోతున్నారు. ఈనెలాఖరు వరకు ఆగితే అన్నీ ఖర్చులు పోను ఎకరాకు సుమారు రూ.50వేలు వస్తుందని, ఇప్పుడు పంటలు తొలగించి కేవలం రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరుతున్నారు.

2022లో ప్రతిపాదన.. ఏడాదిన్నర తర్వాత పరుగులు

ఒంగోలులో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం కోసం 2022 నవంబరులో అధికారులు, నేతలు స్థల పరిశీలన చేశారు. అందులో భాగంగా ఎన్.అగ్రహారం. మల్లేశ్వరకాలనీ, వెంగముక్కలపాలెం పరిధిలో పొలాలను పరిశీలించారు. రైతులతో చర్చించి ఒప్పించారు. ఏడాదిన్నరగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆశలు సన్నగిల్లిన రైతులు తమ పొలాలను కౌలుకు ఇచ్చారు. దీంతో కౌలురైతులు ఆ పొలాల్లో అధిక శాతం శనగ పంటను వేశారు. ఇరవై రోజుల్లో పంట చేతికొస్తే కాస్తో కూస్తో లాభాలు దక్కుతాయన్న ఆశలో ఉన్న వారికి కన్నీరే మిగిలింది. కొందరు దళిత రైతులు పదేసి ఎకరాల చొప్పున సాగు చేశారు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.18,500 ఖర్చు చేశారు. పంటలను తొలగించి ఎకరాకు రూ.10వేలు చొప్పున చెల్లిస్తే తమకు తీరని నష్టం వస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల ఆ పొలాలను పరిశీలించిన కలెక్టర్‌ను నష్టపరిహారం గురించి అడగ్గా, ప్రభుత్వపరంగా తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, భూమి యజమానుల నుంచి నష్టపరిహారం తీసుకోవాలని చెప్పడంతో కంగుతిన్నారు.

టెండర్లు తెరవకుండానే పంటలు తొలగింపు

జగనన్న ఇళ్ల స్థలాల చదును తదితర పనుల కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో వారం క్రితం టెండర్లు పిలిచారు. ఒక్క టెండరు కూడా దాఖల కాలేదు. దీంతో ఈనెల 5వ తేదీ వరకు గడువు పెంచుతూ మరో సారి టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారు కాకుండానే వైసీపీ నాయకులు పంట పలాలను దున్నేసే పనులు రెండు రోజులుగా వేగవంతం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డబ్బు.. డబ్బు..డబ్బు

అభ్యర్థుల ఎంపికకు ఇదే ప్రామాణికం
వైసీపీలో జరుగుతున్న తంతు అదే
అడిగినంత డబ్బు లేదని కష్టపడ్డ వారికి చెక్
రిజర్వ్ అయనా బీసీ అయినా అదే లెక్క

అధికార వైసీపీలో డబ్బు రాజకీయాలకు ప్రాధాన్యత పెరిగిపోయింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో ఆ పార్టీ అధిష్ఠానం ఈ తంతునే అనుసరిస్తోంది. ప్రధాన పార్టీలన్నీ అదే కోవలో ఉన్నాయనేది వాస్తవం. కానీ వైసీపీ వ్యవహారశైలి ఆ పరిస్థితిని తారస్థాయికి తీసుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. జగన్ ఆర్థిక వనరుల లేమి అనే పేరుతో పార్టీ కోసం పదేళ్లపై నుంచి కష్టపడుతున్న వారిని పక్కనేసి వేరే వారిని రంగంలోకి తేవటంలోని ఆంతర్యం అదేనని తేటతెల్లమవుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా ప్రస్తుతానికి పదింటికి పార్టీ ఇన్‌చార్జిల పేరుతో అభ్యర్థులను ఖరారు చేసింది. ఆ సందర్భంగా ఆ పార్టీ అనుసరించిన తీరుతెన్నులను పరిశీలిస్తే ఆర్థిక స్థోమతే ప్రధాన ఆయుధంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. బలహీన వర్గాల వారికి ప్రాధాన్యతనిస్తున్నామనే మాట కూడా నిజం కాదని ఆ వర్గాలకు చెందిన వారైనా వారు ఆశించిన స్థాయిలో ఆర్థిక వనరులు ఉంటేనే అవకాశం ఇస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో ఇప్పటికి పది నియోజకవర్గాల వరకు అభ్యర్థుల ఎంపికను వైసీపీ పూర్తిచేసింది. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిని కూడా దాదాపుగా ఖరారు చేసింది. ప్రస్తుతం ఇతర జిల్లాలలో జరుగుతున్న తంతును గమనిస్తే నామినేషన్ల దాఖలుకు ముందు కూడా అభ్యర్థులు మారే అవకాశం లేకపోలేదు. పదిరోజుల క్రితం ప్రకటించిన ఇన్‌చార్జిలను తాజాగా మార్పు చేస్తూ కొత్త జాబితాలు ఇవ్వటమే అందుకు నిదర్శనం. జిల్లాలో కొంతమంది ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలను సరైన ఆర్థిక వనరులు లేవన్న నెపంతో తొలగించటం కూడా జరిగింది. ఆయా అసెంబ్లీల వారీ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల్లో ఎంత ఖర్చుపెట్టాలో ముందుగానే ఆ పార్టీ నిర్ధారించుకున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలు, అభ్యర్థుల ఎంపికలో కీలకపాత్ర పోషిస్తున్న ఐప్యాక్ బృందం ఆ మేరకు ఒక నివేదికను కూడా రూపొందించింది. ఆ ప్రకారమే ఆయా నియోజకవర్గాల వారీ అభ్యర్థులను ముందుగా మీరింత సొంత నిధులను వ్యయం చేయగలరా లేదా? అని అడుగుతుండటం విశేషం.

అలాగైతేనే ఇన్‌చార్జి

ఆ పార్టీకి పట్టున్న పశ్చిమప్రాంతంలో రూ.40 కోట్లు నుంచి రూ.60కోట్లు వరకు వ్యయం చేస్తేనే ఫలితం ఉంటుందన్న భావనకు వచ్చినట్లు తెలిసింది. మార్కాపురం డివిజన్‌లోని ఒక నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేను తొలుత మీ నియోజకవర్గంలో రూ.40 కోట్లు ఖర్చుపెట్టాలి. కనీసం మీరు రూ. 30కోట్లు చూసుకుంటే రూ.10కోట్ల సహకారం అందిస్తామంటూ ఐప్యాక్ ప్రతినిధులు చర్చలు జరిపినట్లు తెలిసింది. ఇప్పటికే మూడు ఎన్నికల్లో ఉన్నదంతా పెట్టా.. అప్పులకోసం ఆస్తులు అమ్మా. రూ.10 కోట్లకన్నా మించి పెట్టలేనని ఆయన తేల్చిచెప్పినట్లు తెలిసింది. అందుకు అధిష్ఠానం ససేమిరా అనటంతో ఆయన వేరే మెలిక పెట్టారు. తర్వాత ఆర్థికవనరులు ఉన్న అభ్యర్థులు దొరకని నేపథ్యంలో ఆయనకు ఇష్టమైన స్థానాన్ని కేటాయిస్తూ పీఫ్టీ పీఫ్టీ దావాషాలో అభ్యర్థి, పార్టీ వ్యయాన్ని భరించే రీతిలో టికెట్ కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. తాను ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో తిరిగి టికెట్ ఇస్తే రూ.30 కోట్లు వ్యయానికి ఇబ్బంది లేదని చెప్పిన మరో ఎమ్మెల్యేకు నియోజకవర్గం మార్చి ఆయనకు ఇష్టం లేకపోయినా ఆ పది మేము ఇస్తాం అక్కడే ఉండండని చెప్పినట్లు సమాచారం.

రూ.20కోట్లు చూపించాకే ఇన్‌చార్జి

మరో రిజర్వ్ నియోజకవర్గంలో ఇదే పంథాను అనుసరించగా పక్కనే గుంటూరు జిల్లాకు చెందిన నాయకులు ఆర్థికంగా భరించేందుకు ముందుకు రావటంతో ఆయనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జిల్లాకే చెందిన వారికే అవకాశం ఇవ్వాలని వత్తిడి పెరగటంతో కనీసం రూ.20 కోట్లు భరించగలిగితే ఒకే అని చెప్పారు. ఆయన రూ.20 కోట్లు చూపించిన తర్వాతే ఇన్‌చార్జిగా ప్రకటించినట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక నాయకుల వత్తిడితో ఎమ్మెల్యేలను తప్పించిన నియోజకవర్గంలో మీరు అడిగిన వారికి అవకాశం ఇస్తాం. రూ. 20 కోట్లు చూపించమని ఆదేశించినట్లు తెలిసింది. అవి చూపించేందుకు ఆయన రూ.10 కోట్లు విలువైన భూములను రూ.5 కోట్లకే అమ్ముకున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. తూర్పు ప్రాంతంలోని బాపట్ల జిల్లాలో ఉన్న ఒక నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జికి ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. గత ఎన్నికల్లోనే పెద్దమొత్తం సొంత డబ్బులు పెట్టుకున్న వారు రూ.30కోట్లు కాదంటే రూ.35 కోట్లు ఖర్చు చేయగలమని మాత్రం చెప్పినట్లు తెలిసింది. అయితే రూ.70 కోట్లు పెట్టుకునే వారున్నారు, మీరెంత అని వారిని ఎత్తేసి వేరే జిల్లా వారిని రంగంలోకి తెచ్చారు. పక్కనున్న మరో నియోజకవర్గంలో ఇదే తంతు సాగుతోంది. మరో రెండు రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో కూడా ఆర్థిక వనరులున్న వారినే రంగంలోకి పంపటంలో కూడా అదే ప్రథమ లక్ష్యంగా భావిస్తున్నారు.



వైసీపీ జిల్లా కార్యాలయం

బీసీ అయినా సరే..

దక్షిణప్రాంతంలో ఉండి వేరే లోక్‌సభలో కలిసిన ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో సీనియర్ ఎమ్మెల్యేకు ఇదే సమస్య ఎదురైనట్లు తెలిసింది. ఆర్థికంగా తాను ఏమాత్రం తూగలేనని ఆయన చెప్పటంతో బీసీ సామాజిక వర్గం పేరుతో కొత్త అభ్యర్థిని రంగంలోకి దించే ప్రయత్నం చేశారు. అక్కడ వారు తొలుత సీఎం సూచించిన నేత నుంచి ఆర్థిక వనరులు సమకూరకపోవటంతో అదే సామాజికవర్గం నుంచి ఆర్థికంగా ఢోకాలేని మరొకరిని తెరపైకి తేవటం విశేషం. ఆయన వెనకడుగు వేయటం లోక్‌సభ అభ్యర్థి విషయంలో అధిష్ఠానం అంచనా తారుమారు కావటంతో అక్కడి అభ్యర్థి ఎంపికపై తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇక లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలోను అదేతంతు సాగుతోంది. ఒంగోలు లోక్‌సభ నుంచి ప్రస్తుత ఎంపీ మాగుంట విషయంలో వ్యతిరేకంగా ఉన్న జగన్ తొలుత జిల్లాకు చెందిన నాయకుల పేర్లను పరిశీలించారు. అయితే ఆర్థికాంశాల విషయంలో సంతృప్తి రానందునే వారి పేర్లను పక్కనపెట్టి దూరంలో ఉన్న జిల్లాకు చెందిన నాయకులను రంగంలోకి తేవటం విశేషం. ఈ విషయాలు క్రమేపీ వెల్లడికావటంతో వైసీపీ అనుసరిస్తున్న డబ్బే ప్రాతిపదిక వ్యవహారం ప్రజల నోళ్లలో ప్రధానంగా చర్చనీయాంశమైంది. డబ్బులుంటే ఎక్కడ ఎవరిని రంగంలోకి దించినా సరిపోతుందా అంటూ ప్రజానీకం ఆశ్చర్యచకితులవుతున్నారు.

అలా వదిలేశారు



ప్రభుత్వభూమిలో ప్రహరీ ఏర్పాటు చేసిన దృశ్యం



రోడ్డు మార్జిన్ స్థలాన్ని కొలిచి ఏర్పాటు చేసిన గుర్తు

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
అడ్డుకట్ట చర్యల్లో అధికారుల నిర్లక్ష్యం
ఎంతోకాలం కిందటే మార్కింగ్ వేసి వదిలేసిన వైనం

దర్శి, ఫిబ్రవరి 5 : దర్శి పట్టణంలో ఎంతో విలువైన స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి సొంత స్థలాల్లో కలుపుకొంటున్నారు. ఏళ్ల తరబడి ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే లేడు. ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు, వారి ఒత్తిడి మేరకు కొలతలు కొలిచి హడావుడి చేయడం తప్ప ఆక్రమణలు తొలగించిన దాఖలాలు లేవు. ఎంతోకాలం కిందట జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చి ఆ తర్వాత వదిలేశారు. దర్శి-కురిచేడు రోడ్డులోని దర్శి రెవెన్యూలోని 247, 248, 286 సర్వే నెంబర్లల్లో పది ఎకరాలకుపైగా బండి దారి భూమి ఉంది. ఆ భూమి కొన్ని సంవత్సరాలుగా దశలవారీగా ఆక్రమణలకు గురవుతోంది. ఒక కళాశాల యాజమాన్యం ఎకరం భూమిని ఆక్రమించి కళాశాలలో కలుపుకొని ప్రహరీ గోడను నిర్మించింది. మరి కొంత భూమిని చుట్టూ ఉన్న రైతులు ఆక్రమించుకొని వారి పొలాల్లో కలుపుకున్నారు. ఇటీవల కాలంలో స్థలాలకు ధరలు విపరీతంగా పెరగడంతో బండిదారి భూమిని మరికొందరు ఆక్రమించారు. ఆ ప్రాంతంలో రైతులు దారి ఆక్రమణకు గురవుతుందని, తాము పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని అనేకసార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొలతలు వేసి హద్దులను ఏర్పాటు చేశారు. ఆక్రమణలకు గురైన ప్రాంతాలను గుర్తించి తొలగింపు కోసం మార్కింగ్ కూడా ఇచ్చారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ అధికారులు అక్కడి ఆక్రమణల విషయాన్ని పట్టించుకోవడం లేదు. సుమారు 120 అడుగల వెడల్పు ఉన్న బండి దారి ప్రస్తుతం 40 అడుగులకు కుచించుకుపోయింది. కొన్నిచోట్ల పూర్తిగా ఆక్రమణకు గురైంది. అదే ప్రాంతంలో మరో దారి పోరంబోకు స్థలాన్ని కొందరు వ్యక్తులు వెంచర్‌లో కలుపుకొని రోడ్లు వేశారు. అదేవిధంగా పొదిలి రోడ్డులో వాగు పోరంబోకు భూమిని కొంతమంది ఆక్రమించి అక్కడ నిర్మాణాల కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు స్థానిక అధికారులు హడావుడి చేయడం తప్ప ఒక్కచోటా ఆక్రమణలు తొలగించలేదు. కోట్లు విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంపట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బండి దారి ఆక్రమణ తొలగింపు కోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డీసీఎం ఢీ.. ఒకరి దుర్మరణం

యాచారం, ఫిబ్రవరి 5 : ఆర్టీసీ అద్దె బస్సు డీసీఎం ఢీకొన్న ఘటనలో బస్సులో ప్రయాణికుడు దుర్మరణం పాలైన ఘటన సోమవారం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గేటు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. దేవరకొండ డిపోకు చెందిన టీఎస్ 07యుకె 4885 నెంబర్ గల ఆర్టీసీ అద్దె బస్సు ఇబ్రహీంపట్నం వైపు నుంచి దేవరకొండ వెళుతుంది. ఎదురుగా వస్తున్న డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ బస్ దగ్గరకు రాగానే ఆకస్మాత్తుగా పక్కకు తప్పించేందుకు యత్నించాడు. ఈ క్రమంలో బస్సు బయటకు తల పెట్టి చూస్తున్న యేసు(35) తలకు డీసీఎం వెనక బాగాన ఉన్న ఇనుప రాడ్ బలంగా తగలడంతో బస్సులోనే ప్రాణాలు వదిలాడు. ప్రయాణికుడి మరణానికి కారకుడైన డీసీఎంను పోలీసులు మంచాల మండలంలోని ఆగాపల్లి వద్ద పట్టుకున్నారు. కాగా మృతుడు ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని గంగారం గ్రామవాసి, మృతుడు నగరంలోని మణికొండలోని సైబర్‌టవర్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు, ఇతనికి భార్య కుమారి, భూమి, ముసల్లమ్మ కుమార్తెలతో పాటు అస్మత్‌కుమార్ అనే కుమారుడున్నారు. ప్రమాదానికి కారకుడైన డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ చెప్పారు.

100 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



బాటిళ్లను చూపిస్తున్న ఎస్ఐ సైదుబాబు

పామూరు, ఫిబ్రవరి 5 : మద్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సైదు బాబు తెలిపారు. కారులో అక్రమంగా మద్యంను తలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడి చేయగా 100 బాటిళ్లతో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెలిగండ్లలో వైసీపీకి షాక్

వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ ఉగ్ర
ఆ పార్టీని వీడిన 150 కుటుంబాలు
టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
ఎంపీటీసీ సభ్యునితో సహా పలువురు చేరిక



డాక్టర్ ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన పీ రాళ్ళపల్లి గ్రామస్థులు

వెలిగండ్ల, ఫిబ్రవరి 5 : మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. నేతల వైఖరి కారణంగా పార్టీలో కొనసాగలేమని భావించి చాలామంది తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. 15 రోజుల్లోనే దాదాపు 800 మందికి పైగా వైసీపీకి బలంగా ఉన్న కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. సోమవారం మండలంలోని జిల్లెళ్లపాడు పంచాయతీకి చెందిన సీనియర్ నాయకుడు, వైసీపీ మండల మాజీ కన్వీనర్, వెలిగండ్ల ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వరరెడ్డి ఆ పార్టీనీ వీడారు. మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతో పాటు ఆయన సతీమణి గోకులం పంచాయతీ సర్పంచ్ చిలకల సుబ్బరత్నమ్మతోపాటు జిల్లెళ్లపాడులోని 150 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారందరికీ డాక్టర్ ఉగ్ర వారికి టీడీపీలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో వైసీపీ నాయకులు ప్రజాపాలన పక్కనబెట్టి, అభివృద్ధి చేయకుం డా దోచుకున్నారని. పేదలు, దళితుల భూములను కూడా ఆక్రమించుకున్నారని చెప్పారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఎమ్మెల్యేలను మార్చుతున్న జగన్‌ను మార్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ అని చెప్పారు. తాను అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శ్యామల కాశిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, జిల్లా అధికార ప్రతినిధి గవదకట్ల హరి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మౌలాలి, జిల్లా ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సలోమన్‌రాజు, కొండ భాస్కర్‌రెడ్డి, కర్నాటి భాస్కర్‌రెడ్డి, మీనిగ కాశయ్య, కారంపూడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మెటాటి సుబ్బారెడ్డి, చిలకల కృష్ణారెడ్డి, కేసరి రమణారెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మిరప కోతలకు కూలీల డిమాండ్

- కర్నూలు, కడప, బాపట్ల జిల్లా ప్రాంతాల నుంచి రాక
- రోజు కూలి రూ.400
- తోటలో ఎండిపోతున్న కాయలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 5 : ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మిరపను సాగు చేశారు. కరీఫ్, రబీలో కలిపి 5,450 ఎకరాల్లో మిర్చి తోటలు సాగు చేశారు. ప్రస్తుతం కరీఫ్‌లో వేసిన తోటలన్నీ ముమ్మరంగా కోతకు వచ్చాయి. రబీలో సాగు చేసిన మిరప తోటలు సైతం పొలంలోనే ఉండిపోయాయి. ఒకే సారి నెల రోజుల వ్యవధిలో కోతలు రావడంతో ఒక్కసారిగా కూలీలకు భారీ డిమాండ్ ఏర్పడింది. చేతికి వచ్చిన మిరప కాయలు కాస్త చెట్టుపాలవుతాయన్నట్టుగా మిర్చి సాగు రైతులు సుదూర ప్రాంతాలకు సైతం వెళ్లి కూలీలను తెచ్చుకుంటున్నారు. ఒక్కో రైతు సాగు చేసిన ఎకరం పొలంలో కాయలు కోయాలంటే సరాసరి వారం పైగా పడుతుంది. మొదటి కోత కోసే సమయానికే నెల రోజులు దాటుతుందని, ఈలోగా వర్షాలు పడినా, లేక తోటలు బెట్టకు వచ్చినా మరలా రెండవ కోతపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో రైతులే కర్నూలు, కడప ప్రాంతాలకు వెళ్లి కూలీలను మాట్లాడుకొని తెచ్చుకుంటున్నారు. వారు ఉండేందుకు గుడారాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో ఉన్న కూలీలే కాక దర్శి, తాళ్లూరు, బాపట్ల జిల్లా అద్దంకి, పంగులూరు, బల్లికురవ ప్రాంతాల నుంచి వస్తున్నారు. వీరు కాక కర్నూలు, కడప నుంచి పెద్ద ఎత్తున కూలీలు సుమారు 2,500 నుంచి ఐదు వేల మంది కూలీలను ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, సుంకరవారిపాలెం, నాయుడుపాలెం, తమ్మలూరు, పోలవరం, శంకరాపురం, తూర్పుకంభంపాడు, నూజెండ్లపల్లితోపాటు పలు గ్రామాలకు వలస కూలీలను తెప్పించారు. ఒక్క ఉమామహేశ్వర అగ్రహారంలోనే రెండు వేల మంది కూలీలు కడప, కర్నూలు నుంచి పెద్ద సంఖ్యలో వచ్చారు. వీరికి ప్రతి రోజు నాలుగు వందల నుంచి రూ.420 వరకు కూలిని చెల్లిస్తున్నామని రైతులు చెప్తున్నారు. మరో నెల రోజుల పాటు కూలీలకు డిమాండ్ ఉంటుంది. ముమ్మరంగా మిర్చి కోతలు రావడంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. మరి కొంత మంది రైతులు మిరప తోటలు కోతలకు వచ్చినా కూలీలు దొరక్క అవస్థలు పడుతున్నారు. తోటలకు వెళ్లి చూస్తే కాయలు పండిపోయి చెట్ల మీద ఎండు మొఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



మిరప కాయలు కోస్తున్న కర్నూలు జిల్లా వాసులు

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేత దాడి

మార్టూరు, ఫిబ్రవరి 5: బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న టీడీపీ కార్యకర్త విప్పర్ల బాలకృష్ణపై వైసీపీ నేత దాడి చేశారు. ఈ సంఘటన సోమవారం ఉదయం డేగరమూడి గ్రామ పంచాయతీ పరిదిలోని ఆదర్శ కాలనీ వద్ద చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా ఈ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా సోమవారం ఆదర్శ కాలనీలో టీడీపీ కార్యకర్త విప్పర్ల బాలకృష్ణ ఇంటింటికి తిరుగుతూ కార్యక్రమం గురించి ప్రజానీకానికి వివరిస్తున్నారు. ఈ సమయంలో మహిళా సర్పంచ్ భర్త వైసీపీ నేత వీరయ్య ఆదర్శ కాలనీకి వచ్చి, ఇక్కడ నీకేమి పనంటూ కర్రతో భౌతిక దాడి చేసినట్లు బాలకృష్ణ తెలిపారు. అనంతరం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ నుంచి కానిస్టేబుల్ బాలకృష్ణకు ఫోన్‌చేసి సీఐ రమ్మన్నారని తెలిపారు. దీంతో భయపడిన బాలకృష్ణ గ్రామం నుంచి పరారయ్యారు. పార్టీ గురించి ప్రచారం చేసుకోవడం నేరమా అంటూ గ్రామ టీడీపీ నాయకులు ఆవే దన వ్యక్తం చేశారు.

ఈ విషయమై మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వీర్య ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. గ్రామానికి చెందిన బాలకృష్ణ మరో వ్యక్తితో కలిసి ఇంటింటా తిరుగుతూ వారి సెల్ ఫోన్‌లను తీసుకొని వారే పార్టీకి చెందిన యాప్‌లను లోడ్ చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమై అతను ఫిర్యాదు చేసినట్లు రాజశేఖర రెడ్డి తెలిపారు. దీనిపై విచారణ చేయడానికి బాలకృష్ణను పిలిపించామన్నారు. కేసు నమోదు చేయలేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

కలిసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు సాధ్యం

- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

కొత్తపేట(చీరాల), ఫిబ్రవరి 5: అందరం కలసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు సాధ్యమవుతాయని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక సంపత్‌నగర్ మూడురోడ్ల కూడలి సమీపంలో నిర్మాణంలో ఉన్న యాదవ కల్యాణమండపంలో సోమవారం ఆయా గ్రామాల పెద్దలు, ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పలు అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో బుర్ల వెంకట్రావు, పెరుగు బాస్కర్, కీర్తి వెంకట్రావు, వీరయ్య, గొల్లప్రోలు కృష్ణ, బుర్ల మురళి, పులి వెంకటేశ్వర్లు, పులి హరికృష్ణ, ఆతిన శ్రీనివాసరావు, ప్రసాద్, వీరాస్వామి, చుక్కా నాగలక్ష్మి, రమేష్‌యాదవ్, ఆవుల అశోక్, ఆతిన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ.. వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 5: వేటపాలెం మండల పరిధిలోని బచ్చులవారిపాలెం యువకులకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ సోమవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మనోవికాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టతరంగా మారిన గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ

- యజమానుల ఆందోళన

మార్టూరు, ఫిబ్రవరి 5: గ్రానైట్ పరిశ్రమల నిర్వహణం కష్టతరంగా మారిందని యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ తీరుపై సోమవారం మార్టూరులోని గ్రానైట్ అసోసియేషన్ కార్యాలయంలో పరిశ్రమల యజమానులు సమావేశమయ్యారు. గతనెల 30న టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్‌లో నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ తమ సిబ్బందితో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా జరిగిన వివాదంలో బాలాజీ నాయక్ ఫిర్యాదు మేరకు ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

ఈ కేసులో మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్ తో పాటు గ్రానైట్ యజమాని షేక్ రజాక్ కూడా ఉన్నారు. వీరికి పరిశ్రమల యజమానులు సంఘీభావం ప్రకటించారు. భవిష్యత్తులో మార్టూరు ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలను నిర్వహించడం కష్టతరంగా మారుతుందని సమావేశంలో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. విజిలెన్స్ ఏడీ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు, తమ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి కేసును నమోదు చేయకపోవడంతో కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా పరిశ్రమల నిర్వహణలో ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాలని మెజారిటీ గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆలోచన చేసినట్లు తెలిసింది. ఈ సమావేశానికి మార్టూరు ప్రాంతంలోని 70 మందికి పైగా గ్రానైట్ పరిశ్రమల యజమానులు హాజరయ్యారు.

షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ బలోపేతం



మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం

అద్దంకి, ఫిబ్రవరి 5: కేంద్రంలో మోదీ ప్రభుత్వం పోవాలి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అందరూ కోరుకుంటున్నారని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక హోదాపై ఎంపీలు పూర్తిగా మరిచిపోయారన్నారు. లోకసభకు పోటీచేసే వాళ్ళు సమర్థులై ఉండాలన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉండాలని చెప్పారు. షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈవిషయమై డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బాపట్ల ఎంపీగా పోటీ చేసేందుకు పార్టీ అవకాశం కల్పిస్తే తప్పకుండా పోటీ చేస్తానని జేడీ శీలం పేర్కొన్నారు. ఈనెల 7న బాపట్లలో షర్మిల ఆధ్వర్యంలో జరిగే రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోమేపల్లి శ్రీనివాసరావు, కోరే సురేంద్రనాథ్, చుండూరి నరసింహారావు, సుబ్రహ్మణ్యం, పీవీ సురేష్‌బాబు, లేళ్ళ సుబ్బారెడ్డి, ఎర్రమోతు నాగయ్య, పాలపర్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో సభను విజయవంతం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 5: ప్రతి కార్యకర్త కాంగ్రెసు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. సోమవారం ఆయన ఇంకొల్లులో పర్చూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొన్నంటి జానకిరామారావు గృహంలో సమావేశమయ్యారు. నియోజకర్గంలోని కార్యకర్తలతో మాట్లాడారు. ఈ నెల 7న బాపట్లలో జరగనున్న షర్మిల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పొన్నగంటి జానకిరామారావు, శ్రీపతి ప్రకాశ్, తోట శివ నాగేశ్వరరావు, సంపత్, పోలయ్య, మోదిన్‌బాషా, యూసూఫ్, రవి, బండ్ల నాగేశ్వరరావు, భూషణం, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీఆర్‌పీఏ గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన పుల్లారావు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వతేదీనే పెన్షన్లు ఇవ్వాలన్నారు. పీఆర్సీ డీఏ బకాయిలను మంజూరు చేయడంతో పాటు ఈపీఎఫ్ పెన్షన్లకు రూ. 10వేలు కనీస పెన్షన్‌అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషయ్య, రాంబాబు మాట్లాడుతూం ఈనెల 8వతేదీ వరకు రిలే దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు.

వార్షిక తిరునాళ్ల బాలాలయంలోనే!

- సా..గుతున్న శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణం
- ఏప్రిల్ దాటితే ముహూర్తం కోసం మరో 6 నెలలు ఆగాల్సిందే..
- 20 నెలల క్రితమే శంకుస్థాపన
- 5నెలల క్రితమే పనులు ప్రారంభం

అద్దంకి, ఫిబ్రవరి 5: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణ పనులకు 20 నెలల క్రితం శంకుస్థాపన జరిగినా... ఐదు నెలల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి.. మార్చి 25వ తేది శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాం జనేయస్వామి వార్ల వార్షిక తిరునాళ్ల ఉంది. తిరునాళ్లకు లక్షకు పైగా భక్తులు వస్తారు. గత ఏడాది అక్టోబరు నెలలో రాతి ముఖ మండపం పనులు ప్రారంభించే సమయంలో దేవాలయం ప్రాంగణంలో బాలాలయం ఏర్పాటుచేసి ప్రత్యేకంగా తయారుచేసిన విగ్రహం ఉంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. తిరునాళ్లకు పనులు ఎట్టి పరిస్థితులలో పూర్తయ్యే అవకాశం లేకపోవటంతో భక్తులు బాలాలయంలోనే స్వామి వారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. అయితే, ఏప్రిల్ 15 నాటికి పనులు పూర్తిచేసి కుంభాభిషేకం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఏప్రిల్ నెలలో కుంభాభిషేకం జరగకపోతే ముహూర్తాల కోసం నవంబర్ నెల వరకు సుమారు ఆరు నెలలపాటు ఆగాల్సి ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్మాణంలో ఉన్న రాతి మండపం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి మండపం నిర్మాణం కోసం టీటీడీ నుంచి రూ.2 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ. 2 కోట్లు దాతల సహకారంతో సేకరించేలా పనులు ప్రారంభించారు. అయితే, అంచనా వ్యయం పెరగటంతో మరో కోటి రూపాయలు టీటీడీ నుంచి మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాద నలు పంపారు.



రాతి మండపం నిర్మాణానికి వేసిన శిలాఫలకం

ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ రాతి గోడకు అవసరమైన గ్రానైట్‌ను సమకూర్చారు. ఇప్పటివరకు మరో 25 మంది భక్తులు లక్ష రూపాయలు చొప్పున విరాళాలు ఇచ్చారు. మరి కొంతమంది విరాళాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక మండపంపై గోపురం నిర్మాణానికి ఒక దాత సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. శంకుస్థాపన శిలాఫలకాన్ని 2022 జూన్ 4న అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. అయితే, పనులు చాలా ఆలస్యంగా ఏడాదిన్నర తరువాత గత ఏడాది అక్టోబరులో ప్రారంభమయ్యాయి. దీంతో తిరుణాళ్లకు ఎట్టి పరిస్థితు లలోనూ పనులు పూర్తయ్యే అవకాశం లేదు.

ఇక దేవస్థాన అధికారులు నిర్ణయించుకున్న మేరకు ఏప్రిల్ 15 నాటికైనా పనులు పూర్తయి కుంభాభిషేకం జరిపిస్తారా లేక అసంపూర్తి గానే పనులు ఉంచి కుంభాభిషేకం చేస్తారా అన్న మీమాంస నెలకొంది. ఏప్రిల్ తరువాత మరో ఆరు నెలల వరకు ముహర్తాలు లేకపోవటంతో పనులు వేగవంతంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

వైసీపీ పతనం ఖాయం

- మాయమాటల ముఖ్యమంత్రిని సాగనంపాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 5: గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు మరలా ఎన్నికలకు సిద్ధం అని హోర్డింగులు పెట్టటం సిగ్గు చేటు అని, వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అరాంరకె, సోమవారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం కొప్పెరపాడు గ్రామ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. ఇప్పటి వరకు రూ.13 లక్షల కోట్లు అప్పులు చేసి పేదలకు అరకొరగా సంక్షేమ పథకాలు అందించి పెద్ద ఎత్తున ప్రభుత్వ ధనాన్ని తన సొంత ప్యాలెస్‌కు తరలించారని ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరిట పెద్ద ఎత్తున వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలకు టీడీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దుచేసి, ఇప్పుడు వారిపై కపటప్రేమ చూపిస్తున్నారని అన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఓటమి తప్పదని గ్రహించి వైసీపీ అభద్రతాభావంలో ఉందన్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులు కూడా దొరక్క మండలస్థాయి నేతలకు టిక్కెట్లు ఇస్తున్నారని అన్నారు. అన్నివర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో టీడీపీ నేతలు షేక్ అబ్దుల్‌సాహెబ్, కామినేని నరసింహారావు, యర్రా మునలయ్య, గుంజి జీవరత్నం, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.



కొప్పెరపాడు గ్రామ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

బల్లికురవ, ఫిబ్రవరి 5: మండలంలోని కొప్పెరపాడు గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ నేతలు సోమవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొప్పెరపాడు బీసీ కాలనీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు గుంజి సరోజని, అమె కుమారుడు జీవరత్నం, యార్రా కోటేశ్వరరావు (ముసలయ్య), బొంతా మరియబాబు, బొంతు రామయ్య బొంతు చిన్న, బొంతా యత్రయ్య రవికుమార్‌కు సంఘీభావాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లికి న్యాయం చేయలేదు.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారంట!

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 5: 'సీఎం జగన్ చెప్పేవన్నీ కల్లబొల్లి మాటలు.. మాట తప్పటం, మడెం తిప్పటం అతని నైజం. చెల్లికి న్యాయం చేయలేదు.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని చెప్పటం అందుకు నిదర్శనం' అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలో ఎం.నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ఆమె వివరించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ సీఎం జగన్ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ వారినే అణగదొక్కారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయినవారంతా బడుగు, బలహీనవర్గాలేనన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశకతను ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో నాయ కులు దుడ్డు శామ్యూల్, దుడ్డు జయరావు, తేళ్ల శేఖరబాబు, తేళ్ల దేవదా నం, ఉసిరిపాటి సురేష్, కొతవరపు జనార్దనరావు, డేటా నాగేశ్వరరావు, గంజి పురుషోత్తం, గజవల్లి శ్రీనివాసరావు, రత్నబాబు, కిషోర్, తేజ, తేలప్రోలు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

టీడీపీ శ్రేణులను అదుపులోకి తీసుకోవటం దారుణం

చీరాల, ఫిబ్రవరి 5: టీడీపీ శ్రేణులను అదుపులోకి తీసుకోవటం దారుణమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో సర్పంచ్‌లు పాల్గొనకుండా ముందస్తుగా నియోజకవర్గ పరిధిలోని టీడీపీ ముఖ్య నాయకులకు ముందస్తు నోటీసులు ఇచ్చి స్టేషన్లకు తరలించారు. కొండయ్యను కొంతసేపు హౌస్ అరెస్ట్ చేశారు.

ఈక్రమంలో కొండయ్య పోలీస్ అధికారులతో మాట్లాడారు. తరువాత వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ స్టేషన్లో ఉన్న తమ పార్టీ నాయకులను వెలుపలకు తీసుకొచ్చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతవరణానికి భంగం కలిగిం చేవిధంగా చేపట్టే చర్యలను ప్రజలు హర్షించరన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరులో చిచ్చురేపుతున్న వైసీపీ

- టీడీపీ నేత జమాలుద్దీన్ ధ్వజం

పర్చూరు, ఫిబ్రవరి 5: పర్చూరులో తిరుగులేని శక్తిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ముస్లిం మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జమాలుద్దీన్ అన్నారు. సోమవారం పర్చూరులోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జమాలుద్దీన్ మాట్లాడుతూ ఏలూరిని రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ పెద్దలు తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఇలాంటి చర్యలకు భయపడేది లేదని చెప్పారు. గత 12 ఏళ్ళుగా పర్చూరు నియోజకవర్గం ప్రశాంత వాతావరణంలో అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. ప్రస్తుత వైసీపీ పెద్దలు రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టి అలజడులు సృష్టించే విధంగా నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అధికారం కోసం రాజకీయంగా పోటీపడాలే తప్ప అక్రమ కేసులు బనాయించం ఏమిటని ప్రశ్నించారు. కొద్దిరోజుల క్రితం కర్రలు, కారం ప్యాకెట్లతో వైసీపీ గూండాలు మైనింగ్ అధికారులతో కలసి మార్టూరు గ్రానైట్ పరిశ్రమలలో తనిఖీలకు వచ్చారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జమాలుద్దీన్

ఇదేమిటని ప్రశ్నించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు, టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, కారంచేడు మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాశీం, షేక్ హుస్సేన్, రఫీ, షేక్ గౌస్, షేక్ ట్విన్, పఠాన్ బాజీ, మస్తాన్‌వలి, ఫారూక్, సుభానీ, షేక్ అక్రమ్, రెహమాన్, షేక్ కరీముల్లా, షేక్ మహబూబ్ బాషా, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

చీరాలటౌన్, ఫిబ్రవరి 5: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చీరాల తహసీల్దార్ కోమటినేని నాసరయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మండల పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించి స్థానిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ ద్వారా తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్‌ను ప్రారంభించారు. స్టాల్ ప్రతి సోమవారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎప్రాయిమ్, వరదానమ్మ, భారతి, తోటవారిపాలెం, గవినివారిపాలెం యూనిట్ సిబ్బంది కవిత, శివస్వరూప, పావని, పద్మజ, రాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో స్టాల్ ఏర్పాటు.. బల్లికురవ, ఫిబ్రవరి 5: రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆశాఖ తరపున మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను సోమవారం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఏపీసీఎన్‌ఎఫ్ ప్రాజెక్టు నుంచి వచ్చిన డీపీఎల్ఎం మోహన్ ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



బల్లికురవ మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు

సంతలో రుసుం వసూలు నిలిపివేత

అద్దంకి, ఫిబ్రవరి 5: అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించే సంతలో షాపుల నిర్వాహకుల నుంచి వసూలు చేసే రుసుంను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సహాయ మార్కెటింగ్ సహాయకులు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఫణిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి యార్డులో వసూళ్ళు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక పరిస్థితులలో రుసుంను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను యార్డులో నిర్వహించే సంతలో ఎలాంటి రుసుం చెల్లించే అవసరం లేకుండా అమ్ముకోవచ్చునని పేర్కొన్నారు.

పాలకవర్గంలో చర్చించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత దశాబ్దకాలంగా మార్కెట్ యార్డులో సంత నిర్వహణ జరుగుతున్నా ఎన్నడూలేని విధంగా ఆదివారం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రుసుం వసూలు చేయటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. దీంతో వచ్చే ఎన్నికలలో ప్రభావం చూపుతుం దన్న ఉద్దేశంతో పాలకవర్గం వెంటనే మేల్కొని రుసుం వసూలు తాత్కాలికంగా వాయిదా వేయించినట్లు తెలుస్తుంది.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు

అద్దంకి, ఫిబ్రవరి 5: రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం అద్దంకి డిపోలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 40 మంది సిబ్బందికి డాక్టర్ శ్రీనివాస్ ఉచితంగా వైద్య పరీక్షలు చేసినట్లు అసిస్టెంట్ డీఎం మహబూబీ తెలిపారు.

గుళికల మందుతిని యువకుడు ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, ఫిబ్రవరి 5: మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఎస్టీ కాలనీలో సోమవారం గుళికల మందుతిని పొట్లూరి చంటి అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్యాభర్తల మధ్య వచ్చిన కలహాల నేపథ్యంలో ఇంట్లోనే గుళికల మందు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన బంధువులు అద్దంకి 108కి సమాచారం అందించటంతో వారు వచ్చి ప్రథమ చికిత్స చేసి వెంటనే ఒంగోలు వైద్య శాలకు తరలించారు.

నేడు పంగులూరు మండల సర్వసభ్య సమావేశం

పంగులూరు, ఫిబ్రవరి 5: పంగులూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో మ్యాత్యుబాబు తెలిపారు. ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పాలకమండలి నియామకానికి చర్యలు

పంగులూరు, ఫిబ్రవరి 5: పంగులూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తిగల వారు పాలకమండలిలో సభ్యులుగా చేరేందుకు తమ పేర్లు నమోదు కోరుతూ దేవదాయశాఖ జిల్లా అధికారి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. 20 రోజులలోగా పూర్తి వివరాలతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సెయింట్‌ఆన్స్ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టా పొందిన అధ్యాపకుడిని అభినందిస్తున్న సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతనిధులు

చీరాల, ఫిబ్రవరి 5: సెయింట్‌ఆన్స్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న డి.జ్యోతి స్వరూప్ పీహెచ్‌డీ పట్టా పొందారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జ్యోతి స్వరూప్‌ను అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అక్రిడేషన్ మేనేజర్ డాక్టర్ సి.సుబ్బారావు మాట్లాడుతూ స్టడీ ఈన్ స్ట్రెంగ్త్ అండ్ కంపాటబిలిటి ఆఫ్ సిలికోమాంగనీస్ శ్లాగ్ ఫ్లైయాష్ అండ్ ఫైబర్ రిఎన్‌ఫోర్స్‌డ్ ఫైన్‌శాండ్ అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారన్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగ హెచ్‌వోడీ ప్రొఫెసర్ సీఎన్వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పరిశోధన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 5: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చీరాల పరిధిలో పలువురు అధికారులు బదిలీపై వెళ్లారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన తరువాత వేర్వేరుగా వీరిరువురు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.

శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని అన్నివిధాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అధికారులకు ఆయా కార్యాలయాల సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఆర్డీవో జీఏడీ నుంచి, ఈపూరుపాలెం ఎస్సై జిల్లా వేకెన్సీ రిజర్వు నుంచి వచ్చారు.

అద్దంకి తహసీల్దార్‌గా మహబూబ్ సుభాని

అద్దంకి, ఫిబ్రవరి 5: అద్దంకి తహసీల్దార్‌గా షేక్ మహబూబ్ సుభానీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్బారెడ్డి నెల్లూరు రూరల్‌కు బదిలీ కాగా, పెదనందిపాడు నుంచి మహబూబ్ సుభానీ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను డీటీ సుధారాణి, ఆర్ఐ శ ంకర్, ఏఎస్‌వో అమర్నాద్, రమణారావు లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని చక్రాయపాలెంలో ఇళ్ళస్థలాల రిజిస్ట్రేషన్‌ను తహసీల్దార్ మహబూబ్ సుభానీ పరిశీలించారు.

కారంచేడు తహసీల్దార్‌గా మెహర్‌కుమార్

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 5: కారంచేడు తహసీల్దార్‌గా మెహర్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా అమృతలూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటరత్నం నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మెహర్‌కుమార్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మార్టూరు రూరల్ సీఐగా సీతారామయ్య బాధ్యతల స్వీకరణ


మార్టూరు, ఫిబ్రవరి 5: మార్టూరు సర్కిల్ రూరల్ సీఐగా సీతారామయ్య సోమవారం రాత్రి మార్టూరులో బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా చిలకలూరిపేట టౌన్ సీఐగా పనిచేస్తూ మార్టూరుకు బదిలీపై వచ్చారు. ఆయన పరిదిలో యద్దనపూడి, పర్చూరు పోలీస్ స్టేషన్‌లు ఉంటాయి.

నేడు ప్రజావేదిక

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 5: గత ఏడాది మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి మంగళవారం ఉదయం పది గంటలకు ఎంపీడీవో కార్యాలయం ఆవ రణంలో ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఏపీవో గాయత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులపై జనవరి 29 నుంచి ఫిబ్రవరి 5వ వరకు 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్లు పేర్కొ న్నారు. ప్రజావేదికకు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరిం గ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు హాజరుకావాలని కోరారు.

10న జానపదాలు-జ్ఞానపదాలు గ్రంథావిష్కరణ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 5: జానపదం కళాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 10న స్థానిక గీతామందిర్‌లో ఉదయం 10 గంటలకు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన జానపదాలు-జ్ఞానపదాలు గ్రంథావిష్కరణ జరుగుతుందని కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు.దేవపాలన తెలిపారు. సోమవారం గ్రంథావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను కళాపీఠం సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహిత్య విశ్లేషకులు అన్నమనేని వెంకట్రావు, మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి రామాంజనేయులు, వారణాసి రఘురామశర్మ, భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



10 పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదన

● రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం) : ఓటర్ల సౌకర్యార్థం జిల్లాలో 10 పోలింగ్ కేంద్రాలను మార్పు చేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. శిథిల భవనాల్లో ఉన్న ఆత్మకూరు నియోజకవర్గంలో రెండు కేంద్రాలు, కోవూరులో ఒక కేంద్రం, నెల్లూరు రూరల్‌లో రెండు, సర్వేపల్లి లో మూడు, ఉదయగిరిలో రెండు కేంద్రాలను గుర్తించి అన్ని వసతులు ఉన్న సమీప ప్రభుత్వ భవనాల్లోకి మార్పు చేసేందుకు ప్రతిపాదించినట్లు చెప్పారు. తుది ఓటర్ల జాబితాకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వోలవన్న, వైసీపీ నుంచి వై.మురళీరెడ్డి, సురేంద్రబాబు, టీడీపీ నుంచి ఎస్కే. రసూల్, జలదంకి సుధాకర్, శివకుమార్, బీజేపీ నుంచి బి.శ్రీనివాసులు, కాంగ్రెస్ నుంచి ఎ. బాలసుధాకర్, బీఎస్పీ నుంచి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

అలక వీడండి.. అబ్బే.. వద్దులేండి!

నెల్లూరు పార్లమెంట్ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ససేమిరా అంటున్నారు. ఆయన్ను బుజ్జగించేందుకు అధిష్ఠానం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. మరోవైపు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి విపక్షాలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో వేమిరెడ్డి రోజుల వ్యవధిలో ఏదో ఒక కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఆయన వెంట నడవడానికి జిల్లాలోని పలువురు వైసీపీ నాయకులు సిద్ధమవుతున్నారనే ప్రచారం జోరందుకుంది.



పోటీకి వేమిరెడ్డి ససేమిరా!? ● ఫలించని వైసీపీ పెద్దల బుజ్జగింపులు

జరిగిన కుట్రపై రగిలిపోతున్న వీపీఆర్ ● భవిష్యత్తుపై త్వరలో నిర్ణయం

నెల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర అభ్యర్థి ఖరారు వెనుక అసలు కుట్రను గమనించిన వీపీఆర్ తీవ్ర మనస్తాపానికి గురై ఎన్నికల ప్రచారాన్ని ఆపేసిన విషయం తెలిసిందే. ఎన్నికల విధుల నుంచి తప్పుకోవాలని తన కార్యాలయ సిబ్బందిని సైతం ఆదేశించారు. దీంతో కొన్ని నెలలుగా సందడిగా ఉన్న వీపీఆర్ నివాసం ప్రస్తుతం బోసిపోయింది. వైసీపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం పట్ల కలత చెందిన వీపీఆర్ కుటుంబ సమేతంగా ఢిల్లీకి వెళ్లిపోయారు. అధిష్ఠానం ఆయన్ను బుజ్జగించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. జరిగిందేదో జరిగిపోయింది. అలకవీడి ఎన్నికలకు సిద్ధం కమ్మని వీపీఆర్‌ను కోరినట్లు చెబుతున్నారు. ఇందుకు ఆయన ఏమాత్రం అంగీకరించలేదని విశ్వసనీయ సమాచారం.

సన్నిహితుడైనా ససేమిరా!

వైసీపీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడు వీపీఆర్ అయినా అధిష్ఠానం బుజ్జగింపులను ఆయన లెక్కచేయకపోవడానికి బలమైన కారణాలు చెబుతున్నారు. ఎన్నికల బరిలోని ప్రధాన రాజకీయ పార్టీల బలాబలాల పరంగా చూస్తే నెల్లూరు పార్లమెంట్ పరిధిలో అభ్యర్థులు ఎవరైనా హోరాహోరీ తప్పదని పరిశీలకులు భావిస్తున్నారు. టీడీపీకి నెల్లూరు నగర నియోజకవర్గం నెల్లూరు పార్లమెంట్ ఫలితాలను శాసించే అవకాశాలు ఎక్కువ అనే భావన ఉంది. ఇవి సిటీ వైసీపీ అభ్యర్థిగా అనిల్ పోటీ చేస్తాడని అంచనాలు ఉన్నప్పటి మాట. ఇప్పుడు అనిల్ తన స్థానంలో తన అనుచరునికి టికెట్టు ఇప్పించడంతో ఈ లెక్క మారిపోయిందని వీపీఆర్ వర్గీయులు అంటు న్నారు. వీపీఆర్‌ను ఓడించాలనే కుట్రతోనే సిటీ అభ్యర్థిని ఎంపిక చేశారని వాదిస్తున్నారు. సిటీ అభ్యర్థిని మార్చాలని గట్టిగా కూడా కోరడానికి వీలులేని విధంగా వ్యూహాత్మకంగా కుట్ర పన్నారని అంటున్నారు. సిటీ అభ్యర్థిని మార్చమని కోరితే పార్లమెంట్ పరిధిలోని ముస్లిం ఓటర్లకు వీపీఆర్ వ్యతిరేకం అవుతారని, ఆవిధంగా ఒక బలమైన వర్గానికి తమ నాయకుడ్ని వ్యతిరేకం చేయాలనే కుట్రలో భాగంగా ఇలా చేశారని అంటున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న వీపీఆర్ ఇల్లు

త్వరలో కీలక నిర్ణయం

తనను ఓడించాలనే ఉద్దేశంతోనే ఇదంతా జరిగిందని వీపీఆర్ సైతం గట్టిగా విశ్వసిస్తున్నట్లు సమాచారం. అందుకే నీతిలేని చోట నిలబడలేక ఎన్నికలకు దూరం కావాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పార్లమెంట్‌కు పోటీ చేయమని వైసీపీ అగ్రనాయకులు ఎంత ఒత్తిడి చేస్తున్నా, తెలిసి తెలిసి కుట్రకు బలికావడం ఇష్టం లేక వీపీఆర్ పోటీకి ససేమిరా అంటున్నట్లు తెలిసింది. తన రాజకీయ పయనంపై త్వరలో వీపీఆర్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

పెరుగుతున్న మద్దతు

సౌమ్యుడు, వివాద రహితుడిగా గుర్తింపు పొందిన వేమిరెడ్డికి వ్యతిరేకంగా రాజకీయ కుట్ర జరగడం పట్ల ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు తీవ్రంగా స్పందిస్తున్నారు. రాజకీయంగా ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా ఆయన వెంటే నడవడానికి సిద్ధం అవుతు న్నారు. సేవా కార్యక్రమాలతోపాటు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా వీపీఆర్ తక్కువ కాలంలోనే జిల్లా పార్టీపై పట్టు సాధించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రతి నియోజకవర్గంలోనూ వ్యక్తిగతంగా ఈయన్ను అభిమానించే నాయకులు, అభిమానులు ఉన్నారు. వీపీఆర్ తీసుకోబోయే నిర్ణయం జిల్లా వైసీపీలో కుదుపు తీసుకొస్తుందో లేదా కొవ్వొత్తిలా కరిగిపోవడానికి సిద్ధపడి మెత్తపడుతుందో వేచిచూడాలి.


అందని నీరు.. ఎదగని పైరు!

● మెట్టప్రాంతంలో కర్షకుల కన్నీటి వెతలు ● ఇంకిపోతున్న నీటివనరులు
● బీడువారుతున్న వరి పొలాలు ● చివరి తడి తగ్గుతుందనే భయంతో రైతులు

ఖర్చులు పెరిగినా రైతన్నలో ఆశ చావలేదు. వ్యవసాయమే జీవనాధారమైన కర్షకులు చెరువులు, కుంటల్లో ఉన్న నీటికితోడు చివరి తడులకు నీరివ్వకపోతారా!? అన్న నమ్మకంతో పంటలు సాగుచేశారు. అప్పుడు పరిస్థితి పూర్తి విరుద్ధంగా మారింది. జలవనరులన్నీ ఇంకిపోగా, పాతాళంలోకి పడిపోయిన భూగర్భజలం బోర్లకు అందనంటోంది. ప్రధాన సోమశిల జలాశయంలో నానాటికి నీటిమట్టం పడిపోతోంది. కావలి ప్రాంతంలో నీరందక నెర్రెలిచ్చిన వరి చేనును చూసి రైతన్నలు కుమిలిపోతున్నారు. నీరిచ్చి ఆదుకోండి మహాప్రభో అంటూ వేడుకుంటున్నారు. ఇక కందుకూరులో నీటికోసం భగీరథయత్నం చేస్తున్నారు. ఖర్చులకూ వెనుకాడని రైతులు సుదూర ప్రాంతాల నుంచి పైపుల ద్వారా నీటిని తెచ్చి పొగాకు మొక్కలకు ఊపిరి పోస్తున్నారు.

సోమశిల వెల వెల!

అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటిమట్టం తగ్గి వెలవెలబోతోంది. కొంతకాలంగా ఎగువ నుంచి వరద ప్రవాహం పూర్తిగా ఆగిపోవడంతో డ్యాంలో ఉన్న నీటినే మొదటిపంట అవసరాలకు నీరు వినియోగించుకోవాల్సిన అవశ్యకత నెలకొంది. గతేడాది డిసెంబరు నుంచి రబీకి డెల్టాతోపాటు నాన్‌డెల్టాకు నీరు ఇస్తుండగా రోజువారీగా ఉన్న జలాల్లో 3,180 క్యూసెక్కులు ఖర్చు అవుతోంది. అయితే, రానున్న రోజుల్లో ఎండతీవ్రత పెరిగే అవకాశం ఉండగా ప్రాజెక్టులోని నీరు ఆవిరి రూపంలో మరికొంత వృథా అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉన్న నీటిని ఎంతో జాగ్రత్తగా వాడుకోవాల్సి ఉండగా మొదటి పంట చేతికందాలంటే ఏప్రిల్ 15 వరకు నీరు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో 24.324 టీఎంసీలు ఉండగా ఇందులో తాగు, డెడ్‌స్టోరేజీ 7టీఎంసీలు మినహాయించాల్సి ఉంది. ఇక మిగిలిన 17 టీఎంసీల నీటిని వరి చేతికందే వరకు సర్దుకోవాల్సిన పరిస్థితి. నీటి వినియోగంపై జిల్లా యంత్రాగం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. ఎక్కడా నీటి వృథా జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి. సహజంగా ఆగస్టు మాసంలో శ్రీశైలం నుంచి కృష్ణాజలాలు సోమశిలకు రావాల్సి ఉంది. గతేడాది చుక్క నీరు కూడా రాలేదు. దీంతో కండలేరుకు నీరు ఇవ్వలేని పరిస్థితి కలిగింది. ఈసారి కూడా కృష్ణమ్మ కరుణించే సూచనలు కనిపించడం లేదు. ఇప్పటికే జిల్లాలోని ప్రధాన నీటి వనరుల్లో నీట్టిమట్టం తగ్గి బోర్లకు నీరందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ ఇబ్బందులు జటిలంగా మారే ప్రమాదం ఉంది.



హైలెవల్ కెనాల్ ఆశలు ఆవిరి

ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు ఇచ్చేలా రూపొందించినసోమశిల హైలెవల్ కెనాల్ పనులు నిధులు లేమితో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. 2013లో ఈ పనులకు అంకురార్పణ జరగ్గా ఇంత వరకు సమగ్రరూపం దాల్చలేదు. ఇంకా మొదటి దశ పనులు పూర్తికాలేదు. ఏళ్లు గడుస్తున్న ఈ పను లకు సంబంధించి భూసేకరణ, పరిహారం చెల్లింపులు పూర్తికాక కాలేదు.

కందుకూరులో నీటికోసం వెంపర్లాట

కందుకూరు : పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథయత్నం చేస్తున్నారు. బెట్టవారుతున్న పైరును కాపాడుకునేందుకు రైతులు రేయింబవళ్లు పొలాల్లో జాగారం చేస్తూ సుదూర ప్రాంతాల నుంచి నీటిని తరలించి నీటితడులు ఇచ్చేందుకు నానాతంటాలు పడుతున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రధాన నీటి వనరు రాళ్లపాడు రిజర్వాయరు సహా చెరువుల కింద ఎక్కడా ఈ ఏడాది వరినాట్లు వేయలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా మెట్టపైర్లు, ఆరుతడిగా పత్తి, మిరప, కూరగాయల సాగుచేశారు. అయితే ప్రస్తుతం నీటితడులు ఇచ్చేందుకు కూడా చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోయాయి. ముఖ్యంగా పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాధారంగా సాగుచేసిన పొగతోటలు బెట్టకు వచ్చి గిడస బారుతుండటంతో మొక్కల పెరుగుదల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తుండటమేగాక రేయింబవళ్లు తోటల్లోనే జాగారం చేస్తున్నారు. ఓ వైపు దట్టంగా కురుస్తున్న మంచు మరోవైపు చిమ్మచీకట్లో విష పురుగుల భయాన్ని కూడా పక్కనపెట్టి పొగతోటలకు తడి అందించేందుకు తంటాలు పడుతున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం ఏ గ్రామం వెళ్లి చూసినా ఇవే పరిస్థితులు సాక్షాత్కరిస్తున్నాయి. ఎలాగైనా పొగతోటలకు నీరుకట్టి దిగుబడులు తగ్గకుండా చూడాలని భగీరథయత్నం చేస్తున్నారు. కిలోమీటర్ల దూరం ఒకేదఫా ఇంజన్లు ద్వారా నీటి తరలింపు సాధ్యం కాదు కనుక మధ్యమధ్యలో చిన్నచిన్న గుంతలు తీసి ఆ గుంతలకు వేసి అక్కడినుంచి మరో ఇంజనుతో చేను వరకు నీటిని తరలించి తడులు ఇస్తున్నారు. దీంతో ఒక్క ఎకరానికి రూ.20వేలకుపైనే ఖర్చవుతోంది.



కందుకూరు ప్రాంతంలో నీరు లేక ఎండిపోతున్న టమోటా తోట

'రాళ్లపాడు'లో ఏడాదీ వరి లేదాయె !

25 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న రాళ్లపాడు రిజర్వాయరు కింద వరుసగా మూడవ ఏడాదీ వరిసాగు లేకుండా పోయింది. రిజర్వాయరు పూర్తిసామర్థ్యం నీరు చేరకపోవటంతో వరిపై ఆశలు వదులుకున్నారు. కొందరు రైతులు భూములను బీళ్లుగా వదిలేయగా బోర్లు అందుబాటులో ఉన్న రైతులు పత్తి సాగుచేశారు. ఇక వర్షాధారంగా కూరగాయల సాగు చేసిన రైతులు కాపుకొచ్చిన కూరగాయల తోటలు నిలువునా ఎండిపోతు న్నా చేయగలిగింది లేక కన్నీరు కారుస్తున్నారు.



కందుకూరు ప్రాంతంలో పైపుల ద్వారా పొగతోటకు నీరు కడుతున్న రైతు

సోమశిల నీరిచ్చి కాపాడమని వేడుకోలు



జలదంకి : లేదూట గంగమ్మ చెరువులో అడుగంటిన నీరు



బోగోలు మండలం తెల్లగుంటలో నెర్రెలిచ్చిన వరి చేను

కావలి : పాలకులు, అధికారులు, రైతుల మధ్య అవగాహన లేమితో కావలి డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నీరందక పచ్చని పైరు ఎండిపోతోంది. సోమశిల నుంచి నీటి విడుదలపై స్పష్టత లేక. అధికారులు, పాలకుల మాటలకు పొంతనలేక వరిసాగుదారులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు చెరువుల్లోని నీటి నిల్వలు ఎంతవరకు వస్తాయో అంచనా వేయలేని అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు.

● కావలి మండలంలో చలంచర్ల, సిరిపురం, నారాయణపురం, పేపర్లవారిపాలెం చెరువుల్లో నీరు తక్కువగా ఉండటంతో వాటి కింద వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల నీరు రాక పోతాయా అనే నమ్మకంతో వారున్నారు. తుమ్మలపెంట చెరువులో ప్రస్తుతానికి నీరు ఉన్నా చివరితడికి తగ్గుతుందనే భయం రైతులను వెంటాడుతోంది. చౌదరిపాలెం రైతుల పరిస్థితి కూడా అంతే. ఇక బోగోలు మండలంలో ఎస్‌వీపాలెం వరకు సోమశిల నీరిస్తామని ఐఏబీ సమావేశంలో తొలుత చెప్పారు. అయితే కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరిచ్చే ఏర్పాట్లు చేస్తామని చెప్పడంతో రైతులు సాగు చేపట్టారు. కానీ, ఇప్పటివరకు నీరు రాకపోవడంతో పొలాలు బీటలు వారుతున్నాయి. జలదంకి మండలంలో కావలి కాలువకు తొలుత ఎస్‌వీపాలెం వరకు నీరు వదులుతామని చెప్పినా తర్వాత సీబీఎన్ వరకు ఇస్తామని చెప్పారు. అయితే ఆయుకట్టుకన్నా అనధికార ఆయుకట్టుకు మోటార్ల ద్వారా నీరు తోడేస్తుండటంతో దిగువ ప్రాంతానికి సరిపడా నీరు రావటంలేదని రైతులు వాపోతున్నారు. జలదంకి పెద్ద చెరువు, లేదూట గంగమ్మ చెరువుల కింద, బ్రాహ్మణక్రాక మేజరు కింద సాగుచేసిన వరిపైరుకు నీటి ఎద్దడి మొదలైంది. లేదూట గంగమ్మ చెరువులో నీరు అడుగంటి పోవటంతో గుంటల్లోని నీటిని ఆయిల్ ఇంజన్లు పెట్టి తోడుకుంటున్నారు. పైరు పొట్టదశలో ఉండటంతో ఇప్పుడు నీరు తగ్గితే దిగుబడి తగ్గే ప్రమాదం ఉన్నందున రైతులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కలిగిరి, కొండాపురం మండలాల్లోనూ వరికి నీటి కష్టాలు తప్పేలా లేవు.

నీరివ్వకపోతే నష్టపోతాం

సాగునీరు అందించకపోతే సన్న చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారు. కావలి ఎమ్మెల్యే, అధికారులు నీరిస్తామంటేనే రైతులు సాగు చేశారు. నాకున్న రెండెకరాలలో వరి సాగు చేపట్టగా నీరు చాలక ఎండి పోయే ప్రమాదం ఉంది. సోమశిల డ్యాం నీరు ఇచ్చి ఆదుకోవాలి.



- దాసరి బాబూరావు, కడనూతల చెరువు ఉపాధ్యక్షుడు

రైతులకు కోలుకోని నష్టం

సాగుచేసిన వరి పైరుకు చివరి తడి తగ్గే ప్రమాదం ఉన్నందున సోమశిల నీరిచ్చి ఆదుకోవాలి. బ్రాహ్మణక్రాక మేజరు కింద 5 ఎకరాలు సాగు చేశాను. నీరు లేకపోవడతో చీకటివాగు ఊట నీటితో అష్టకష్టాలు పడి పంటలను తడుపుకుంటున్నా. సోమశిల నీరిచ్చి రైతులను ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోతాం.



- స్వర్ణ కొండపనాయుడు, బీక్రాక అగ్రహారం

నీటి పర్యవేక్షణ కరువు

చెరువులలో ఉన్న అరకొర నీటికి కూడా పర్యవేక్షణ లేదు. గతంలో నీటిసంఘాలు ఉండగా నీటిని అవసరం మేరకే వదిలేవారు. ఇప్పుడు ఉన్న నీటిని ఇష్టాను సారంగా వదులుతున్నారు. కూలీల కొరతతో నాట్లు ఆలస్యమయ్యాయి. ఇప్పటివరకు రూ.20 వేలకుపైగా ఖర్చు అయ్యింది. చెరువులో నీరు అయిపోతున్నందున సోమశిల నీరిచ్చి ఆదుకోవాలి.

- షేక్ ఖాదర్ బాషా, సిరిపురం

తుఫాను సాయమేది జగనన్నా!?

● 4,247 మంది రైతుల ఎదురుచూపు

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 5 : రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పెద్దలు వారికి సాంత్వన చేకూర్చడంలో విఫలమవుతున్నారు. తుఫాను దాటికి నష్టపోయిన కర్షకులకు నష్టపరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా 'మిచౌంగ్' గాయం రైతులను వెంటాడుతూనే ఉంది. జిల్లాలో దాదాపు 4,237 మంది రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నా రు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో ఉద్యాన పంటల తోపాటు వరి, పొగాకు, మినుము, గోధుమ పంటలు కూడా దెబ్బతిన్నాయి. సాగునీటి విడుదల ఆలస్యం కావడంతో రబీ సీజన్ పంటలు ఆరంభ దశలోనే ధ్వంసమయ్యాయి. ఎప్పటి కప్పుడు నష్టపోయిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో అధికా రులు సేకరించి గతేడాది డిసెంబరులో ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. అయినా కేవలం 80శాతం ఇన్‌పుట్ సబ్సిడీతో విత్త నాల వరకు రైతులకు అందజేశారు. చేతికందే పంటలు తుఫాను దాటికి నష్టపోయినా ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ అందలేదు.

● ఒక్కపైసా ఇవ్వలేదు

ఉద్యాన పంటలకు సంబంధించి అరటి, నిమ్మ, బొప్పాయి తదితర పంటలు దాదాపుగా 2,330 ఎకరాల్లో దెబ్బతినగా రూ. 2.32 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ అధికారులు లెక్క తేల్చారు. ఈ పరిహారం కోసం 3,822 మంది రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు. అదేవిధంగా వరి, మినుము, గోధుమ, పొగాకు పంటలు దెబ్బతినడంతోపాటు మట్టి కోతలు, ఇసుక మేటలు ఏర్పడినవి దాదాపు 564.9 ఎకరాలుగా వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు. 425 మంది రైతులు దాదాపు రూ. 33.7 లక్షల కోసం ఎదుచూస్తూనే ఉన్నారు. సంక్రాంతి పండుగ కన్నా పరిహారం అందుతుందని రైతులు భావించినా అది జరగలేదు. కనీసం కూలి ఖర్చులకైనా పరిహారం వస్తుందన్న ఆశతో రైతన్న ఎదురుచూస్తూనే ఉన్నాడు.

పోర్టు పనుల అడ్డగింత

● ఇళ్ల స్థలాల కోసం కర్లపాలెం గ్రామస్థుల ఆందోళన

గుడ్లూరు, ఫిబ్రవరి 5 : రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను కర్లపాలెం గ్రామ మత్స్యకార కుటుంబాలు సోమవారం అడ్డుకున్నాయి. పోర్టు నిర్మాణంలో భాగంగా తమకు ఇళ్ల స్థలాలు, ఇతర ఆస్తులకు నష్టపరిహారం ఇస్తామన్న అధికారులు నేటికీ ఇవ్వలేదని అన్నారు. దీంతో ఆందోళనకు దిగినట్లు కర్లపాలెం వాసులు చాపల రమణయ్య, పిన్నే వెంకట శేషయ్య, చాపల మీరయ్య, లంకే సుబ్బారావు, చాపల శ్రీను, వల్లభన ఏడుకొండలు, కె. శ్రీనివాసులు, ఏలా శ్రీను, అప్పది తిరపతితోపాటు మరికొందరు మత్స్యకారులు తెలిపారు. త్వరలో అందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని పోర్టు ప్రతినిధులు తెలిపినా వారు వినలేదు. తమకు ఇళ్ల స్థలాలు పూర్తిస్థాయిలో కేటాయించే వరకు ఆందోళన కొనసాగిస్తామని మత్స్యకారులు తేల్చి చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి తమ న్యాయమైన కోరికలను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



రాత్రి పూట ఆత్మకూరుకు రాని ఆర్టీసీ బస్సులు

ప్రయాణికుల అవస్థలు


ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 : రాత్రి పూట కొన్ని ఆర్టీసీ బస్సులు ఆత్మకూరులోకి రావడంలేదు. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు. రాత్రి బస్సు సర్వీసులను ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ వరకు నడపాలని గతంలో నెల్లూరు ఆర్టీసీ అధికారులు కర్నూలు, కడప డిపో అధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయితే వారి ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. పొద్దుటూరు, అనంతపురం, కడప, కర్నూలు, పులివెందల, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి రాత్రిపూట సుమారు 10 ఆర్టీసీ బస్సులు తిరుగుతాయి. ఆ బస్సులన్నీ నెల్లూరుపాళెం సెంటర్‌లోనే ప్రయాణికులను దించేసి వెళ్లిపోతుంటాయి. ఈ బస్సులు నెల్లూరుపాళెం సెంటర్‌కు చేరే సరికి రాత్రి 11 నుంచి ఒంటి గంట దాటుతుంది. దాంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ఆ సమయంలో నెల్లూరుపాళెం సెంటర్‌లో ఆటోలు ఉంటే వాటిని ఆశ్రయిస్తారు. లేదంటే కాళ్లకు పని చెప్పాల్సి వస్తుంది.

బైపాస్ రైడర్లతో అవస్థలు

బైపాస్ రైడర్ల పేరుతో ఆర్టీసీ ఆత్మకూరులోకి బస్సులు నడపడం లేదు. పగటిపూట సైతం నెల్లూరుపాళెం సెంటర్‌లోనే ప్రయాణికులను దించేసి వెళతున్నాయి. ముఖ్యంగా నెల్లూరు, ఉదయగిరి డిపోలకు చెందిన ఎక్కువ బస్సులు ఈ ధోరణిని అవలంభిస్తున్నాయి. ఆత్మకూరు డిపో నుంచి నెల్లూరుకు బస్సులు ఉన్నాయికదా అంటూ ఆర్టీసీ అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి రాత్రిసర్వీసులను ఆత్మకూరు ఆర్టీసీ డిపో వరకు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పని చేయాలి


బీఎల్‌వోలకు సూచనలిస్తున్న గిరీష్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 5: మండలంలోని బీఎల్‌వోలు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఎం గిరీష్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచురించిన ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి డబుల్ ఎంట్రీలు, మృతుల ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారినుంచి ఫారం-6ను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిమెంట్ సరఫరా చేయాలి

సంగం, ఫిబ్రవరి 5: పక్కా గృహాలకు గత కొంత కాలం నుంచి సిమెంట్ సరఫరా చేయకపోవడంతో నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయని మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు సోమవారం స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావుకు ఫిర్యాదు చేశారు. హౌసింగ్ అధికారులు వెంటనే సిమెంట్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం


తహసీల్దారును సన్మానిస్తున్న సర్పంచులు, నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: మండల తహసీల్దారుగా కె నెహ్రూబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం మండల వైసీపీ నాయకులు, సర్పంచులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు ఉప్పుటూరి హరి, అశోక్‌కుమార్, ఇత్తడి రమణ, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగం తహసీల్దారుగా రమాదేవి

సంగం, ఫిబ్రవరి 5: సంగం తహసీల్దారుగా బి రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా సంగంలో పనిచేస్తున్న తహసీల్దారు నాగరాజు బాపట్ల జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా కొమరోలు నుంచి బి రమాదేవిని సంగం తహసీల్దారుగా నియమించారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

వింజమూరు తహసీల్దారుగా కృష్ణారెడ్డి

వింజమూరు, ఫిబ్రవరి 5: వింజమూరు మండల నూతన తహసీల్దారుగా ఎంవి కృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా కరీముల్లా నియామకం

ఉదయగిరి, ఫిబ్రవరి 5: ఉదయగిరి మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా శకునాలపల్లి పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లాను నియమించినట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ సోమవారం తెలిపారు. ఉదయగిరి పంచాయతీ ఈవోగా పనిచేస్తున్న నరసయ్య వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కరీముల్లాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టుకొని వదిలేశారు

అనంతసాగరం, ఫిబ్రవరి 5: మండలంలోని పాతదేవరాయపల్లిలో ఆదివారం రాత్రి సెబ్ అధికారులు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కొంత సమయానికి వదిలేశారు. తనిఖీ అధికారులంటూ చెప్పి రూ. 10 వేలు తీసుకొని వదిలేసినట్లు సమాచారం. స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

దుర్గంధం వెదజల్లుతున్న వీధులు

● ప్రజల అవస్థలు


వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: పట్టణంలోని నాగులబావి, సుద్దబావివీధులు చెత్తమయంగా మారి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గత కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్మికులు మురికి కాలువల్లో పూడిక తీసి రోడ్లపై వేశారు. తీసిన పూడికను రోజులు గడుస్తున్నా తొలగించకపోవడంతో వీధులన్నీ చెత్తమయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

ఆత్మకూరులో బైపాస్ రైడర్లు నడపాలి : సీపీఎం


ఆర్టీసీ డీఎం కరీమున్నీసాకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: ప్రజల సౌకర్యార్థం బైపాస్ రైడర్లు ఆత్మకూరు పట్టణంలోకి వచ్చే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేర వారు సోమవారం ఆర్టీసీ డీఎం కరీమున్నీసాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి డిపో బస్సులతోపాటు కడప, కర్నూలు, అనంతపురం, కల్యాణ దుర్గం తదితర బస్సులు పట్టణంలోకి వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ నందాని, వాగాల శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని పంచాయతీలకు ఇటీవల రెండో విడత మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ 17 పంచాయతీలకు రూ.86,21,823 మంజూరయ్యాయన్నారు. ప్రధానంగా తాగునీటి సరఫరా సిబ్బంది, క్లాప్‌మిత్ర వేతనాలు, వీధిదీపాల మరమ్మతులు, పూర్తయిన పనులకు బిల్లులు, పారిశుధ్యం పనులకు సంబంధించిన చెల్లింపులను వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. అలాగే గ్రామ అభివృద్ధి ప్రణాళికలను తయారుచేసి వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రేణుకా, ఈవోపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు స్పెషల్ డ్రైవ్


ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లులా

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: మున్సిపాల్టీ పరిధిలో పారిశుధ్యం మెరుగుదలకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లులా తెలిపారు. సోమవారం ఆయన మున్సిపాల్టీ పరిధిలోని 5వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, స్థానిక కౌన్సిలర్లతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పట్టణంలోని మురికి కాలువలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయని ప్రజలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం మెరుగుదలతో పాటు దోమల నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ మహబూబ్ బాషా, పొడమేకల పెంచలయ్య, మొలబంటి రాజశేఖర్, పలువురు వైసీపీ నాయకులు, మున్సిపల్ అధికారి ఖాసీం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని దాసరిపల్లి గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సోమవారం ఏపీవో బీ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను తనిఖీ చేసి కూలీల హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తూ గిట్టుబాటు కూలి పొందాలన్నారు. ఏప్రిల్ నుంచి కూలీలకు ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇకనుంచి ఉపాధి హామీ ద్వారా రైతులకు సంబంధించిన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఓపీఎస్‌ను అమలుచేసే వారికే మా ఓట్లు : యూటీఎఫ్


ఉదయగిరి రూరల్: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5 : ఎవరైతే ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)ను అమలుచేస్తారో వారికే మా ఓట్లు వేస్తామని యూటీఎఫ్ నేతలు ప్రతిన బూనారు. స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం ఓట్ ఫర్ సీపీఎస్ అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వివిధ రాజకీయ పార్టీలకు పోస్టుకార్డు ద్వారా తమ వినతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాద్‌రావు, ఆత్మకూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రామ్మోహనరావు, షేక్ ఖాదర్‌బాష, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాల యూటీఎఫ్ నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లురెడ్డి, హెచ్ హరికృష్ణ, మస్తాన్, షేక్ కాలేషా, కె మల్లికార్జున పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం నాయకులు మన ఓటు-మన భవిష్యత్తు అనే నినాదంతో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, నాయబ్‌బాష, హనీఫ్, ఫణిరాజు, సుబ్బారెడ్డి, దుర్గాప్రసాద్, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి : సీఐటీయూ


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి మళ్లీ ఓట్లు అడిగేందుకు ప్రజల వద్దకు వెళ్లాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడంతోపాటు ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై మరింత భారం మోపడం దారుణమన్నారు. మోదీ ప్రభుత్వం ఒక మతానికి ప్రతినిధిగా మారి మైనారిటీలు, దళితులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లపై తట్టెడు మట్టి వేసిన పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, గుజ్జుల మల్లికార్జున, కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరిలో వానరాలు, శునకాల స్వైర విహారం



కలిగిరి, ఫిబ్రవరి 5: పట్టణంలో వానరాలు, శునకాలు స్వైరవిహారం చేస్తూ దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజలు భీతిలుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. చిన్నారులు పాఠశాలకు వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేస్తుండడంతో ఒంటరిగా వారిని పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. వీధికుక్కలపై నియంత్రణ లేకపోవడంతో వీధుల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. ప్రజలపై దాడులకు యత్నిస్తున్నాయి. దీనికితోడు కోతులు కూడా ఇళ్లలోకి చొరబడి మహిళలపై దాడులకు దిగుతున్నాయి. పట్టణంలో కోతులు, కుక్కలను నిర్మూలించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వాటి అదుపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

దుష్టశక్తులను తరిమికొడదాం : కావ్య

కావలి,ఫిబ్రవరి 5: కావలిలో మనందరి ముందున్న ప్రధాన సమస్య దుష్టశక్తుల పాలన, దాన్ని తరిమికొట్టి తిష్టవేసి ఉన్న అవినీతిపరులను అంతం చేద్దామని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. అహింసా పట్టణంగా ఉన్న కావలిని హింసా పట్టణంగా మార్చారని పేర్కొన్నారు. కావలి అంటేనే భయపడేలా చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన ఇంటికి తాళం వేసుకుని, కావలిని వదలివెళ్లకపోతే, తాను అరగుండు గీయించుకుని తిరుగుతానన్నారు.

● **పలువురి అభినందన**

దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి(కావ్య)ని కావలి టీడీపీ ఇన్‌చార్జిగా నియమించడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ముసునూరులోని కావ్య ఆయన వద్ద కోలాహలం నెలకొంది. బాణసంచా కాల్చి, కేక్‌లు కట్‌చేస్తూ, పూలమాలలు, బొకేలు, శాలువాలతో కావ్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● **టీడీపీ పట్టణ అధ్యక్షుడికి సన్మానం**

కావలి పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన గుత్తికొండ కిషోర్‌బాబు సోమవారం పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు గుత్తికొండను కలిసి పూలమాలలు,శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటుపల్లి శ్రీదేవిచౌదరి, పోతుగంటి అలేఖ్య, మొగిలి కల్లయ్య, జ్యోతిబాబూరావు, కాకి ప్రసాద్, అన్నపూర్ణ శ్రీను, ద్రోణాదుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● **కావ్య గెలుపునకు కృషి**

బిట్రగుంట : కావలి నియోజకవర్గ ఇన్ చార్జిగా నియమితులయిన దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) గెలుపునకు అంకిత భావంతో పని చేస్తామని బోగోలు మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేస్తామని తెలిపారు. అనంతరం కావ్యను కావలిలోని ఆయన స్వగృహంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ సుధీర్‌బాబు, కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, రావి విజయ్‌కుమార్‌యాదవ్, పుట్టా సుబ్బారావు, గడ్డెకొండయ్య తదితరులు పాల్గొన్నారు.


కావలి : కావ్య కృష్ణారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు


కిషోర్‌బాబును సత్కరించిన తెలుగుదేశం నేతలు

బదిలీపై వచ్చిన తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ


కావలి నగేష్ | అల్లూరు దుర్గేశ్వరరావు | బోగోలు క్షమారాణి | లింగసముద్రం శ్రీచరణ్

అల్లూరు, ఫిబ్రవరి 5 : అల్లూరు తహసీల్దారుగా ఎస్.దుర్గేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై మండలంలోని గ్రామాల పరిస్థితులపై సమాచారం తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీలు నాగలక్ష్మి, సైమన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : లింగసముద్రం తహసీల్దార్‌గా జీ శ్రీచరణ్ సోమవారం విధుల్లో చేరారు. ఇన్‌చార్జి తహసీల్దార్ టీ ప్రసాద్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

కావలి రూరల్ : కావలి తహసీల్దార్‌గా కె. నగేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా ఈపూరు తహసీల్దార్‌గా పనిచేసిన నగేష్ బదిలీపై కావలి వచ్చారు.

బిట్రగుంట : బోగోలు తహసీల్దారుగా ఎం.క్షమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో రాజీపడేది లేదని ఆమె తెలిపారు.

కందుకూరులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ


కరపత్రాలు పంచుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 5: పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని బలరామయ్యతోట ప్రాంతంలో టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, మచ్చ మనోహర్, నందనవనం రాము, శేఖర్, నందికనమళ్ల లక్ష్మణరావు, పేలా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కావలి కాలువకు నీరివ్వాలంటూ ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

జలదంకి, ఫిబ్రవరి 5 : మండలంలో నిలువుమీద ఉన్న వరి, ఆరుతడి పంటలకు తక్షణమే కావలి కాలువ ద్వారా సాగునీరివ్వాలంటూ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాళ్లూరి మాల్యాద్రి మాట్లాడుతూ మండలంలో నిలువుమీద ఉన్న వరిపైరు, ఆరుతడి పంటలకు కాలువల ద్వారా సాగు నీరు ఇచ్చి రైతులను కాపాడాలన్నారు. రైతుసంఘం నేత రావి మాల్యాద్రి, కాంగ్రెస్ నాయకుడు వీ.శివశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దారు భరత్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి : బీజేపీ


మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

కావలిటౌన్, ఫిబ్రవరి5: ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో నమస్కార్ సమావేశ మందిరంలో నియోజకవర్గ సమావేశం జరిగింది. కన్వీనర్ సీవీసీ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారంపై కమిటీలను నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి, నాయకులు కందుకూరి సత్యనారాయణ, జీ భరత్‌కుమార్, బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ఉపకరణాల పంపిణీ

కొండపురం, ఫిబ్రవరి5: మండల పరిధిలోని కుంకువారిపాలెం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యా ఉపకరణాల పంపిణీ జరిగింది. గ్రామానికి చెందిన బొట్లగుంట మాలకొండయ్యనాయుడు 29వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు కొండపనాయుడు, మాల్యాద్రి, హరిబాబులు విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఆటవస్తువులు,భోజనప్లేట్లు అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మద్దసాని యశోదమ్మ, అంగన్‌వాడీ దొరసానమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో కంటి వ్యాధుల దూరం

కావలి రూరల్, ఫిబ్రవరి5: పౌష్టికాహారంతో కంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సరళాదేవి పేర్కొన్నారు. ముసునూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. టోల్‌ప్లాజా సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, ఆపరేషన్ మేనేజర్ ఆనంద్ సింగ్, పీఆర్వో నరసింహరావు, సేఫ్టీ మేనేజర్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం, ఫిబ్రవరి 5: మండలంలోని పెదపవనిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు అర్హులని చెప్పారు.వీరు ఈ నెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు అభ్యర్థులు మీ సేవలో గానీ, మీ దగ్గరలోని గురుకుల విద్యాలయాలను కానీ సంప్రదించాలన్నారు.

ప్రమాదాల నివారణకే భద్రతా మాసోత్సవాలు

కావలి రూరల్ : ప్రమాదాల నివారణకే రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీవో వై. సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణ ఏరియా వైద్యశాల, ప్రవీణ్ ఆర్థో మల్టీస్పెషాలిటీ వైద్యశాలల్లో సోమవారం మంచి ప్రదాత చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, రెడ్‌క్రాస్ బాధ్యుడు రవిప్రకాష్, మారుతి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు పని చేస్తాం

ఉలవపాడు, ఫిబ్రవరి 5 : రాబోవు ఎన్నికల్లో టీడీపీ గెలుపే ప్రధానంగా గ్రామాల్లో పనిచేస్తామని మండల టీడీపీ సీనియర్ సిటిజన్స్ పేర్కొన్నారు. సోమవారం ఉలవపాడులోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో సీనియర్లు, పార్టీ అభిమానుల సమావేశం జరగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండింటిని అమలు చేయగల సత్తా ఒక్క చంద్రబాబు నాయుడుకి మాత్రమే ఉందన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు తమ వంతుగా గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఎం. వెంకయ్య, మెత్తాళ్ల ప్రసాదు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి

లింగసముద్రం, ఫిబ్రవరి 5: రెండేళ్ల నుంచి రద్దు చేసిన కొండాపురం-కందుకూరు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. అయినా కందుకూరు ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు లింగసముద్రం మీదుగా కొండాపురం వచ్చి, 8 గంటలకు లింగసముద్రం మీదుగా కందుకూరు వెళ్లే ఈ బస్సును అధికారులు కలిగిరి వరకు పొడిగించారు. ఇది ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. దాన్ని రద్దు చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఆ సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

మైక్రో కంట్రోలర్ రూపకల్పనపై వర్క్‌షాప్

కందుకూరు, ఫిబ్రవరి 5: పారిశ్రామిక, గృహోపకరణాలలో ఉపయోగించే మైక్రో కంట్రోలర్ బోర్డుల రూపకల్పనకు ఆర్డినో ప్రోగ్రామింగ్ లాంగ్వేజీ ఉపయోగపడుతుందని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షకుడు బీ మహేందర్ వెల్లడించారు. మైక్రో కంట్రోలర్ బోర్డుల రూపకల్పనపై వారంపాటు జరిగే వర్క్‌షాప్ సోమవారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో అంతర్జాతీయంగా ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్న కోర్సులను పరిచయం చేస్తామన్నారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపరచటం కోసమే వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, ఈసీఈ విభాగ అధ్యాపకుడు డాక్టరు కే హనుమంతరావు, ఐ. రామకోటేశ్వరరావు, ఎన్.శ్రీహరి, ఎస్. మాధవ, జీ సురేష్, ఎస్కే మస్తాన్‌వలి, కిషోర్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం దారి ఆక్రమణపై ఫిర్యాదు

ఉలవపాడు, ఫిబ్రవరి 5: శ్మశానం దారిని ఆక్రమించారని కరేడు అరుంధతీ కాలనీవాసులు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ వీరయ్యకు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన ఓరుగంటి రెడ్లు 15 అడుగుల దారిని ఆక్రమించారని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. వీఆర్వో, విలేజ్ సర్వేయర్లను పంపించి పరిశీలిస్తామని తహసీల్దార్ చెప్పినట్లు బాధితులు చెప్పారు.

నాణ్యమైన పొగాకుపై దృష్టి పెట్టాలి

లింగసముద్రం, ఫిబ్రవరి 5 : రైతులు నాణ్యమైన పొగాకు ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని దక్షిణ ప్రాంత తేలిక నేలల ప్రాంతీయ అధికారి ఎం. లక్ష్మణరావు చెప్పారు. సోమవారం మండలంలోని ఎర్రారెడ్డిపాలెంలో పొగాకు పంటను కందుకూరు బోర్డు అధికారులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, ఐటీసీ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించి, అవగాహన కల్పించారు. పంటకు వచ్చిన ఆకులను రెలచాలని, నేలపై పట్టలు పరిచి రెలిచిన ఆకులను ఉంచాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి కే రాజగోపాల్, సీటీఆర్ఐ శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, ఐటీసీ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌బాబు, మేనేజర్ ఎ రామాంజనేయులు, సాంకేతిక అధికారి దీప్తి, సాంకేతిక సహాయకుడు నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు తదితరులు